ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam


5-9-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 217 పేజీలు: 8+4 వెల: 6.50

మరింత ఉగ్రరూపంతో ఎల్‌నినో
ప్రపంచవాతావరణ సంస్థ అంచనా

భారత్ కంపెనీతో రూ.769 కోట్ల ఆయుధ డీల్
ఎస్తోనియా రణక్షమంత్రి రాజీనామా
5లో



# నిశ్శబ్ద కల్లోలం!



● వేగంగా కరుగుతున్న హిమానీ నదాలు ● భారత్‌కు పెనుముప్పు ఏర్పడే అవకాశం ● ఓ వంక అతివృష్టి, మరో వంక అనావృష్టి ● అప్రమత్తం కాకుంటే తీవ్ర పరిణామాలు ● ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక హెచ్చరిక

**జెనీవా, సెప్టెంబరు 4:** భూమి నిశ్శబ్దంగా రగిలిపోతోంది. ప్రకృతి తన సహనాన్ని కోల్పోతూ మానవాళికి తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తోంది. ఇందుకు తాజాగా జరిగిన నేపాల్-టిబెట్ విపత్తే ఉదాహరణ. పారిశ్రామిక విప్లవానికి ముందు రోజులతో పోలిస్తే ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీలు పెరగడం వల్లే ఇలాంటి విపత్తులకు కారణమని ఐక్యరాజ్య సమితి అంచనా వేస్తోంది. అయితే, ఇది ఇంతటితో ఆగదని, మున్ముందు మరిన్ని విపత్తులను ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరించింది. అన్నిటికంటే ముఖ్యంగా, మిగిలిన దేశాలతో పోల్చితే భారతదేశం ఎదుర్కోబోయే విపత్తులకు సంబంధించిన సమాచారం ఆందోళన కలిగిస్తోంది. ఐక్యరాజ్య సమితి పర్యావరణ విభాగం యుఎన్ఇపి 'లిమిటింగ్ ఓవర్‌షూట్' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది ఇందులో అనేక సంచలన విషయాలు దాగి ఉన్నాయి. >>2

## 10, 11 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 8వ కలెక్టర్ల సదస్సు నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 10, 11వ తేదీల్లో ఈ సదస్సు జరగనుంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. తొలి రోజు గత సదస్సు నిర్ణయాల అమలుపై సమీక్షించనున్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, జిల్లా వారీ లక్ష్యాలపై కలెక్టర్లు ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. స్వర్ణఆంధ్ర-2047 జిల్లా రోడ్‌మ్యాప్‌లపై ప్రత్యేకంగా సిఎం చంద్రబాబు >>2

## గ'ఘన' విజయం



జిఎస్ఎల్‌వీఎఫ్-17 సూపర్ సక్సెస్
కక్షలోకి ఇఒఎస్ 05 ఉపగ్రహం
ఈ యేడాదిలో ఆరు ప్రయోగాలు: ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడి
ఈ విజయం దేశానికి గర్వకారణం: ప్రధాని నరేంద్రమోడీ
సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి లోకేశ్ అభినందనలు

**సూళ్లూరుపేట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** గగనతనంలో ఇస్రో మరో ఘన విజయాన్ని సాధించింది. జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ద్వారా ఇఒఎస్05 ఉపగ్రహాన్ని నిర్దేశించిన కక్షలోకి ప్రవేశపెట్టి తన సత్తా చాటింది. గత కొంతకాలంగా ఇస్రో చేపడుతున్న ప్రయోగాల్లో ఎదురవుతున్న అవాంతరాలను అధిగమించి అత్యంత ప్రతిష్టాత్మకమైన కీలక ప్రయోగాన్ని సక్సెస్ చేసి ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత దేశ కీర్తి పతాకాను ఎగురువేసింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలోని రెండవ లాంచ్ ప్యాడ్ నుంచి శుక్రవారం వేకువ జామున పిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ చీకట్లను చీల్చుకుంటూ నిప్పులు చెరుగుతూ నింగికేగిసింది. బుధవారం రాత్రి 11 గంటల 25 నిమిషాలకు ప్రారంభమైన కౌంట్ డౌన్ 27 గంటల 30 నిమిషాల పాటు కొనసాగి, భారత కాలమాన ప్రకారం రెండు గంటల 55 నిమిషాలకు జిఎస్ఎల్వి ఎఫ్ 17 రాకెట్ ఇఒఎస్ 05 భూ పరిశీలన ఉపగ్రహాన్ని జియో సింక్రోనెస్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఇస్రో శాస్త్రవేత్తలు నిర్దేశించిన రాకెట్ గమన 19 నిమిషాల సమయాన్ని ఆశించిన రీతిలో పూర్తి చేసింది. 51.70 మీటర్ల పొడవు, 2,367 టన్నుల బరువు గల ఈ రాకెట్ మొదటి దశలో నాలుగు ద్రవ ఇంధన స్ట్రాప్‌న్ బూస్టర్ల సాయంతో నింగికెగిసి 40 టన్నుల ద్రవ ఇంధనంతో మొత్తం 160 టన్నుల ఇంధనంతో పాటు కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను 151.2 సెకండ్లలో పూర్తి చేసింది. 420.5 రాకెట్ శిఖర భాగంలో ఉపగ్రహానికి అమర్చిన హిట్ షీట్స్ మొదటి దశ రెండో >>2




శుక్రవారం సతీష్‌ధావన్ సెంటర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఇస్రో ఛైర్మన్ నారాయణన్

# విద్యుదుత్పత్తి ఆపండి



తెలంగాణ ప్రభుత్వానికి కెఆర్ఎంబి ఆదేశం

● త్రిసభ్య కమిటీ భేటీలో కుదరని ఏకాభిప్రాయం ● 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు ఉండాలి: ఎపి ●50శాతం చొప్పున చెరిసగం పంచాలి: తెలంగాణ ● వాడివేడిగా సమావేశం... నాల్గో వారానికి వాయిదా ● శ్రీశైలం రిజర్వాయర్‌లో తగినంత నీళ్లు లేవు.. పొదుపుగా వాడాలి ● ఇరు రాష్ట్రాలకు బోర్డు సూచన

**హైదరాబాద్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** శ్రీశైలం రిజర్వాయర్‌లో జల విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి తాగునీటికి మాత్రమే వాటిని వినియోగించేందుకు పొదుపు చేయాలని కెఆర్ఎంబి తెలంగాణ ప్రభుత్వంను ఆదేశించింది. కృష్ణా నది యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ శుక్రవారం సమావేశం నీటి పంపకాలపై ఏకాభిప్రాయం కుదరలేదు. సెప్టెంబర్ నాలుగో వారంలో మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సిలు తాగునీటి పంపకాలపై వాడివేడిగా చర్చను సుదీర్ఘంగా జరిపారు. వెలిగొండ, పోతిరెడ్డిపాడు తదితర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జల విద్యుత్ ఉత్పత్తిచేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలంగాణ వెంటనే పోతిరెడ్డిపాడు, నీటి వాటా విషయం తెరపైకి తెచ్చింది. దీనితో ఆంధ్ర, తెలంగాణ అధికారులు వాదోపవాదాలు చేసుకోవడంతో ఏకాభిప్రాయం కుదరలేదు. రెండు రాష్ట్రాలు ఎవరి వాదనలు వారు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. దీంతో ఈ అంశాలను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. తెలంగాణ నుంచి ఇఎన్‌సి రమేష్‌బాబు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇఎన్‌సి నరసింహా మూర్తి హాజరైనారు. తెలంగాణ ప్రభుత్వం అవసరం లేకున్నా కూడా తక్కువగా ఉన్న నీటిని >>2




## గోదావరి కాలుష్యమంతా ఆంధ్రా పేపర్స్‌దే



యథేచ్ఛగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నారు
పుష్కరకాలంగా పన్నులు కట్టడం లేదేంటి?
పన్ను చెల్లించమంటే కోర్టులకెళ్లి కాలయాపన?
తప్పుని సరిదిద్దుకునే అవకాశమిచ్చినా స్పందన లేదు
ఉప ముఖ్యమంత్రి పవన్ ఆగ్రహం
తక్షణమే ఆంధ్రా పేపర్స్‌పై చర్యలు తీసుకోండి
కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఆదేశం

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజమండ్రి గోదావరి కాలుష్యంలో సగం ఆంధ్రా పేపర్ లిమిటెడ్‌దే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంచలన ఆరోపణలు చేసారు. ఈ విషయంలో ఆంధ్రా పేపర్ లిమిటెడ్‌దే పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ మేరకు డి.సిఎంఒ పవన్ కల్యాణ్ పేరిట ఒక ప్రకటన విడుదల చేసింది. రాజమహేంద్రవరం ఆంధ్రా పేపర్ లిమిటెడ్ పన్ను ఎగవేతకు దాదాపు పుష్కర కాలం పూర్తి కావస్తోందని డి.సిఎం ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆంధ్రా పేపర్ లిమిటెడ్' వారు యథేచ్ఛగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నారు. పన్నులు మాత్రం ఉద్దేశపూర్వకంగా ఎగ్గొడుతున్నారు. 2016తర్వాత కాతేరు గ్రామపంచాయతీకి గానీ, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు గానీ ఒక్క రూపాయి >>2



## ఆ స్థల వివాదం తేల్చండి

గోవా గవర్నర్ భూ వివాదంపై సీరియస్
వారం రోజుల్లో అన్ని వివరాలివ్వండి
అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

**విజయనగరం, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు స్థలం వివాదంపై విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విజయనగరం మున్సిపల్ పరిధిలోని మహారాజుపేట సౌత్ వార్డులో టౌన్ >>2

ఆధునిక డిజైన్లతో సంస్కృతీ సంప్రదాయాల కళారూపాలు
770 మంది కళాకారులకు శిక్షణ
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహణ
శిక్షణతో పాటు టూల్ కిట్లు అందజేస్తాం: మంత్రి సవిత
ఆదాయం, ఉపాధే లక్ష్యంగా



## హస్త కళాకారులకు శిక్షణ

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మారుతున్న అభిరుచులు, హస్త కళలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్త కళాకారులకు మెరుగైన జీవనం, ఆర్థిక భరోసా కలిగించేలా చర్యలు చేపట్టాయి. హస్త కళారూపాల తయారీలో మరింత ప్రావీణ్యం పెంపొందించడంతో పాటు ఆధునిక డిజైన్ల తయారీలో శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.35కోట్లను వెచ్చించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళారూపాలను తయారు చేస్తున్న 770మంది హస్త కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టనుంది. ఇందుకోసం శిక్షణా కార్యక్రమాలు ఆయా కళారూపాలను బట్టి నెల, రెండు నెలల పాటు ఇవ్వనున్నారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన జారీ చేసింది. రాష్ట్రంలో చేతివృత్తులకు అండగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేతలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇప్పుడు హస్త కళాకారులకు కూడా ఆర్థిక భరోసా కలిగేలా ఆయా కళారూపాల తయారీలో మెరుగైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ >>2

## పుర'పోరు'కు సిద్ధం

వార్డుల పునర్విభజనకు షెడ్యూల్ విడుదల
ఇప్పటి వరకు 11 అభ్యంతరాలు స్వీకరణ
13న డీలిమిటేషన్ వార్డుల ప్రకటన
14న తుది జాబితా గెజిట్‌లో ప్రచురణ
పురపాలక శాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ
2011 జనాభా లెక్కల ఆధారంగానే స్పష్టీకరణ

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజనకు పురపాలక శాఖ షెడ్యూల్ విడుదల చేసింది. నేడే ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలిచ్చింది. ఈనెల 5 నుంచి 11 వరకు అభ్యంతరాలు స్వీకరించి, 13న డీలిమిటేషన్ వార్డులను ప్రకటించి, 14న ఎపి గెజిట్‌లో ప్రచురించనున్నారు. జివిఎంసి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప, ఏలూరు, అనంతపురం, ఒంగోలు, చిత్తూరు, మచిలీపట్నం కార్పొరేషన్లకు ఆదేశాలందాయి. రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజన ప్రక్రియ ద్వారా జనాభా పెంపుదల ఉంటుంది. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలను పంపాల్సిందిగా కార్పొరేషన్లకు పురపాలకశాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై గురువారం రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు, పిటిషన్లను డిస్మిస్ చేసింది. ఆ తర్వాత పురపాలకశాఖ తన కార్యాచరణను వేగవంతం చేసింది. దీనికి సంబంధించి ప్రతిపాదనలు పంపాల్సిందిగా కార్పొరేషన్లకు పురపాలక శాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపాదనలపై రేపటి నుంచి ఈనెల 11 వరకు 7 రోజుల పాటు అభ్యంతరాలు, సూచనల స్వీకరించనున్నట్లు




పురపాలకశాఖ పేర్కొంది. వీటి పరిశీలన తర్వాత మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి వచ్చే తుది ప్రతిపాదనలను ఈనెల 12న పురపాలక శాఖ డైరెక్టరేట్‌కు సమర్పిస్తారు. ఈనెల 13న డీలిమిటేషన్ వార్డుల ప్రకటనకు డైరెక్టర్ పరిశీలన తర్వాత ఆమోదం తెలపనున్నారు. ఈనెల 14న ఎపి గెజిట్‌లో వార్డుల డీలిమిటేషన్ ప్రకటన వెలువడనుంది. 2011జనాభా లెక్కల ఆధారంగా వార్డుల నిర్ణయముంటుంది. ఈమేరకు జీవీఎంసీ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు కార్పొరేషన్లకు పురపాలక శాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరించాలని స్పష్టం చేసింది. ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మున్సిపల్ డైరెక్టరేట్ ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని, హైకోర్టు సూచనలను కూడా ఈ ప్రక్రియలో పాటించాలని వివరించింది.



పోలీస్ స్పోర్ట్స్ అకాడెమీ ఏర్పాటు లోగోను ఆవిష్కరిస్తున్న డిజిపి హరీష్‌కుమార్, ఇతర పోలీసు అధికారులు

## పోలీసు క్రీడలకు ఇక ప్రత్యేక అకాడెమీ

స్పోర్ట్స్ కార్యకలాపాల కోసం విట్‌తో ఎంఒయు
పోలీసు క్రీడా సంబరాల సభలో డిజిపి వెల్లడి

3లో



శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన చిత్రం

# హస్త కళాకారులకు శిక్షణ

>> సహకారం కూడా తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ప్రఖ్యాతి గాంచిన హస్త కళారూపాలను తయారీ చేస్తున్న కళాకారులను గుర్తించి మారుతున్న అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఈ శిక్షణల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.1,35,16,314లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.1.01 కోటి నిధులు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో ఆయా క్లస్టర్లలో ఉన్న హస్త కళాకారులకు రెండు విధాలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. గురుశిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ), డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా నెల, రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గురుశిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ) రెండు నెలలు, డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) నెల రోజుల పాటు శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ)లోని కొయ్యబొమ్మల తయారీకి కూడా రెండు నెలల పాటు ఇవ్వనున్నామన్నారు.

**200మందికి శిక్షణతోపాటు పనిముట్లు:** డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా చెక్క శిల్పం, టెర్రకోట బొమ్మలు, లేస్/హ్యాండ్‌మేడ్ నిటెడ్ గూడ్స్, అల్లగడ్డ రాతి శిల్పం, శ్రీకాళహస్తి కలంకారి, వెదురుచెరకు కళలు, సవర గిరిజన చిత్రకళ, బొబ్బిలి వీణ, ఇమిటేషన్ జ్యువెలరీ తదితర కళారూపాల తయారీపై మరో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వారిలో అనంతపురం, పల్నాడు, అనకాపల్లి క్లస్టర్లకు చెందిన 50 మంది చొప్పున 200 మంది అరటి ఫైబర్, చెరకువెదురు, వుడ్ టర్నింగ్, ల్యాకర్‌వేర్, దుర్గిరాతి శిల్ప కళాకారులకు శిక్షణతో పాటు ఇంప్రూవుడ్ టూల్ కిట్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రామ్(ఐటీడీపీ) ద్వారా పనిముట్లు పంపిణీ చేయనున్నామన్నారు. ఈశిక్షణా కార్యక్రమాలు కృష్ణా, గుంటూరు, ఎన్‌టీఆర్, అనకాపల్లి, డా. బీఆర్. అంబేద్కర్ కోనసీమ, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, తూర్పు గోదావరి, నంద్యాల, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనంతపురం, పల్నాడు తదితర జిల్లాల్లోని కళాకారులకు ఉపయోగపడనున్నాయని మంత్రి తెలిపారు.

**కళాకారుల ఆదాయం పెంపే లక్ష్యం:** ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు, కళాకారుల ఆదాయాన్ని పెంచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

## నేడు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సిఎం చంద్రబాబు భేటీ


**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. శనివారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలతో సిఎం చంద్రబాబు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో భేటీ కానున్నారు. పిఆర్సీ కమిషన్ ఏర్పాటుతో పాటు పిఆర్సీ, డిఎ బకాయిలు తదితర సమస్యలపై చర్చించనున్నారు. గురువారం జెఎసి నేతలు ఎ.విద్యాసాగర్, డివి రమణ, భారతీ ప్రసాద్ తదితరులు సిఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ఆందోళనలకు సంబంధించిన అంశాలను విద్యాసాగర్ వివరించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రిని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సిఎం ఈ సందర్భంగా వారికి చెప్పారు. పరిష్కారంపై చర్చిస్తున్నా.. ఎందుకు తొందర పడుతున్నారని చంద్రబాబు జెఎసి నేతలను ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఉద్యోగులకు న్యాయంగా చేయాల్సిన వాటిని ఒక్కొక్కటిగా చేస్తున్నామని చెప్పినట్టు సమాచారం. చర్చలు జరుపుతున్నా ఓర్పు పట్టలేకపోవటాన్ని ప్రశ్నించినట్టు తెలిసింది. తాము కూడా చర్చలను ఆహ్వానిస్తున్నామని జెఎసి నాయకులు చెప్పారు. ముఖ్యమంత్రి స్థాయిలో చర్చలు జరగాలని కోరుకుంటున్నామన్నారు.

## దుర్గమ్మ ఆలయంలో వైభవంగా వరలక్ష్మి వ్రతాలు
### కనులపండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం నాడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. రెండు విడతలుగా ఆర్జిత సేవ మరియు ఉచిత వ్రతాల నిర్వహణ జరిగాయి. 600 మందికి పైగా మహిళలకు ఉచిత అవకాశంపూజా సామగ్రి, తీర్థప్రసాదాలు దేవస్థానం వారు అందించారు. ఉచిత దర్శన ఏర్పాట్లపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున మహా మండపంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల్ము అత్యంత వైభవంగాజరిగాయి. ఆలయ వేద పండితులు, అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు మొదటి విడత ఆర్జిత సేవ రూపంలో, అనంతరం ఉదయం 10 గంటల నుండి 11:30 గంటల వరకు రెండవ విడత ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి. వ్రతంలో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే ఉచితంగా సమకూర్చింది. వ్రతం ముగిసిన అనంతరం పసుపుకుంకుమలు, రవికె వస్త్రం, గాజులు, శ్రీ అమ్మవారి ప్రసాదాలను అందజేయడంతో పాటు ప్రత్యేక క్యూ లైన్ ద్వారా శ్రీ దుర్గమ్మ ఉచిత దర్శన భాగ్యాన్ని కల్పించారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ సతీమణి అంజలి సామాన్య మహిళలతో కలిసి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. అనంతరం ఇఓ వి.కె. శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మహామండపంలో నెలకొని వున్న వరలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో శ్రీ వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ ధనిక, పేద అనే తేడా లేకుండా భక్తులందరికీ అమ్మవారి దివ్య సేవలో భాగస్వామ్యం కల్పించాలనే సమున్నత లక్ష్యంతో మొదటి విడత ఆర్జిత సేవగా, రెండో విడతలో 600 మందికి పైగా మహిళలకు ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించామని తెలిపారు. సనాతన ధర్మ పరిరక్షణకు, హిందూ ధర్మ ప్రచారానికి, భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ఇటువంటి సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయి"అని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానాచార్య వి శివ ప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు వి.శ్రీధర్ శర్మ, ఫెస్టివల్ సహాయ కార్యనిర్వహణాధికారి డాక్టర్ కె. గంగాధర్, పర్యవేక్షకులు హేమ దుర్గాంబ , సీనియర్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మకు స్వర్ణాభరణాలు:** శ్రీ కనకదుర్గమ్మ వారికి స్వర్ణాభరణాలను విజయవాడకి చెందిన భక్తురాలు గుంటుపల్లి శ్రీ ప్రణవి శుక్రవారం శ్రీ అమ్మవారి మూలవిరాట్ అలంకరణ నిమిత్తం సుమారు 22.800 గ్రాముల బంగారు ఆభరణాలను చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందజేశారు. బంగారు బొట్టు (నవరత్నాలు, డైమండ్స్ పొదిగినది), బంగారు నత్తు (డైమండ్స్, ఎరుపు పచ్చ రాళ్లు పొదిగినది), బంగారు బు లాకి (డైమండ్స్, ఎరుపు పచ్చ రాళ్లు, ముత్యం పొదిగినది). అనంతరం దాతకు శ్రీ అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలు మరియు శేషవస్త్రాలను బహుకరించారు.

**ఇంద్రకీలాద్రిపై ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు:** దుర్గమ్మవారి ఆలయంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఆశీర్వచన మండపంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చిన్న రాజగోపురం వద్ద శాస్త్రోక్తంగా గోపూజను ఇఓ వికె శీనా నాయక్ నిర్వహించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు, అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ శ్రీకృష్ణ భగవానునికి విశేష పూజలు,పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ స్థానాచార్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు బి. శంకర శాండిల్య, డిఇఓ కిషోర్ కుమార్, ఎఇఓలు ఎన్. రమేష్ బాబు, డా కె. గంగాధర్ పాలకమండలి సభ్యులు పి.రాఘవరాజు, ఎ శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర బాబు, తదితరులు పాల్గొన్నారు.



# నిశ్శబ్ద కల్లోలం

>> భారతదేశ జనాభాలో దాదాపు 80శాతానికి పైగా ప్రజలు విపరీతమైన ఎండలు, అనూహ్య వరదలు, కరువులు, తుఫానుల వంటి వాతావరణ ఆధారిత విపత్తులు పొంచి ఉన్న జిల్లాల్లోనే నివసిస్తున్నారు. 2026 నాటి తాజా పరిశోధనల ప్రకారం, 1981 నుంచి 2020 మధ్యకాలంలో భారతదేశ సగటు వేసవి గరిష్ఠ ఉష్ణోగ్రత సుమారు ఒక డిగ్రీ సెంటిగ్రేడ్ మేర పెరిగింది.
హీట్‌వేవ్‌ల సంఖ్య, వాటి తీవ్రత, అవి కొనసాగే సమయం విపరీతంగా పెరిగిపోయాయి. మానవ శరీరం తనంతట తానుగా చల్లబరుచుకోలేని అత్యంత ప్రమాదకరమైన ఉక్కపోత పరిస్థితి ఇప్పుడు దేశమంతటా వ్యాపిస్తోందని మరో నివేదిక వెల్లడించింది. ఇది కేవలం ఎండకాలానికే పరిమితం కాకుండా, వర్షాకాలంలోనూ మానవ సామర్థ్యాన్ని, ఆరోగ్యాన్ని నిర్దాక్షిణ్యంగా దెబ్బతీస్తోంది. ఉష్ణోగ్రత పెరుగుదల నేరుగా ఆహార, నీటి భద్రతలను తీవ్ర సంక్షోభంలోకి నెడుతోంది. గ్రీన్‌హౌస్ ఉద్గారాల పెరుగుదల కారణంగా సంభవించే వాతావరణ మార్పులు ఎల్‌నినో ప్రభావాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయని ఇటీవలి పరిశోధనలు స్పష్టం చేశాయి. ఎల్ నినో ప్రభావం భారత రుతుపవనాలపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి వర్షపాతాన్ని అస్తవ్యస్తం చేయడం ద్వారా కరువు ముప్పును మరింత పెంచుతోంది. మరోవైపు దేశ జీవనదులైన సింధు, గంగా, బ్రహ్మపుత్ర వంటి నదుల మనుగడ హిందూకుష్ హిమాలయాలపై ఆధారపడి ఉంది.
అయితే, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటైన్ డెవలప్‌మెంట్ 2026 ప్రారంభంలో విడుదల చేసిన డేటా అత్యంత భయానకమైన వాస్తవాన్ని వెల్లడించింది. 2000 సంవత్సరం నుండి ఇప్పటివరకు హిమాలయ ప్రాంతంలో హిమానీనదాలు కరిగిపోయే వేగం రెట్టింపు అయింది. ఈ ఆకస్మిక కరుగుదల నదీ లోయల్లో ఆకస్మిక వరదలకు, కొండచరియలు విరిగిపడటానికి దారితీయడమే కాక, భవిష్యత్తులో కోట్ల మంది ప్రజలను తీవ్రనీటి ఎద్దడిలోకి నెట్టే ప్రమాదం ఉంది. ఈ విపత్తుల వెనుక అభివృద్ధి చెందిన దేశాల అన్యాయం స్పష్టంగా దాగి ఉంది. ఇటీవల పొరుగు దేశమైన నేపాల్‌లో వాతావరణ విలయాల కారణంగా వెయ్యిమందికి పైగా అమాయకులు ప్రాణాలు కోల్పోవడమే దీనికి నిదర్శనం. ప్రపంచ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలలో నేపాల్ వంటి దేశాల పాత్ర నామమాత్రమే. కానీ, అభివృద్ధి చెందిన సంపన్న దేశాలు దశాబ్దాలుగా సాగించిన పారిశ్రామిక విధ్వంసానికి మూల్యం మాత్రం ఏ పాపం ఎరుగని గ్లోబల్ సౌత్ దేశాలే చెల్లించాల్సి వస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు ఉద్గారాల తగ్గించడంతో పాటు నష్టపరిహారం, వాతావరణ ఆర్థిక సహాయం తప్పనిసరిగా చేయాలని బ్రెజిల్‌లో జరిగిన సిఒపి 30 సదస్సులో భారత్ డిమాండ్ చేసింది.
ఈ నేపథ్యంలో, ఈ యేడాది నవంబర్‌లో టర్కీలో జరగనున్న సిఒపి31 సదస్సు కీలకంగా మారింది. ప్రకృతి విసురుతున్న ఈ సవాలును తీరిగ్గా కూర్చుని సరిదిద్దుకునేంత సమయం లేదు. ఒకటిన్నర డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగితేనే, ఈస్థాయిలో ప్రభావం ఉంటుందని అర్థమైనప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన సమయం ఆసన్న మైంది. ఉష్ణోగ్రత పెరుగుదలలో నివారించగలిగే ప్రతి చిన్న అంకె కూడా భవిష్యత్తులో వేలాది ప్రాణాలను, కోట్ల ఎకరాల పంటలను, దేశ ఆర్థిక వ్యవ స్థను కాపాడుతుంది.

## గోదావరి కాలుష్యమంతా ఆంధ్రా పేపర్స్‌దే

>> పన్ను కూడా చెల్లించలేదన్న విషయం మీకు గుర్తుందా? ప్రభుత్వంతో సంబంధం లేకుండా మీకు మీరే పన్ను మినహాయింపు ఇచ్చేసుకున్నారా? ఇది ఎలా సాధ్యం? రూ.21.34 కోట్ల వరకు మీరు స్థానిక సంస్థలకు పన్నులు చెల్లించాల్సి ఉంది. పన్ను చెల్లించమని నోటీసులు ఇచ్చిన ప్రతిసారీ కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేస్తూ మీ బాధ్యత నుంచి తప్పించుకు తిరుగుతున్నార్లు అని మండిపడ్డారు. "రాజమహేంద్రవరం నగర కాలుష్యంలో సగం ఆంధ్రా పేపర్స్ లిమిటెడ్ నుంచే వస్తుందని అధికారిక గణాంకాలు సైతం చెబుతున్నాయి. రాజమహేంద్రవరం నగరం మొత్తం దాదాపు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటే, అందులో సుమారు 35 మిలియన్ లీటర్లు మీరు ఉత్పత్తి చేస్తున్నారు. మీరు విడుదల చేస్తున్న వ్యర్థాల్లో పరిమితికి మించి కాలుష్య కారకాలు ఉన్నట్టు నిర్ధారణ కూడా అయ్యింది. మీరు వ్యర్థాలు విడుదల చేసే లగూన్స్ దగ్గర సేకరించిన నమూనాలను పరీక్షించగా, లీటర్ నీటికి 36 మిల్లీగ్రాముల బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బిఒడి) ఉంది. ఇది నిర్ణీత ప్రమాణాల కంటే 20 శాతం అధికం. ఫాస్ఫేట్ 5.3 మిల్లీగ్రాములు 6 శాతం అధికంగా ఉంది. సల్ఫైడ్స్ 3.4 మిల్లీగ్రాములు ఉన్నాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాలతో పోలిస్తే.. ఇది 70 శాతం అధికం. మీరు విడుదల చేసే కాలుష్యం కారణంగా నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గి జలచరాల మనుగడకు ఇబ్బంది కలుగుతుంది. గోదావరి నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోంది. దుర్గంధాలు వెదజల్లుతూ, నీటి నాణ్యత తగ్గి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ, భవిష్యత్ మానవాళి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తోంద్ని అని డి.సిఎం పవన్ కళ్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. "భూగర్భ జలాలు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి పర్యటనలో పలు సూచనలు చేశాను. వాటిని కూడా మీరు పాటించలేదు.
మీ ఉల్లంఘనలకు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు లోబడి కఠిన చర్యలు తీసుకోవచ్చు. పరిశ్రమలో కార్యకలాపాలు నిలుపుదల చేయొచ్చు. పెనాల్టీలు విధించవచ్చు. కంపెనీని సీజ్ చేయొచ్చు. ఏకంగా లైసెన్స్ రద్దు చేయొచ్చు. అయినప్పటికీ పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ముందస్తు హెచ్చరికగా షోకాజ్ నోటీసులు ఇచ్చి.. తప్పుని సరిదిద్దుకునే అవకాశం ఇచ్చింది. గడచిన మూడు నెలల కాలంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మీ ప్రతినిధులతో పలు మార్లు చర్చించి, పరిష్కార మార్గాలు సూచించారు. అయితే మీ నుంచి స్పందన పూర్తిగా కొరవడింద్ని అని డి.సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తక్షణం ఆంధ్రా పేపర్స్ లిమిటెడ్‌కి సమన్స్ జారీ చేసి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్, అదనపు అడ్వకేట్ జనరల్‌తో పాటు ప్రభుత్వ న్యాయవాదులు, స్టాండింగ్ కౌన్సిళ్లు ఇటువంటి ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. "స్వచ్ఛ గోదావరి- పవిత్ర పుష్కరాల్ను థీమ్‌తో మన గోదావరి నదిని కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణ వేత్తలు, పౌర సమాజం నుంచి మద్దతు కోరుతున్నామని పేర్కొన్నారు.ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతాంశంగా ముందుకు తీసుకువెళ్తుందని తెలిపారు.

# విద్యుదుత్పత్తి ఆపండి



శుక్రవారం కెఆర్‌ఎంబి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న నరసింహా మూర్తి

>> విద్యుత్ ఉత్పత్తికి వాడటం తగదని ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సి నరసింహామూర్తి అభ్యంతరం వ్యక్తంచేశారు. తెలంగాణ ఇఎన్‌సి రమేష్‌బాబు మాట్లాడుతూ పోతిరెడ్డి పాడునుంచి ఆంధ్రప్రదేశ్ నిబంధనలకు విరుద్ధంగా నీటిని బేసిన్ దాటి పోయేలా తరలిస్తోందని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఉందని ఉన్న నీటిని 50శాతంచొప్పున చెరిసగం పంచుకోవాలని తెలంగాణ ఇఎన్‌సి రమేష్‌బాబు కెఆర్‌ఎంబి ముందు ప్రతిపాదన పెట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం తరుపున నరసింహామూర్తి మాట్లాడుతూ 66;34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు ఉండాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కృష్ణా నదిలోని రిజర్వాయర్లలో 142 టిఎంసిలు ఉన్నాయని ఇఎన్‌సి రమేశ్ బాబు వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సిమాత్రం ఖరాఖండిగా 66:34శాతం వాటా ప్రకారం 97 టిఎంసిలు విడదల చేయాలని కోరారు.
సభ్యుడు నరసింహామూర్తి మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ సమావేశం ఏకాభిప్రాయం కుదరక అసంతృప్తితో ముగిసిందని వ్యాఖ్యానించారు. కృష్ణా నదిలో లభ్యమయేయ్య నీరు 66:34 నిష్పత్తిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు నీటి విడుదల ఉత్తర్వులు ఇవ్వాలని కోరామని తెలిపారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని తెలంగాణ కోరిందని, వచ్చే ఆగస్టు వరకు 104 టిఎంసిలు కావాలని కోరామని వివరించారు. తెలంగాణ 200 టిఎంసిలు కావాలని కోరిందని, ఆ ప్రతిపాదన సహేతుకం కాదని చెప్పామని అన్నారు. తెలంగాణ అవసరం లేకున్నా శ్రీశైలం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని సమావేశంలో ఆరోపించామన్నారు. తమ వాటా నుంచే పోతిరెడ్డి పాడు, వెలిగొండ ద్వారా నీరు తీసుకుంటున్నామని, ఎవరి వాటా అడగడం లేదని తెలిపారు. రాయలసీమతో పాటు మార్కాపురం, పల్నాడు, ఇతర జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం నీరు ఇవ్వాల్సి ఉందని ఆయన అన్నారు. తెలంగాణ ఇఎన్‌సి రమేష్‌బాబు మాట్లాడుతూ పోతిరెడ్డితోపాటు వెలిగొండ నుంచి కూడా నీటిని తీసుకొని పోతున్నారని మొత్తం తెలంగాణకు 200 టిఎంసిలు, ఎపికి 100 టిఎంసిలు ఇవ్వాలని కోరారు. ఇదిఇలా ఉంటే విద్యుత్ ఉత్పత్తికి కృష్ణా నదినీటిని వాడొద్దని కెఆర్‌ఎంబి తెలిపింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని 11వ షెడ్యూల్ లో 2, 3 పేరాలను అనుసరించి నీటి వినియోగం ఉండాలనీ తెలంగాణను కెఆర్‌ఎంబి ఆదేశించింది. సాగు నీరు, త్రాగునీరు, విద్యుత్ ఉత్పత్తి వంటి ప్రాధాన్యత అంశాలు విపత్తు పరిస్థితులు వస్తే, త్రాగు నీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలనీ కెఆర్‌ఎంబి తెలిపింది. తెలంగాణా రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తికి నీటిని వినియోగించడం వెంటనే నిలిపి వేయాలని కెఆర్‌ఎంబి హెచ్చరించింది. త్రాగు నీటి అవసరాలకే తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నీటిని వినియోగించాలి. తెలంగాణా రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తికి శ్రీశైలం నీటిని వినియోగించడం పై అభ్యంతరం వ్యక్తం చేసింది.


కేరళలో మాతా అమృతానందమయి దేవి ఆశీస్సులు అందుకుంటున్న మంత్రి నారా లోకేశ్

## అమృతపురి ఆశ్రమంలో మంత్రి లోకేశ్
### మాతా అమృతానందమయి దేవితో భేటీ

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** కేరళం రాష్ట్రం కొల్లం జిల్లాలోని ప్రసిద్ధ అమృతపురి ఆశ్రమాన్ని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం సందర్శించారు. ముందుగా అమృతపురి ఆశ్రమానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలోని కాళీ దేవాలయాన్ని, కలరిని మంత్రి సందర్శించారు. అనంతరం మాతా అమృతానందమయి దేవితో మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మాతా అమృతానందమయి దేవి ఆశీస్సులు పొందారు. ఆధ్యాత్మిక, తాత్వికరంగాల్లో మంత్రి ఆసక్తి కలిగి ఉండటం పట్ల అమృతానందమయి దేవి సంతోషం వ్యక్తం చేసారు. విశ్వవిద్యాలయాల వ్యవస్థాపన, నిర్వహణ విషయంలో ఆయన అందిస్తున్న సహకారానికి మంత్రిని అభ్యర్థించారు. అమరావతి అంతర్జాతీయంగా ఖ్యాతిని పొందుతుందని తెలిపారు. అనంతరం అమృత విశ్వవిద్యాపీఠం క్యాంపస్‌ను, అమృత ఆయుర్వేద కళాశాలను మంత్రి సందర్శించారు. దాదాపు మూడు గంటలపాటు ఆశ్రమంలో గడిపారు.

# గ'ఘన'విజయం

>>దశకు మధ్యలోనే శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం విడిపోయాయి. 40 టన్నుల ద్రవైందన సహాయంతో రెండో దశను 293.08సెకండ్లలో అధికమించింది. స్వదేశీ సాంకేతికతో రూపొందించిన 15 టన్నుల క్రయోజనిక్ సహాయంతో 1106.60 సెకండ్లలో మూడవ దశను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఇస్రో శాస్త్రవేత్తలు నిర్దేశించిన 19 నిమిషాల గమన సమయంలో 28934 ఎత్తులోనీ జియో ట్రాన్స్ ఫర్ ఆర్బిట్‌లోకి చేరుకుంది.అనంతరం భూభాగంలోని మాస్టర్ కంట్రోల్ సెంటర్ల వారు ఉపగ్రహాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని 36,000కిలోమీటర్ల ఎత్తులోని కక్షలోకి ప్రవేశపెట్టిన ప్రవేశపెట్టారు. కక్షలోకిచేరిన ఇఓఎస్ 05ఉపగ్రహం మాస్టర్ కంట్రోల్ సెంటర్‌కు సంకేతాలు ఇవ్వడం ప్రారంభించింది.

**ఈ యేడాదిలో ఆరు ప్రయోగాలు:** జిఎస్ఎల్‌వి ఎఫ్ 17 విజయం చారిత్రాత్మకమైనదని, ఈ విజయంలో ఇస్రోలోని ప్రతి ఒక్కరి సమిష్టి కృషి ఉందని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ అన్నారు. ప్రయోగ విజయానంతరం శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. పిఎస్ఎల్వీ ఎఫ్ 17 రాకెట్ ద్వారా భారతదేశానికి అత్యంత ఉపయోగకరమైన ఇఓఎస్ 05 రాకెట్‌ను నిర్దేశించిన కక్షలోకి పంప గలిగామన్నారు. జిఎస్ఎల్వీ ఎఫ్ 17 రాకెట్ ప్రథమంగా అధిక బరువు గల ఉపగ్రహాన్ని గగనతలంలోకి తీసుకువెళ్లిందని తెలిపారు. 36 వేల కిలోమీటర్ల ఎత్తులో ఈ ఉపగ్రహం చేరుకొని పనిచేయడం ప్రారంభించిందని, ఇస్రో ఆధ్వర్యంలో ఇంత ఎత్తులో ప్రవేశ పెట్టడం ప్రథమమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమ ప్రయోగం విజయవంతం అయిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ప్రైవేటు సెక్టార్‌కు సంబంధించి విక్రమ్ వన్ రాకెట్ విజయం సాధించిందని తెలిపారు. ఎనిమిది నెలల విరామం తర్వాత ఇస్రోకు మంచి రోజులు వచ్చాయని, ఇదే విజయ పరంపరను కొనసాగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తల బృందం నిరంతరం శ్రమిస్తామని నారాయణన్ తెలిపారు. ఈ యేడాదిలో మరో ఆరు ప్రయోగాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఇందులో గగన్‌యాన్ సంబంధించి మానవ రహిత ఉపగ్రహం ప్రయోగం, ఎన్‌వి ఎస్03 నావిగేషన్ శాటిలైట్ ప్రయోగం ఉంటాయని ఇస్రో ఛైర్మన్ తెలిపారు. ఈప్రయోగ విజయం ఇస్రో కుటుంబానికి స్ఫూర్తినిచ్చిందని ఆయన చెప్పారు. తమిళనాడులోని కులశేఖర పట్టణంలోని లాంచ్ ప్యాడ్‌లో ఇస్రో, ప్రైవేట్ సంస్థలకు చెందిన రాకెట్ ప్రయోగాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. శ్రీహరికోటలో మూడవ లాంచ్ ప్యాడ్ నిర్మాణం కీలక దశలో ఉందని నారాయణన్ తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తల బృందంతో కలిసి పిఎస్ఎల్వీ ఎఫ్ 17 రాకెట్ నమూనాను చేత పట్టుకొని విజయోత్సవం జరుపుకున్నారు. ఈ సమావేశంలో షార్ డైరెక్టర్ ముత్తు చెళియన్, ఐపిఆర్‌సి డైరెక్టర్ నారాయణ అప్పు, ఇస్రాక్ డైరెక్టర్ ఎంఆర్ రాఘవేంద్ర, మాస్టర్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్ పంకజ్ దామోదర్ కిల్‌దార్, విఎస్ఎస్‌సి డైరెక్టర్ డాక్టర్ రాజీవ్, యుఆర్ ఎస్సీ డైరెక్టర్ దినేష్ కుమార్ సింగ్, మిషన్ డైరెక్టర్ థామస్ కురియన్, డాక్టర్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 10, 11 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

>> చర్చించనున్నారు. సూపర్ సిక్స్, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించనున్నారు. ఆరోగ్యం, విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్లతో సిఎం చంద్రబాబు చర్చించనున్నారు. పెట్టుబడులు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడనున్నారు. జలధార కార్యక్రమం పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ల ఉత్తమ ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రదర్శన, వివరణ ఇవ్వనున్నారు. రెండో రోజు ఈగవర్నెన్స్, ఆర్టీజీఎస్. పిజిఆర్ఎస్ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. భూ పరిపాలన, కేంద్ర పథకాల నిధుల వినియోగంపై చర్చించనున్నారు. జిల్లా కలెక్టర్లతో ఓపెన్ ఫోరంలో క్షేత్రస్థాయి సమస్యలపై మాట్లాడనున్నారు. చివరి రోజు శాంతిభద్రతల సమీక్షతో పాటు ముగింపు ప్రసంగాన్ని సిఎం చంద్రబాబు చేయనున్నారు.

## ఆ స్థల వివాదం తేల్చండి

>> సర్వేనెంబర్ 569లో 4 ఎకరాల 74 సెంట్లలో ఎకరాస్థలంలో వైసిపి కార్యాలయాన్ని నిర్మించింది. ఈ వ్యవహారాన్ని అశోక్ గజపతి రాజు వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తన స్థలంలో అక్రమంగా వైసిపి కార్యాలయ నిర్మాణం చేపట్టారంటూ గతఏడాది విజయ నగరం కలెక్టర్‌కు ఆధారాలు సమర్పించారు.సదరు ఆధారాలను పరిశీలించిన కూటమి ప్రభు త్వం విచారణకుఆదేశించింది.అప్పటి ఎమ్మార్వో ప్రభాకర్‌రావుపై విచారణకు ఆదేశాలు జారీ చేసింది. వారం రోజులలోపు ఆ వివరాలు అన్నీ ఇవ్వాలని జిల్లాఉన్నతాధికారులనుప్రభుత్వం ఆదేశించింది.

### నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా 173 మందిని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా విద్యాశాఖ గుర్తించి జాబితాను విడుదల చేసింది.వీరందరికి ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వీరికి అవార్డులు ప్రదానం చేయనుంది. విజయవాడలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వీరికి అవార్డులు అందజేస్తారు. పాఠశాల విద్యలో 79 మంది, ఇంటర్ విద్యలో 24మంది, సాంకేతిక విద్యలో 14 మంది, ఉన్నత విద్యలో 56 మందిని ఉత్తమ టీచర్లుగా ప్రభుత్వంఎంపికచేసింది. వీరికి ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదు బహుమతి అందజేస్తారు.

### వారం - వర్జ్యం

05-09-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి.నవమి రా.9.53,న.మృగశిర రా.9.30
వ.తె.5.20 - ఉ.6.49
దు.తె.5.54 - ఉ.7.32
రాహు.ఉ.9.00-ఉ.10.30
శుభ లేదు

### వార్తాఫలం

**మేషం :** ఇంటా బయటా ఎదురైన ఒత్తిడులు తొలగుతాయి. గృహనిర్మాణ ఆలోచనల్లో తొందరపాటు వద్దు.అదనపు బాధ్యతలు.

**వృషభం :** నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక ప్రగతి సాధిస్తారు. వివాహానికి అనుకూలమైన కాలం.

**మిథునం :** వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. జీవితభాగస్వామినుండి వస్తు, వస్త్రలాభాలు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం.

**కర్కాటకం :** ఋణాలు కొంతవరకు తీరుస్తారు.వ్యాపారాలలో స్వల్పలాభాలు పొందుతారు.

**సింహం :** నూతన ఉత్సాహంతో కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. సంఘంలో ఆదరణ పెరుగుతుంది.

**కన్య :** ఆర్థిక ఇబ్బందులు అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది. శ్రమ ఫలిస్తుంది.

**తుల :** సోదరుల నుండి ఆస్తి, లాభం పొందుతారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** భూ వివాదాలు పరిష్కరించుకొంటారు. మానసిక ప్రశాంతత పొందుతారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**ధనుస్సు :** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. మీలోని ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

**మకరం :** వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**కుంభం :** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుతుంది.ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**మీనం :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ చాలా అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# చెరువులకు కొత్త కళ

## సాగునీటి సంరక్షణ.. పర్యావరణ పరిరక్షణ లక్ష్యం

- రూ.50 కోట్లతో 105 చెరువుల ఆధునీకరణ
- 26 చెరువులకు పునరుజ్జీవం. భూగర్భ జలాల పెంపు
- ఆధునిక హంగులతో ఆహ్లాదకర కేంద్రాలుగా చెరువులు
- వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ ఎయిర్ జిమ్‌లు, పార్కులతో కొత్త రూపు



**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** సాగునీటి వనరుల సంరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల వరకు సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక కృషి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉప ముఖ్యమంత్రి చొరవకు 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన్న పథకం తోడవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మంచినీటి చెరువులు, సరస్సుల పునరుజ్జీవనానికి కొత్త ఊపు వచ్చింది. పవన్ కల్యాణ్ దార్శనికత, అభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతతో చెరువులకు కొత్త జీవం పోయడమే కాకుండా, వాటిని మరింత సమర్థవంతమైన సాగునీటి వనరులుగా తీర్చిదిద్దే దిశగా విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. చెరువుల ఆధునీకరణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటం, సాగునీటి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని అందించాలన్న సమగ్ర లక్ష్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయి.

### 105 చెరువులు... రూ.50 కోట్ల అంచనా వ్యయంతో పనులు

రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం మొత్తం రూ.50 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 26 చెరువులను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. అనంతపురం, పల్నాడు, శ్రీసత్యసాయి, చిత్తూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో ఇప్పటికే చెరువుల అభివృద్ధి పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో శరవేగంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చెరువుల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు సాగు నీటి వనరులు మరింత బలోపేతం కానున్నాయి. అలాగే భూగర్భ జలాల వృద్ధికి తోడ్పడనున్నాయి.

### చెరువులకు కొత్త రూపు.. ప్రజలకు కొత్త సౌకర్యాలు

చెరువుల ఆధునీకరణ ప్రక్రియలో భాగంగా చెరువు గట్ల బలోపేతం, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రవేశ ద్వారాల నిర్మాణం, సోలార్ లైట్ల ఏర్పాటు, సిట్టింగ్ బెంచ్‌ల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ ఎయిర్ జిమ్ పరికరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు చెరువుల సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇస్తూ, వాటిని ప్రజల విశ్రాంతి, ఆరోగ్యం, వినోదానికి అనువైన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం పరిధిలోని వెదుళ్ల చెరువు, కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని పండూరు చెరువు, గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు, అనంతపురం జిల్లాలో గుడిశెలపల్లి చెరువు, నెల్లూరు జిల్లాలోని వింజమూరు, శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం తదితర చెరువులు పూర్తి స్థాయి అభివృద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

### సాగు నీటితోపాటు భూగర్భ జలాలకు బలం

ఈ పనుల ద్వారా చెరువులు కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితం కాకుండా బహుళ ప్రయోజన కేంద్రాలుగా రూపుదిద్దుకోనున్నాయి. చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల సాగునీటి వనరులు బలోపేతం కావడంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో రైతులకు సాగునీటి పరంగా ప్రయోజనం చేకూరడంతో పాటు గ్రామీణ ప్రజలకు దీర్ఘకాలికంగా మెరుగైన ఫలితాలు అందనున్నాయి. పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ కార్యక్రమం దోహదపడనుంది.



చెరువుకట్టపై పిల్లల పార్కు, జిమ్

### నాణ్యతపై పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి

అభివృద్ధి పనుల వేగంతో పాటు వాటి నాణ్యతపై కూడా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, ప్రతి పని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సాగుతున్నాయో లేదో పరిశీలిస్తున్నారు. పనులను సెప్టెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి పనుల్లో వేగం, నాణ్యత రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రంలో అమలుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సాగు నీరు, పర్యావరణం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు వంటి అన్ని అంశాలను సమన్వయం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దార్శనికత ఈ చెరువుల ఆధునీకరణ కార్యక్రమంలో ప్రతిబింబిస్తోంది.

## ప్రజల తలసరి ఆదాయం పెరిగితే

# పేదల సంపద వృద్ధి

### అన్నిరంగాల్లో రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వానికి కీలకం: సిఎం చంద్రబాబు



**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజల తలసరి ఆదాయం పెరిగితే పేదల సంపద దానంతటదే వృద్ధి చెందుతుందని సిఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. రాష్ట్రంలో ప్రజల ప్రస్తుతం తలసరి ఆదాయం రూ.3 లక్షలుగా ఉందని, 2047 నాటికి దానిని రూ.54 లక్షలకు చేర్చడమే లక్ష్యమని వివరించారు. ఆ దిశలోనే ప్రభుత్వం కార్యచరణను ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తుందన్నారు. సిఎం చంద్రబాబు తన అధికారిక 'ఎక్స్' ఖాతాల్లో పలు అంశాలు వెల్లడించారు. సంపద వృద్ధి చెందాలంటే ఆదాయం వృద్ధి కావాలన్నారు. ఇందుకు తగినట్లు ప్రభుత్వవిధానం ఉందన్నారు. ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు పిపిపి విధానాన్ని అమలులోకి తీసుకుని వచ్చామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. భవిష్యత్తు అంతా పర్యాటక రంగానిదేనని, ఆ రంగాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై ప్రజావసరాలను విస్మరించిందన్నారు. బటన్లు నొక్కి రోడ్లకు గుంతలు పెట్టారన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని చంద్రబాబు స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తపన, అనుభవంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిలో దూసుకెళ్తోందని సిఎం అన్నారు. 45యేళ్లుగా వెనుకబడిన వర్గాలు టిడిపికి అండగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గౌడ కులస్తులకు మద్యం షాపులు కేటాయిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి మరింత వేగంగా జరగాలంటే ప్రజలు తమ సలహాలు, సూచనలు అందించాలని ముఖ్యమంత్రి కోరారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించానని, దానికి రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రేపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్తున్నామని, కొండలు, గుట్టలు తొలిచి మరీ నీటిని తరలిస్తామన్నారు. నదుల అనుసంధానంతో భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఏమాత్రం రావని భరోసా ఇచ్చారు. వైఎస్సార్సీపీ పాలనలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని, కానీ కూటమి ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా పెంచలేదని స్పష్టం చేశారు. తాము ఏ మంచి పని చేసినా వైఎస్సార్సీపీ అడ్డుపడుతోందని మండిపడ్డారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మెగా డిఎస్సీ వేస్తుంటే దాన్ని అడ్డుకునేందుకు కోర్టులో ఏకంగా 350 కేసులు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, మీ పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫొటో అవసరం లేదని తేల్చి చెప్పారు. ఆడబిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బంది పడకూడదని ఉచిత బస్సు ప్రయాణం తీసుకువచ్చామని సీఎం చెప్పారు. రాబోయే రోజుల్లో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు. మహిళలకు కష్టం రాకూడదనే ఉద్దేశంతో దీపంపథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని 33శాతం రిజర్వేషన్లు తెచ్చామన్నారు. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తానే తీసుకువచ్చానని, త్వరలో మహిళా డ్రైవర్లను కూడా ప్రోత్సహిస్తామని ప్రకటించారు. 'సంజీవన్ని' యాప్ ఓ గేమ్ ఛేంజర్ అని సిఎం చంద్రబాబు అన్నారు. గిరిజన ప్రాంత ప్రజలకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు గిరిజనుల ఆరోగ్యం వారి ఫోన్‌లో ఉందని, ఎక్కడికి వెళ్లినా వారు ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను క్రోడీకరించి ఆరోగ్యాన్ని రక్షిస్తామన్నారు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించామన్నారు. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. ఏజెన్సీ ఏరియాలో మరికొన్ని సెల్ టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతామన్నారు. 3 నెలల్లో అల్లూరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడటమే ప్రభుత్వానికి కీలకం అని సిఎం చంద్రబాబు వివరించారు.

## చెట్టుకు కారు ఢీ: అన్నదమ్ములు మృతి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా మల్కిపురం మండలం, లక్కవరం శివారు, ఓఎన్జిసి సైట్ దగ్గర్లో జరిగిన ప్రమాదం లో ఇరువురు అన్నదమ్ములు అక్కడిక్కడే అసువులు బాయగా తోటి కోడళ్ళు ఆసుపత్రి లో చికిత్స పొందు తున్నారు. లక్కవరం గ్రామానికి చెందిన, ముదునూరి రామభద్ర రాజు (రాంబాబు రాజు), అతని తమ్ముడు ముదునూరి వెంకట సుబ్బరాజు లు వారి భార్యలతో కలసి, బంధువుల ఇంటికి వెళ్లి భీమవరం నుండి తిరిగి లక్కవరం గ్రామం వారి కారులో వస్తుండగా, లక్కవరం ఓఎన్జిసి సైట్ దగ్గరకు వచ్చేసరికి రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి చెట్లను బలంగా ఢీకొట్టారు. కారు పూర్తిగా డ్యామేజ్ అయ్యి, డ్రైవింగ్ చేస్తున్న ముదునూరి రామభద్ర రాజు, తమ్ముడైన ముదునూరు వెంకట సుబ్బరాజు అక్కడికక్కడే మృతి చెందారు. తోటికోడళ్ళు ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో గ్రామస్తులు ఆసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


### నార్త్ కొరియాలో ప్రమాదం: బాపట్ల జిల్లా వాసి మృతి



**చీరాల, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** నార్త్‌కొరియాలో జరిగిన ఫ్యాక్టరీ ప్రమాదం లో బాపట్ల జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందాడు. పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన సందెపూడి సాల్మన్ రాజు (35) ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. సుమారు నెల రోజుల క్రితం ఆయన పనిచేస్తున్న ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తు ఘటన చోటుచేసుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గత సోమవారం ప్రాణాలు విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాల్మన్‌రాజు మృతి వార్త తెలియడంతో చెరుకూరు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుడికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నట్లు సమాచారం. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. శనివారం సాల్మన్ రాజు మృతదేహం చెరుకూరు గ్రామానికి చేరుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ఇచ్ఛాపురంలో పోర్టు

- రెండు వేల ఎకరాల భూముల్లో నిర్మాణానికి ప్రతిపాదనలు
- కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు
- పలు అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి భూమిపూజ



**ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి (శ్రీకాకుళం జిల్లా), సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పోర్టు నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. తీర ప్రాంతంలో ఉపభూముల్లో పోర్టు నిర్మాణ ప్రతిపాదనలు చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ.6 కోట్లతో నిర్మిస్తున్న రెండు రైల్వే అండర్ బ్రిడ్జిలు, కోల్ ఇండియా సౌజన్యంతో సూడా ఆధ్వర్యంలో రూ.2.29కోట్లతో సురంగి రాజావారి మైదానంలో నిర్మిస్తున్న బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (ఇండోర్ స్టేడియం) నిర్మాణానికి భూమి పూజ చేశారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో కలిసి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. ఇక్కడి తీర ప్రాంతంలో 2 వేల ఎకరాల్లో పోర్టు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి కార్యాచరణ మొదలెట్టినట్లు తెలిపారు. పోర్టు నిర్మాణం ద్వారా పెద్ద ఎత్తున అనుబంధ పరిశ్రమలు, సంస్థలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం పట్టణంలో మరో రైల్వే వంతెన నిర్మాణానికి కూడా సన్నాహాలు మొదలు పెట్టినట్టు ప్రకటించారు. అలైన్మెంట్ ప్రజాభిప్రాయానికి అనుగుణంగా రూపొందించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజోపయోగ పనులకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఐదేళ్ల వైసిపి పాలనలో అరాచకం, దౌర్జన్యం, దాడులతో కొనసాగిందని చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రస్థాయిలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. గతంలోనూ ఇప్పుడూ చంద్రబాబు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రాజావారి మైదానంలో అన్ని వసతులతో బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో కూడా ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందువరుసలో నిలబెడతామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రోడ్డు సదుపాయం లేని కంచిలి మండలంలో గిరిజన గ్రామాలకు రహదారులు వేసిన విషయాన్ని ప్రకటించారు. ఇచ్ఛాపురం మున్సిపాల్టీని రైల్వేట్రాక్ రెండుగా విభజించటం వల్ల దశాబ్దాలుగా ఉన్న రాకపోకల సమస్యలు పరిష్కారంగా రెండు ఆర్ ఓబీలు శంకుస్థాపన చేశామన్నారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ పథకం క్రింద రీమోడల్ చేస్తున్నామని, దీంతో పాటు కొత్త రైళ్ల హాల్ట్‌లు కూడా తీసుకొచ్చామన్నారు. రైల్వేజోన్ మార్పు చారిత్రాత్మకమైన నిర్ణయమని గతంలో పలాసా నుండి ఇచ్ఛాపురం వరకు ఉన్న 7 స్టేషన్లను ఈస్ట్ కోస్ట్ జోన్ ఖుర్దా డివిజన్‌లో ఉండటం వల్ల చిన్న పనికి కూడా భువనేశ్వర్ వెళ్లాల్సి వచ్చిందని కూటమి ప్రభుత్వం కృషితో విశాఖపట్నం జోన్ మంజూరై 7 స్టేషన్లు విశాఖ డివిజన్‌లో కలిపారన్నారు. ఇకపై రైల్వే సమస్యలపై నేరుగా డిఆర్ఎంకు కలిసే అవకాశం దొరికిందన్నారు. ఏళ్ల తరబడి రోడ్లు లేని ఇంటీరియల్ గ్రామాలకు కూడా రూ.6లక్షలతో బిటి రోడ్డు, రూ.45 లక్షలతో సిసి రోడ్డు పనులు చేపట్టామన్నారు. గత 5 ఏళ్లుగా నిలిచిపోయిన ఇచ్ఛాపురం కెవికె రూ.2.40కోట్లుతో శంకుస్థాపన చేశామని అన్నారు. ఇందులో 3 కోర్టులు బ్యాడ్మింటన్, జిమ్, అథ్లెటిక్ ట్రాక్, ఆకింగ్ ట్రాక్ ఉంటాయని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడల్లా క్రీడలకు పెద్దపేట వేసేవారని స్టేడియంలు నిర్మించి క్రీడాకారులను తయారు చేసి ఒలింపిక్ స్థాయిలో మెడల్స్ సాధించేలా బాట వేసారన్నారు. శ్రీకాకుళం పార్లమెంటరీలోని 7 నియోజకవర్గాలలోనూ కేవీకేలు మంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో స్టేడియంలు నిర్మించటమే విజన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్ఎం కే.రామారావు, సీనియర్ డిసిఎం పవన్ కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, జనసేన నాయకులు దాసరి రాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, జడ్ఆర్‌యుసిసి మెంబర్ శ్రీనివాస్ రౌలో, రాష్ట్ర రెడ్డిక కార్పోరేషన్ ఛైర్మన్ కొండా శంకర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పత్రి తవిటయ్య, ఎన్ కోటి, కాళ్ల దర్మారావు, కాళ్ల దిలీప్, లోపింటి పద్మనాభం, ఆశి లీలారాణి, జన్నెల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**రహదారులను ప్రారంభించిన కేంద్రమంత్రి:** కంచిలి మండలంలో ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ బాబుతో కలిసి పోలేరులో రూ.85 లక్షలతో పిఐయు నిధులతో తారు రోడ్లు ప్రారంభించారు. అలాగే కొండ పోలేరు గ్రామంలో రూ.75 లక్షలతో 750 మీటర్ల సిమెంట్ రహదారి ప్రారంభించారు. అనంతరం కొల్లూరు పంచాయతీ పరిధిలోగల గుండాం గ్రామంలో వైఎసఆర్ పార్టీకి చెందిన 50 కుటుంబాలు మంత్రి సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పి ఆయా కుటుంబాలను, మంత్రి, విప్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రహదారులు పూర్తిగా పాడైపోయి పెద్ద పెద్ద గోతులు ఏర్పడి చిన్నాభిన్నంగా తయారైందని ప్రజలు ప్రయాణం సాగించాలంటే నరకయాతన అనుభవించారని చెప్పారు.


కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008 ఏపి, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

**స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తులు అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు) /హామీదారు(లు) చెల్లించవలసిన క్రింద పేర్కొన్న బకాయి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్‌ల అధీకృత అధికారిచే నిర్మాణాత్మక / భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన /ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది.28.09.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు అక్కడ ఏమున్నదో అది అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

| ఇ-వేలం తేది & సమయం: 28.09.2026, మ॥ 02.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో) | ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 28.09.2026, మ॥ 12.00 గం॥ల లోపు |
|---|---|

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 28.09.2026, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

| ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడకు బదిలీ చేయడమైనది) | తనఖాలో ఉన్న ఆస్తి వివరములు | రిజర్వు ధర (రూ.లో) | ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%) |
|---|---|---|---|
| రాజమండ్రి మెయిన్-II బ్రాంచ్ M/s ఆదిత్య రోల్ ఫార్మింగ్ ఇండస్ట్రీ, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు పార్ట్‌నర్స్ 1. శ్రీ నరిడె రాయుడు (మేనేజింగ్ పార్ట్నర్), తండ్రి: ఎస్. వెంకట స్వామి, 2. శ్రీ నరిడె వెంకట త్రినాథ్ (పార్ట్నర్), తండ్రి: ఎస్. రాయుడు హామీదారులు: 1. శ్రీ నరిడె రాయుడు, తండ్రి: ఎస్. వెంకట స్వామి, 2. శ్రీ నరిడె వెంకట త్రినాథ్, తండ్రి: ఎస్. రాయుడు, 3. శ్రీ నరిడె సత్య, తండ్రి: ఎస్. రాయుడు, 4. శ్రీమతి నరిడె లక్ష్మీ దేవి, భర్త: ఎస్. రాయుడు తేది.03.09.2026 నాటికి బకాయి మొత్తం: రూ.2,37,78,585.32 + వడ్డీ + ఇతర ఖర్చులు. | ఐటెం నెం.4 : పిడింగొయ్య ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం.2495/2008, తేది 12.08.2008 ప్రకారం: తూర్పుగోదావరి జిల్లా, పిడింగొయ్య సబ్-రిజిస్ట్రీ, రాజమండ్రి రూరల్ మండలం, పిడింగొయ్య గ్రామం, పిడింగొయ్య గ్రామపంచాయతీ, ఆర్ ఎస్ నెం. 332/2A, ప్రస్తుతం ఆర్.ఎస్. నెం.332/2A-2 నందు మొత్తం విస్తీర్ణం ఎకరా 2-70 సెంట్లులోని దక్షిణం వైపున మొత్తం విస్తీర్ణం ఎ. 0.99 సెంట్లులో ఉత్తరం తూర్పు కార్నర్ వైపున 379.28 చ॥గ॥లో దక్షిణం వైపున 278.48 చ॥గ॥ లేదా 232.837 చ॥మీ॥ ఖాళీ స్థలం, సమీప డి.నెం.14-40. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 1,82,80,000/- (అక్షరాల ఒక కోటి ఎనభై రెండు లక్షల ఎనభై వేల రూపాయలు మాత్రమే) | రూ. 18,28,000/- (అక్షరాల పద్దెనిమిది లక్షల ఇరవై ఎనిమిది వేల రూపాయలు మాత్రమే) |
| ఐటెం నెం.5 : పిడింగొయ్య ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం. 93/2009, తేది 21.01.2009: తూర్పుగోదావరి జిల్లా, పిడింగొయ్య సబ్-రిజిస్ట్రీ, రాజమండ్రి రూరల్ మండలం, పిడింగొయ్య గ్రామం, పిడింగొయ్య గ్రామపంచాయతీ, సమీప డి.నెం. 14-40, ఆర్ ఎస్ నెం.332/2A, ప్రస్తుతం ఆర్.ఎస్. నెం.332/2A-2 నందు మొత్తం విస్తీర్ణం ఎకరా 2-70 సెంట్లులోని దక్షిణం వైపున మొత్తం విస్తీర్ణం ఎ. 0.99 సెంట్లులో ఉత్తరం తూర్పు కార్నర్ వైపున 379.28 చ॥గ॥లో దక్షిణం వైపున 278.48 చ॥గ॥లో ఉత్తరంవైపునున్న 100.6 చ॥గ॥లో దక్షిణంవైపునున్న 50.44 చ॥గ॥ లేదా 42.172 చ॥మీ॥ ఖాళీ స్థలం శ్రీ నరిడె రాయుడు & శ్రీమతి నరిడె లక్ష్మి దేవి పేరున గలదు. హద్దులు డీడ్ ప్రకారం. 4 మరియు 5 ఐటమ్స్ రెండూ కలిపి మొత్తం విస్తీర్ణం 328.92 చ॥గ॥లు కలదు. | | | |

ఆస్తి తనిఖీ తేది & సమయం: 25.09.2026, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు. అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8331011695

* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 100 లక్షల నుండి 500 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 1,00,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు. ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/eauction-psb, హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 /8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com / support.ebkray@procure247.com

తేది: 03.09.2026, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్


# పోలీసు క్రీడలకు ఇక ప్రత్యేక అకాడమీ

- పోలీసు క్రీడాకారులకు ప్రొఫెషనల్ శిక్షణ
- స్పోర్ట్స్ కార్యకలాపాల కోసం విట్‌తో ఎంఒయు
- పోలీసు క్రీడా సంబరాల సభలో డిజిపి వెల్లడి



**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర పోలీసు క్రీడాకారులను జాతీయస్థాయిలో తీర్చిదిద్దే లక్ష్యంతో 'ఎపి పోలీస్ స్పోర్ట్స్ అకాడమీ' ఏర్పాటు చేస్తున్నట్లు డిజిపి హరీష్ కుమార్ గుప్తా ప్రకటించారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ, ఆధునిక క్రీడా పరికరాలు, అవసరమైన మౌలిక వసతులు కల్పించి ప్రొఫెషనల్ స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందులో భాగంగా విఐటి-ఎపి, అమరావతితో పోలీసుశాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఎపి పోలీస్ స్పోర్ట్స్ అకాడమీ లోగోను డిజిపి ఆవిష్కరించారు. మంగళగిరి ఎపిఎస్పీ 6వ బెటాలియన్‌లో శుక్రవారం జరిగిన తొలి ఎపి స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 ముగింపు కార్యక్రమంలో డిజిపి మాట్లాడారు. పోలీసుశాఖలో హోదాలు, పోస్టింగ్‌లు వేరైనా అందరూ ఒకే జట్టులోని సభ్యులేనని పేర్కొన్నారు. 'మనది ఎపి పోలీస్ టీమ్.. మనమంతా ఒకే కుటుంబం. సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగల్గం అని పిలుపునిచ్చారు. సమాజంతోపాటు నేరాల స్వరూపమూ వేగంగా మారుతోందని డిజిపి పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఎదురయ్యే కొత్త తరహా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు పోలీసులకు శారీరక, మానసిక దృఢత్వం అత్యంత అవసరమన్నారు. క్రీడలను ఉద్యోగ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర పోలీసు క్రీడాకారులు ఈ మీట్‌తోనే ఆగిపోకుండా ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్‌కు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో మహిళలు ప్రతిభ చాటుతున్నారని, పోలీసుశాఖలోని మహిళా క్రీడాకారులు కూడా రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేలా పూర్తి ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించిన ఆర్గనైజింగ్ కమిటీ, విశ్వవిద్యాలయాలు, క్రీడా సంస్థలు, కోచ్‌లు, సాంకేతిక అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు, స్పాన్సర్లను డిజిపి అభినందించారు. వచ్చే ఏడాది పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను మరింత విస్తృతంగా, మెరుగైన ప్రమాణాలతో నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 15 రేంజ్‌ల నుంచి దాదాపు 1,900 మంది పోలీసు క్రీడాకారులు నాలుగు రోజులపాటు జరిగిన పోటీల్లో పాల్గొన్నారని డిజిపి తెలిపారు. తొలిసారిగా ఇంత పెద్ద స్థాయిలో రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడం గర్వకారణ మన్నారు. పతకాలు సాధించిన వారిని అభినందిస్తూ.. విజయం సాధించని వారు నిరుత్సాహపడకుండా మరింత సాధనతో ముందుకు సాగాలని సూచించారు.

**విశాఖ రేంజ్‌కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్:** నాలుగు రోజులపాటు హోరాహోరీగా సాగిన పోటీల్లో విశాఖ రేంజ్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐజిలు కె.వి.మోహన్‌రావు (స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్), ఆకే రవికృష్ణ (ఈగల్), బి.రాజకుమారి (వుమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ), సీహెచ్.శ్రీకాంత్ (టెక్నికల్ సర్వీసెస్ అండ్ ఆపరేషన్స్), సెంథిల్‌కుమార్, ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్, డిఐజిలు అన్బురాజన్, వకుల్ జిందాల్‌తోపాటు సీనియర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వార్త

క్రమశిక్షణ, సౌశీల్యం, అంతర్దృష్టి, మానవీయత, కరుణ మొదలైన గుణాలు లోపించిన నాయకుల చేతుల్లో రాజకీయాలు ఉండటం కంటే అసలు రాజకీయాలే లేకపోవడం ఎంతో మేలు.

- రామ్ మనోహర్ లోహియా

# అవశేషమే విశేషం!

రైతు శరీరభాగాల్లో పురుగుమందుల అవశేషాలు కానవస్తున్నాయన్న అంశంపై ఇప్పుడు ఎల్లెడలా విస్తృత చర్చ నడుస్తోంది. తన పంట బాగుకు అధిక దిగుబడికి పంట పొలాల్లో పురుగు మందులు చల్లడం, తెగుళ్ల మందుల పిచికారీలు చేయని రైతు ఉండనే ఉండడు. పంట బాగా పండి తన పెరట్లో గాదులు నిండితే చాలునని రైతు సంతృప్తి పడతాడు. అందుకే వాళ్లు ఆరుగాలం, అహర్నిశలూ కష్టపడుతుంటారు. ప్రపంచరైతుల్లో సగం మంది శరీరంలో పురుగు మందుల అవశేషాలున్నాయన్న గణాంకాల కారణాలు ఏవైనా ప్రపంచానికే ఆహార భరోసానిస్తున్న రైతు శరీరమే విషజాలంగా మారితే అందుకు బాధ్యులెవరో అంత తేలికగా తేల్చి చెప్పే విషయం కానేకాదు. ఇలాంటి దురదృష్టకర ఉదంతాలు వెల్ల డైనప్పుడల్లా ప్రభుత్వాలు, రైతులు, పురుగుమందుల కంపెనీల్లోనూ సందిగ్ధతలు ఉదయిస్తాయి. కానీ మళ్లీ మళ్లీ షరామామూలే. ఇలాంటి ఉదంతాలు పునరావృతమవుతూనే ఉంటాయి. తన వ్యాపారం పెరుగుతుందని పురుగు మందుల తయారీ సంస్థ భావిస్తే రైతు మాత్రం మంచి దిగుబడే కోరుకుంటాడు. మధ్యేమార్గంగా ప్రభుత్వం ఆ ఇరుపక్షాల సంక్షేమం కోసం 'సాగు' ప్రణాళికలు రూపొందిస్తుంది. కానీ అవి వికటిస్తే రైతుగతి అధోగతే. హరిత విప్లవం పేరిట దేశంలో దిగుబడులు పెరిగాయి. ప్రపంచ దేశాల్లో ఆహార భద్రతకు మేమే అని చెప్పుకుంటున్నాము. కానీ రైతు ఆకాంక్షలు, పురుగుమందుల నుండి రైతుకు రక్షణ, సాగుకు సంరక్షణ వంటి అంశాలపై పూర్తిస్థాయి భద్రతా విధానాలను పాటించేలా అవగాహన కల్పించడంలో ప్రభుత్వం ఇంకా ఒక అడుగు వెనుకనే ఉంది. నిజానికి పంట విధానాలు ఎన్నున్నా పెస్టిసైడ్స్ వాడకంలో రైతు ఎక్కడో అక్కడ తప్పటడుగు వేస్తున్నాడని ప్రభుత్వాలు ఆరోపిస్తుంటాయి. వీటిలో ఎంత నిజం ఉన్నా లేకపోయినా రైతు ఆరోగ్యానికి చేటు తప్పడం లేదు. పురుగుమందుల వాడకంలో రైతును సరైనదారిలో పెట్టగల పథకాలేవీ ప్రభుత్వం వద్ద లేవు. శాస్త్రీయ పరిజ్ఞానం ఎంతఅందుబాటులో ఉన్నా వాటిని సరైన దిశగా అమల్లో పెట్టే రైతాంగం లేదని అనుకోవడం కద్దు. పంటను కాపాడే మందు అయినా ఇప్పుడా పురుగు మందే రైతు ఆరోగ్యాన్ని దెబ్బతిస్తోంది. తాము వాడుతున్నది అసలు మందులా, నకిలీ మందులో జాడ తెలుసుకోలేక రైతు సందిగ్ధంలో పడిపోతున్నాడు. ప్రపంచవ్యాప్తంగా 93.4 కోట్ల మంది వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తుండగా వారిలో కనీసం సగం పైగా అంటే 40.2 కోట్ల నుంచి 43.3 కోట్ల మంది రైతుల వ్యవ సాయ కూలీల శరీరాల్లో పురుగు మందులకు సంబంధించిన విషపూరిత అవశేషాలను గుర్తించినట్లు 'పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ సంస్థ' తన నివేదికలో వెల్లడించింది. పురుగుల మందుల బారిన పడి యేటా ప్రపంచ వ్యాప్తంగా 11వేల మంది చనిపోతున్నారు. అందులో 60శాతంభారత్‌లోని రైతులు, వ్యవసాయ కూలీలే అని ఒక అంచనా. పశ్చిమ ఆఫ్రికాలోనిబుర్కినా ఫోసాలోని రైతాంగంలో 84 శాతం మంది రైతులు, కూలీల శరీరం లో విషకారకాలు బయటపడుతున్నాయి. రైతు పొలంలో చల్లే పురుగుమందుల్లో ప్రతి చుక్కవిషం, పిల్లలకు చేరుతోంది. ఆ పని వారి రక్తంలో, మూత్రంలో, స్వేదంలోనూ ఈ విషప్రభావం చేరిపోతోంది. ప్రధానంగా రైతు పురుగుమందుల వినియోగంలో అత్యాశకు పోయి వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదుకన్నా 3-4 రెట్లు ఎక్కువ మందు వాడుతున్నారు. ఒకమందు పనిచేయక పోతే మరో సంస్థ తయారీ మందును వాడేస్తున్నారు. ఎండో సల్ఫాన్, మోనోక్రోటోఫాస్, ఫోరేట్ వంటి అత్యంత విషపూరిత మందులను భారత్‌లో విచ్చలవిడిగా వాడుతున్నారు. ఇన్నాళ్లకు ఎండో సల్ఫాన్ వినియోగం విషయంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని హెచ్చరికలు జారీ చేసింది. రైతును ఆ మందు వాడకుండా ఆపేందుకు ఈ ప్రయత్నం చేశారు. అసలు తయారీనే ఆపించాలి. వీటి వినియోగంలో రైతును ఆశించే అవశేషాలు క్యాన్సర్, కిడ్నీ ఫెయిల్యూర్, నరాల బలహీనత, సంతానలోపం, చర్మవ్యాధులకు దారితీస్తాయి. పంజాబ్‌లో క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేక రైలు ఉన్నట్లుగానే, కేరళలో ఎండో సల్ఫాన్ బాధితులు ఎక్కువ మంది ఉన్న గ్రామాలు కూడా ఉన్నాయంటే అర్థం చేసుకోవచ్చు. ఇలా రైతు శరీరంలో విషం ఉంటే వారు పండించే ధాన్యంలో మనం తినే ఆహారంలో కూడా ఉన్నట్లే. విష అవశేషాల ప్రభావం తల్లిపాల ద్వారా బిడ్డకు, విత్తనం ద్వారా తర్వాత పంటకు చేరిపోతోంది. ఇప్పటికీ మార్కెట్‌లో 27 రకాల పురుగు మందులపై నిషేధం విధించాల్సి ఉందని రైతాంగం కోరుకుంటోంది. ఏవో కొన్ని కారణాల వలన కేంద్రప్రభుత్వం వాటి మీద దృష్టి పెట్టలేకపోతోంది. కనీసం సేంద్రియ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ అవకాశం చూపితే రైతు ఒడ్డునపడతాడు. జీవన ఎరువులు, వేప ఆధారిత ఎరువులు, సమగ్ర సస్యరక్షణ విధానాలను రైతుకు చేరువచేస్తే తప్ప ఈ విషవలయంలోంచి బయటకురాలేడు. ఈ అవశేషాలు ప్రాణాంతకం అన్న విషయం గతంలో కొన్ని ఉదంతాల వలన తేటతెల్లం అయింది. గత మూడేళ్లలో మహారాష్ట్రలో 183 మంది రైతులు పురుగుమందు పీల్చడం వలన చనిపోయారు. 2017 ఆగస్టు, సెప్టెంబరు నెలలో 'యావత్మాల్'లో పత్తి పంటపై పిచికారీ చేసిన పురుగుమందులకు 21 మంది రైతులు, కూలీలు బలయ్యారు. 2024-26ల మధ్య రాజస్థాన్‌లో 535 మంది రైతులు ఈ పురుగుమందుల వాడకంతో మృతి చెందారు. ఇలా ప్రాణాంతక వ్యవసాయంగా మారితే రైతులు 'సాగు' రంగాన్ని వీడితే 'ఆహారభద్రత'కే గండి పడుతుంది.

రచయితల సంఖ్య పెరిగే కొద్దీ పాఠకులు సోమరులుగా మారడం సహజం.



గోల్డ్‌స్మిత్

ఒక కంటితో నిద్రపోతూ మరో కంటితో శత్రువులను కనిపెట్టి ఉండే ఎలుగుబంటిలా రాజు శత్రువుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.



శ్రీకృష్ణదేవరాయలు

## ప్రజావాక్కు



### గురువులను గౌరవిద్దాం

నేటి విద్యార్థుల్లో కొందరికి గురువులంటే భయం, భక్తి, గౌరవం తగ్గిపోతున్నాయి. తరగతి గదుల్లోనే గురువులపై కామెంట్లు చేస్తూ, వెకిలిచేష్టలు చేయడంబాధాకరం. గురువులు తప్పును సరిదిద్దేందుకు మందలిస్తే, కొందరు విద్యార్థులు దారుణంగా ప్రవర్తిస్తూ బెదిరించే స్థాయికి వెళ్తున్నారు. తమ జీవితానికి మార్గదర్శనం చేసే గురువుల పట్ల కనీస గౌరవం లేకుండా ప్రవర్తించడం సరికాదు. గురువు చెప్పే మాటలు మన భవిష్యత్తుకు ఉపయోగపడే మంచి మార్గదర్శకత్వమని విద్యార్థులు గుర్తించాలి. గురువులను గౌరవించడం అంటే విద్యను, జ్ఞానాన్ని, మన భవిష్యత్తునుగౌరవించడమే. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచడంలో తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమైనది. పిల్లలు తప్పులు చేయకుండా తల్లిదండ్రులు కూడా వారి ప్రవర్తనను గమనిస్తూ చూడాలి. గురువు విలువను గుర్తించి గౌరవించ డం ప్రతి విద్యార్థి బాధ్యత.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### పరిశోధకులను నియమించుకోవాలి

తెలంగాణా రాష్ట్రంలో గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు నూతన సంస్కరణలో భాగంగా పరిపాలనా పరమైన పరిశోధనలు అవసరం. ప్రతిమంత్రిత్వ శాఖ పరిధిలో ఆయా కార్యాలయాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులలో ఉన్నత విద్యలను అభ్యసించి వివిధ యూనివర్సిటీల నుండి డాక్టరేట్ పట్టా పొందిన ఉద్యోగుల వివరాలు సేకరించాలి. వారిద్వారా ఆయా శాఖలలో పని విధానం, నిధులు, సౌకర్యాలు, సమస్యలు, పరిష్కరించడం కోసం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సహాయకులుగా పనిచేయడానికి సలహాలు సూచనలు ఇవ్వడానికి వారిని నియమించుకోవాలి. ఆయా శాఖల అభివృద్ధికి గాను వీరి సేవలను వినియోగించుకోవాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### మట్టి విగ్రహాలను పూజిద్దాం

రాబోయే గణపతి ఉత్సవాల్లో భాగంగాకేవలం మట్టి విగ్రహాలను మాత్రమే పూజించి పర్యావరణాన్ని కాపాడుకునే ప్రయత్నం చేద్దాం. మారుతున్న కాలానుగుణంగా రకరకాల రంగురంగుల వినాయక విగ్రహాలను పర్యావరణ పరిరక్షణకు ఇబ్బంది కలగడమే కాకుండా చెరువుల్లో నిమజ్జనం చేసినప్పుడు నీరు కలుషితంతో పాటు వాటిని త్రాగే పాడిపశువులు, సకల జీవరాశులు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### అయినా! ట్రంప్ మారడు

అమెరికా వాణిజ్య లోటును తగ్గించడం, దేశీయ పరిశ్రమలను కాపాడటమనే ప్రధాన ఉద్దేశ్యంతో అంతర్జాతీయ వాణిజ్యంలో ఇతర దేశాల నుంచి అమెరికాలోకి వచ్చే వస్తువులపై విధించే కస్టమ్స్ సుంకాలను ఎడాపడా వేసారు. ఇంతకు ముందున్న అమెరికా అధ్యక్షులెవరికీ లేని దుందుడుకుతనం ట్రంపుది. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు కొనసాగించడంపై ట్రంప్‌ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేస్తూ, భారత్ సహా పలు దేశాలపై ట్రంప్ సర్కార్ అదనపు టారిఫ్‌లు, సుంకాల పెంపునిర్ణయాలు ప్రకటించింది. అంతేకాదు జనరిక్ ఔషధాలపై కూడా ట్రంప్ టారిఫ్ విధించారు. ఈకొత్త టారిఫ్ల విధానాలపై అమెరికాలోని పలు రాష్ట్రాలు కోర్టును కూడా ఆశ్రయించాయి. కోర్టుల్లో పలు కీలక వ్యతిరేక తీర్పులు (ఎదురుదెబ్బలు) తగిలాయి. ఐనా! ట్రంప్ మారడం లేదు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### రైతులకు పశువులను అందించాలి

వర్షాభావ పరిస్థితులను ఎదురుకునేందుకు పశువులను రుణాలపై అందించాలి అని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడం సంతోషకరం. అది గ్రామీణా ఉపాధి కల్పనా కార్యక్రమం ద్వారా కావొచ్చు, లేక ముద్ర పథకం ద్వారా కావొచ్చు. సెర్ప్ సంస్థ పెద్దన్న పాత్ర పోషించి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా డెయిరీని ఏర్పాటు చేసి విజయ డెయిరీ ద్వారా పాల కొనుగోలు కూడా చేపట్టడం గొప్ప అవకాశం. గత ప్రభుత్వం గొర్రెలు దిగుమతి ఆపడానికి గొర్రెల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి గొర్రెల సంఖ్యలో దేశంలో రెండో స్థానంలో నిలిపితే ఇప్పటి ఈ ప్రభుత్వం పాల దిగుమతిని ఆపుటకు త ద్వారా పాల ఉత్పత్తి సాధించుటకు కృషి చేస్తున్నది. అయితే ఉపాధి హామీ లేదా వీబీ జీరామ్ జీ ద్వారా ఈ ప్రాజెక్ట్ కూడా చేపడితే పథకం సంపూర్ణ ఫలితాలు అందిస్తుంది.

- భారత అవినాష్, జనగామ

### ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తరించాలి

భారత్ చుట్టూ ఉన్న భౌగోళిక, భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే దేశ రక్షణసన్నద్ధతలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావు లేదు. సరిహద్దుల్లో శాంతి కొనసాగాలని భారత్ కోరుకుంటున్నప్పటికీ, ఎలాంటి అనూహ్య పరిస్థితినైనా ఎదుర్కొనే సామర్థ్యాన్ని నిరంతరం పెంచుకోవాల్సిన అవసరం ఉంది. శాంతిని కోరుకోవడం బలహీనత కాదు, శాంతిని కాపాడగల సైనిక సామర్థ్యమే నిజమైన నిరోధక శక్తి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయొద్దు

**దేశంలో కానీ, రాష్ట్రాల్లో కానీ ఎంతో సమర్థవంతులుగా పేరు తెచ్చుకున్న నాయకుల్లో అధిక శాతం పంచాయతీరాజ్ వ్యవస్థ నుండి వచ్చినవారే. సర్పంచులు, సమితి అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా పనిచేసిన వారికి ప్రజాసమస్యలు ముఖ్యంగా గ్రామీణ సమస్యల పట్ల మంచి అవగాహన ఉంటుంది. ఏ సమస్య వచ్చినా తమ తరపున మాట్లాడటానికి తమ సర్పంచ్ ఉన్నాడనే ధైర్యం ఆనాడు గ్రామ ప్రజల్లో అపారంగా ఉండేది. ఇలా ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్న గ్రామ నాయకులు ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగారు. ఇప్పుడా పరిస్థితి స్థానిక సంస్థలకు లేదనే చెప్పొచ్చు. నిధులు లేక తలతాకట్టుపెట్టి అప్పో సప్పో చేసి గ్రామాభివృద్ధికి సొంత డబ్బు వెచ్చించిన ఎందరో సర్పంచులు వారి పదవీకాలం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఆ బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు భరించలేక, ఆత్మగౌరవం చంపుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ కొందరు మాజీ సర్పంచులై ఏళ్లు దాటినా తమ బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు.**

దామెర్ల సాయిబాబ

కానుకలు, దక్షిణతాంబూలాలు, మొక్కులు అన్నీ సమర్పించుకున్న తర్వాత కూడా దైవం కోరిన వరాలు ఇవ్వకపోతే కోరికలు తీర్చకపోతే పోయావు తాము చెల్లించిన కానుకలు, దక్షిణలు తిరిగి ఇవ్వాలంటూ 'మాదన్నమాకీ రాజన్న దేవుడా' అంటూ భక్తులు వేములవాడలోని రాజరాజేశ్వర స్వామిని వేడుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. భక్తులు సమర్పించిన కానుకలు తిరిగి వారికి చెల్లించడానికి ఆయన దగ్గర లక్ష్మి ఉండదు కనుక ఏదో వరం ఇచ్చి పంపుతారనేది భక్తుల విశ్వాసం. ప్రజాస్వామ్యవ్యవస్థకు మూలస్తంభాలైన స్థానిక సంస్థల ప్రతినిధుల పరిస్థితి అందుకు అద్దంపడుతుందేమోననిపిస్తున్నది. పంచాయతీలకు నిధులు, విధులు ఇస్తాం, చట్టాలు తెచ్చాం, గ్రామ సమస్యలను గుర్తించి స్థానికంగానే సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నాం అంటూ ఎంతో కాలంగా పాలకులు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తూనే ఉన్నారు. కానీ 'అయ్యా మాకేమీ కొత్త చట్టాలు చేసి అదనంగా నిధులు, అధికారాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. రాజ్యాంగ సవరణల ద్వారా కల్పించిన ముప్పై తొమ్మిది ప్రభుత్వ శాఖలను గ్రామస్థాయిలో తమకు అప్పగిస్తే అదే పదివేలని వారు ఎంతోకాలంగా వేడుకుంటున్నారు. చట్టంలో ఉంది కనుక ఇవ్వమని చెప్పలేరు, అలాని ఇవ్వరు. దశాబ్దాల తరబడి నాన్చుతూనే ఉన్నారు. ఇప్పటికీ చట్టంలో కల్పించిన సగం అధికారాలు కూడా వారికి ఇవ్వలేదు. ఇచ్చినా కొద్దిపాటి శాఖల్లోకూడా అనేక ఆంక్షలు, అధికారుల జోక్యాన్ని పెంచారు. అంతేకాదు ఒక వ్యూహం ప్రకారం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారనే ఆరోపణలను కొట్టివేయలేం. సర్పంచులకు గౌరవమర్యాదలకు ఎలాంటి లోటు ఉండదని అంటూనే ఇంకొకపక్క విద్యాకమిటీలు, వనరక్షణ కమిటీలు, నీటి సంఘాలంటూ స్థానిక సంస్థలకు సమాంతరంగా వ్యవస్థలను ఏర్పాటు చేసి సర్పంచు పదవులను ఉత్సవ విగ్రహాలుగా తయారు చేశారు. స్థానిక సంస్థల ప్రతినిధుల ప్రమేయం లేకుండానే ఎన్నోసంక్షేమ కార్యక్రమాలను, చివరకు లబ్ధిదారుల గుర్తింపులు కూడా జరిగిపోతున్నాయి. ఇది ఇప్పటికిప్పుడు ఆరంభమైంది కాకపోయినా రెండు, మూడు దశాబ్దాలుగా ఒక వ్యూహం ప్రకారం స్థానిక సంస్థలను బల హీనపరిచే కార్యక్రమం జరుగుతున్నది. చివరకు చీపురుకట్ట కొనడానికి కూడా స్వతంత్రంగా వ్యవహరించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మరొకపక్క ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఆదాయం అంతంత మాత్రమేఉంది. ఆస్తిపన్ను తప్ప మరోపెద్ద ఆదాయవనరు లేకుండాపోయింది. ఇకగ్రామంలో ఏ అభివృద్ధి చేయాలన్నా అటు కేంద్ర ప్రభుత్వం వైపు, ఇటు రాష్ట్ర ప్రభుత్వంవైపు చేయి చాచే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏకోణంలో చూసినా పంచాయతీ రాజ్ వ్యవస్థను అంతోఇంతో నిర్వీర్యం చేయాలని అందరూ ప్రయత్నం చేసినవారే. తమ అధికారాలకు, ప్రాబల్యానికి దెబ్బ తగులుతుందనే భయమే ఇందుకు కారణమని చెప్పొచ్చు. పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారానే రాజకీయ ప్రవేశం చేసి ఉన్నతస్థాయికి చేరిన కొందరు నాయకులుకూడాపంచాయతీలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించడం అత్యంత బాధాకరం. దేశంలో కానీ, రాష్ట్రాల్లోకానీ ఎంతో సమర్థవంతులుగా పేరు తెచ్చుకున్న నాయకుల్లో అధికశాతం పంచాయతీరాజ్ వ్యవస్థ నుండి వచ్చినవారే. సర్పంచులు, సమితి అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా పనిచేసినవారికి ప్రజాసమస్యలు ముఖ్యంగా గ్రామీణ సమస్యల పట్ల మంచి

ఒక్క మాట

అవగాహన ఉంటుంది. ఏ సమస్య వచ్చినా తమ తరపున మాట్లాడటానికి తమ సర్పంచ్‌ఉన్నా డనే ధైర్యం ఆనాడు గ్రామప్రజల్లో అపారంగా ఉండేది. ఇలా ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్న గ్రామ నాయకులు ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగారు. ఇప్పుడా పరిస్థితి స్థానిక సంస్థలకు లేదనే చెప్పొచ్చు. నిధులులేక తలతాకట్టు పెట్టి అప్పోసప్పో చేసి గ్రామా భివృద్ధికి సొంత డబ్బు వెచ్చించిన ఎందరో సర్పంచులు వారి పదవీకాలం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఆ బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు భరిం చలేక, ఆత్మగౌరవం చంపుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతు న్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ కొందరు మాజీ సర్పంచులై ఏళ్లు దాటినా తమ బిల్లులకోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. భారతదేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. చంద్రగుప్తుడికంటే ముందు నుంచి గ్రామాలు, గ్రామ వ్యవస్థ అమలులో ఉన్నట్లు చరిత్ర చెబుతున్నది. ఆనాడు కూడా గ్రామసభలుండేవి. వాటి నిర్ణయాలకు ఆనాటిరాజరిక వ్యవస్థ ఎంతోప్రాముఖ్యత ఇచ్చిం ది. ప్రాచీన కాలం నుండే గ్రామవ్యవస్థ ఏదో ఒకరూపంలో మనదేశంలో కొనసాగుతూ వచ్చింది. 1882లో ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్ రిప్పన్ స్థానిక సంస్థలకు ఒక ప్రతిపత్తి కల్పించారు. స్వాతంత్ర్య నంతరం 1952లో మొదటి పంచవర్ష ప్రణాళికలోనే కేంద్ర ప్రభుత్వం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ప్రారంభించింది. దాదాపు వంద గ్రామాలకు సుమారు లక్ష జనాభాతో ఒకయూనిట్‌ను ఏర్పాటు చేసి సామాజికాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కొంతకాలం కొనసాగిన పిదప అవి ఏ మేరకు లక్ష్యసాధనలో గ్రామ ప్రజలకు ఉపయోగపడ్డాయి? ప్రజలకు మరింత దగ్గర చేసేందుకు మార్పులు అవసరమా? అవసరమైతే ఎలాంటి మార్పులు చేయాలి? తదితర అంశాలపై అధ్యయ నం చేసేందుకు 1957లో ఒక కమిటీని వేశారు. బల్వంత రాయ్ మెహతా అధ్యక్షతన ఈ బృందం దేశంలోని అనేక ప్రాంతాలు పర్యటించి సమగ్రంగా పరిశీలించి 1958లో ఒక నివేదిక సమర్పించింది. గ్రామాభివృద్ధికి నిర్ణయాలు తీసుకునే అధికారం, స్వేచ్ఛస్థానిక సంస్థలకే ఉండాలని, అవి మూడంచెల విధానంలో ఉంటే బాగుంటుందని తదితర స్పష్టమైన సూచనలు చేసింది. ఆ సూచనల మేరకే దేశంలో మొదట రాజస్థాన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మూడంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. 1964లో గ్రామపంచాయతీ చట్టం తీసుకువచ్చారు. ఎంపి పాయ్‌కమిటీ నివేదికను అనుసరించి 447 బ్లాకులను, 321కు కుదింపు చేశారు. 1985లో సమితులను రద్దు చేసి అంతకుముందు అశోక్ మెహతా కమిటీ చేసిన సూచనలమేరకు 1986లో మండల్ ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్‌ను ఏర్పాటు చేశారు. ఇలా ఎన్నోమార్పులు చేర్పులు చేశారు. దేశవ్యాప్తంగా ఒకే తరహా పంచాయతీ రాజ్ వ్యవస్థ అమలులో ఉండాలనే ఉద్దేశ్యంతో 73వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదించిం ది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1994 మే 30వ తేదీ నుండి ఈశాసనం అమలులోకి వచ్చింది. ఈ చట్టప్రకారమే రాష్ట్రంలో ఐదంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. జెడ్‌పిటిసి, ఎంపి టిసిలని కొత్త పదవులు సృష్టించారు. కనీసం కూర్చోడానికి కుర్చీకూడా లేకుండా, అధికారాలు లేకుండా ఆ పదవులు ఎందుకు సృష్టించారో ఇప్పటికీ అర్థంకాదు. ఎన్ని మార్పులు చేసినా, మరెన్ని కూర్పులుచేసినా, అధికార వికేంద్రీకరణ మాత్రం మొదటి నుంచి అధికారంలో ఉన్న పెద్దలు జాగ్రత్త పడుతూనే వచ్చారు. తెలంగాణ ప్రభుత్వం 2018 ఏప్రిల్ నుంచి కొత్తచట్టాన్ని తీసుకువచ్చింది. ఈచట్టప్రకారం మరి కొన్ని అధికారాలతో పాటు ఆదాయాన్ని పెంచుకునే మార్గాలకు అవకాశాలు ఇచ్చింది. మొన్న తెలంగాణలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు కొలువు తీరారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వర లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగబోతున్నాయి. అనేక సమస్యలు వారి ముందు దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి పేరుకుపోయిఉన్నాయి. ప్రగతికిమూలం కావాల్సిన పల్లెలు సమ స్యల నిలయాలుగా ఉన్నాయి. ప్రతి గ్రామం ఏదోరక మైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. స్థానిక సంస్థలను భాగ స్వామ్యం చేయకపోడంతో లబ్ధిదారుల గుర్తింపులో కూడా అనేక అవకతవకలు జరుగుతున్నాయి. గ్రామాభివృద్ధికి చేపడుతున్న పనులు పంచాయతీ పరిధిలోకి తీసు కురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏదిఏమైనా రాజ్యాంగం కల్పించిన అధికారాలు, స్థానిక సంస్థలకు ఇవ్వడంలో జాప్యం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు గావుకేకలు పెడుతున్న రాష్ట్రాల నేతలు స్థానిక సంస్థలకు మాత్రం అధి కారాలు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమో పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. ●

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు భరోసా ఏది?

డా. మోటె చిరంజీవి

విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పథకంపై ప్రభుత్వ చిత్తశుద్ధి అవసరం. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అత్యంత కీలకం. ఆర్థిక స్థోమత లేక చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితిలో ఉన్న అనేక మంది విద్యార్థులకు ఈ పథకం ఒక ఆశాకిరణంగా నిలిచింది. అయితే రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం, బకాయిలు పేరుకుపోవడం విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు విద్యాసంస్థల యాజమాన్యాల్లోనూ ఆందోళన కలిగిస్తోంది. విద్య అనేది ఖర్చు కాదు. భవిష్యత్తుకు పెట్టుబడి. ముఖ్యంగా పేద కుటుంబాల పిల్లలు ఇంజినీరింగ్, వైద్య, ఫార్మసీ, డిగ్రీ, పీజీ, వృత్తివిద్య వంటికోర్సులు అభ్యసించేందుకు ప్రభుత్వ సహకారం ఎంతో అవసరం. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందితేనే విద్యార్థులు ఆర్థిక ఒత్తిడి లేకుండా తమ చదువును కొనసాగించగలరు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోతే దాని ప్రభావం విద్యార్థులపైనే కాకుండా కళాశాలల నిర్వహణపైనా పడుతుంది. బోధనా సిబ్బంది జీతాలు, మౌలిక వసతుల నిర్వహణ, విద్యాప్రమాణాల కొనసాగింపు వంటి అంశాలు ఆర్థిక సమస్యలకు గురయ్యే అవకాశం ఉంటుంది. చివరికి దీనిప్రభావం విద్యార్థుల భవిష్యత్తుపైపడటంఆందోళనకరం. 2019-20 రూ.27 కోట్లు, 2020-21 రూ.151 కోట్లు, 2021-22 రూ.762 కోట్లు, 2022-23 రూ.1,432 కోట్లు, 2023-24 రూ.1,147 కోట్లు, 2024-25 రూ.24 కోట్లు పెండింగ్ టోకెన్ల మొత్తం రూ.3,543 కోట్లువున్నాయి. తెలంగాణలో ప్రొఫెషనల్, నాన్‌ప్రొఫెషనల్ కోర్సులకు కలిపి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం సుమారు రూ.2,500 కోట్ల వార్షిక కేటాయింపు చేస్తోంది. 2025-26 నాటికి బకాయిలు భారీగా పెరిగి, 2024-25 వరకు మొత్తం బకాయిలు సుమారు రూ.9,000 కోట్ల వరకు ఉన్నాయని ప్రైవేట్ కళాశాలల సమాఖ్యలు పేర్కొన్నాయి. ప్రభుత్వాలు పథకాలను ప్రకటించడం మాత్రమే కాకుండా వాటికి అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేయాలి. ముఖ్యంగా విద్యార్థుల చదువుతో ముడిపడిన పథకాల విషయంలో ఆలస్యం మరింత తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా పారదర్శకమైన, నిరంతర చెల్లింపు వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉంది. అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. పెండింగ్ బకాయిలను దశలవారీగా కాకుండా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతోపాటు, భవిష్య త్తులో బకాయిలు పేరుకుపోకుండా బడ్జెట్‌లో తగిన కేటా యింపులు చేయాలి. పేదరికం కారణంగా ఒక్క విద్యార్థి కూడా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. నిధుల విడుదలలో జాప్యం లేకుండా, విద్యార్థుల భవిష్య త్తుకు భరోసా కల్పించే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేయడమే సమాజ శ్రేయస్సుకు సరైన మార్గం. ●

# ఆచార్య దేవోభవ! అదే మన స్ఫూర్తిప్రదాత



శ్రీమతి ద్రౌపదీ ముర్ము


తలరాతను మార్చేది ఉపాధ్యాయులే. కోట్లాది మంది విద్యార్థుల జీవితాల్లో విజ్ఞానం, నైపుణ్యాలు, విలువలు, స్ఫూర్తి నింపి సుసంపన్నం చేస్తున్న గురువులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భారతీయులందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తన జన్మదినోత్సవాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని భారతదేశానికి రెండో రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆకాంక్షించిన విషయం అందరికీ తెలిసిందే. ఆయన అంతర్జాతీయంగా ఖ్యాతి గాంచిన మేధావి. ప్రఖ్యాత రచయిత. గొప్ప రాజనీతిజ్ఞుడు. అయినప్పటికీ ఉపాధ్యాయునిగా తానుపోషించిన పాత్రనే అన్నింటి కంటే మిన్నగా భావించారు. అత్యంత ఆదరణ పొందిన రాష్ట్రపతుల్లో ఒకరైన డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాంకు ఒక సందర్భంలో మిమ్మల్ని శాస్త్రవేత్తగా గుర్తుంచుకోవాలా? రాష్ట్రపతిగాగుర్తుంచుకోవాలా? అనే ప్రశ్న ఎదురయింది. తనను ఓ ఉపాధ్యాయుడిగా గుర్తుంచుకోవాలనిడాక్టర్ కలాం సమాధానమిచ్చారు. సామర్థ్యం, నైతిక విలువలే ఉపాధ్యాయులను పూజనీయులుగా మారుస్తాయి. అలాంటి వారినే విద్యార్థులు దైవంగా భావిస్తారు. వారినే ఆదర్శంగా తీసుకుంటారు. విద్యార్థులపై కోపం ప్రదర్శించకూడదని, సహనంతో ఉండాలని ప్రాచీన గ్రంథాలు సూచిస్తున్నాయి. 'ఆచార్యదేవో భవ' అనే కాలాతీత సందేశాన్ని దాదాపు మూడు సహస్రాబ్దాల క్రితం నాటి తైత్తిరీయ ఉపనిషత్తులోని శిక్షావల్లి అందిస్తోంది. ఎంతోమంది వివేకవంతులైన, ప్రేమ నిండిన ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని పొందడం నాకు కలిగిన గొప్ప అదృష్టం. కొన్నిసందర్భాల్లో పాఠశాల సమయం ముగిసిన తర్వాత సైతం తమ గృహాల్లోనే వారు మాకు పాఠాలు చెప్పేవారు. మమ్మల్ని ఎంతోజాగ్రత్తగా చూసుకొనేవారు. ఏడో తరగతి తర్వాత పైచదువుల కోసం మా ఊరు నుంచి బయటకు వెళ్లిన మొదటి అమ్మాయిని నేనే. ఆ తర్వాత భువనేశ్వర్‌లో చదువుతున్నప్పుడూ నా ఉపాధ్యాయుల నుంచి అపారమైన ప్రేమను, ప్రోత్సాహాన్ని పొందగలగడం నాకు దక్కిన భాగ్యం. నా ఉపాధ్యాయుల గురించి ఎంతో వినయంగా ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఎందుకంటే వారి కథ... ప్రేమ, అంకితభావంఉన్న ఉపాధ్యాయుడు విద్యార్థిలోఅపరిమితమైన సామర్థ్యాన్ని, స్ఫూర్తిని మేల్కొల్పగలరు అనే గొప్ప సత్యాన్ని తెలియజేస్తుంది. మంచి ఉపాధ్యాయున్ని తీర్చిదిద్దే సూక్ష్మం ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతీసంప్రదాయాల ద్వారా మనకు లభించింది. అది నేటి కాలానికి సైతం వర్తిస్తుంది. శతాబ్దాల క్రితం, మహాకవి కాళిదాసు తన మాళవికాగ్నిమిత్రం నాటకంలో, అపారమైన జ్ఞానాన్ని ఉండటంతో పాటు, దానిని ఇతరులకు అందించగల సామర్థ్యం ఉన్నవారే మంచి ఉపాధ్యాయుడు అని రాశారు. విద్యార్థుల్లో స్వతంత్ర్య ఆలోచనను ప్రోత్సహించడం, వారిలో ఆసక్తిని రేకెత్తించడం, తర్కాన్ని, ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించడం, నిర్ణయ సామర్థ్యానికి పదును పెట్టడం, వారు సాధికారత సాధించిన వ్యక్తులుగా ఎదగడానికి సాయ పడటం ఇవే బోధనకు ఉన్న అత్యంత ఉపయోగకరమైన, ప్రతిఫలాన్ని అందించే ఉపయుక్తకర అంశాలు. బోధన అంటే మానవాళిని తీర్చిదిద్దే పవిత్రమైన కార్యం. భవిష్యత్తు తరాలకు ప్రకాశవంతమైన మార్గాన్నిఅందించే ఉన్నతమైన బాధ్యత. బోధనకు సంబంధించిన నా జ్ఞాపకాలు నాకు ప్రత్యేకమైన సంతృప్తిని ఇస్తాయి. నేను ఒడిశాలోని రాయరంగ్‌పూర్‌లో ఉన్న శ్రీ అరబిందో ఇంటిగ్రల్ పాఠశాలలో చిన్నారులకు బోధించాను. వివిధ పాఠ్యాంశాలను బోధించడంతో పాటు... సంగీత ప్రదర్శనలకు, క్రీడలకు, నాటకాలకు వారిని సిద్ధం చేయడంలో పూర్తిగా నిమగ్నమై ఉండేదాన్ని. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలకోసం మా సన్నాహాలను, ఆ సమయంలో పిల్లల ఆనందోత్సాహాలను గుర్తు చేసుకుంటే ఈనాటికీ నాకు ఎంతో సంతోషం కలుగుతుంది. విద్యార్థులను అందమైన ప్రదేశాలకు విహారయాత్రలకు తీసుకెళ్లడంలో గొప్ప సంతృప్తిని, అర్థాన్ని కనుగొన్నాను. పాఠశాల విద్యపూర్తయి ఏళ్లు గడిచినా...ఇప్పటికీ నా విద్యార్థులు వారి కుటుంబ కార్యక్రమాలకు నన్ను ఆహ్వానిస్తుంటారు. నా విద్యార్థుల్లో చాలా మంది పేర్లు నాకు స్పష్టంగా గుర్తున్నాయి. వాటితో పాటు మేం వారిని పిలిచిన మారు పేర్లు కూడా గుర్తున్నాయి. నా విద్యార్థుల నుంచి నేను కూడా చాలా నేర్చుకున్నాను. బాలల నుంచి తక్షణమేస్పందించే గుణాన్ని, ఆసక్తిని ఉపాధ్యాయులు నేర్చుకుంటారని నేను విశ్వసిస్తాను. రాష్ట్రపతిగా రెండో సంవత్సరాన్ని నేను పూర్తి చేసుకున్నప్పుడు రాష్ట్రపతి భవన్ ఆవరణలోని పాఠశాల విద్యార్థులతో సమయం గడిపాను. అప్పుడు వారికి పర్యావరణ పరిరక్షణ గురించి వివరించాను. నేను ఎల్లప్పుడూ విద్యార్థులను కలవడానికి, వారి ఆలోచనలను, అభిప్రాయాలను అర్థం చేసుకోవడానికి ఆసక్తి చూపుతాను. వారు పంచుకునే విషయాలు నాకు గుర్తుండిపోతాయి. సుమారు పదకొండేళ్ల క్రితం, నేను మా ఊరిలోఒక గురుకుల పాఠశాలను స్థాపించాను. ఆ పాఠశాలలో పేద విద్యార్థులు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలలు చదువుకుంటారు. వారిని కలుసుకొనేందుకు అప్పుడప్పుడూ ఆ పాఠశాలను సందర్శిస్తుంటాను. ఈ ఏడాది జూన్ 20న నా పుట్టినరోజు సందర్భంగా ఆబాలలతో సమయం గడపడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ సైతం నాతో పాటు పాఠశాలను సందర్శించి వారిలో స్ఫూర్తి నింపారు. ప్రధానిని కలుసుకున్న అసాధారణ అనుభవం వారికి చిరకాలంస్ఫూర్తినిచ్చేదిగా నిలిచిపోయింది. విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులకుమాత్రమే పరిమితం కాదు. తమ ప్రవర్తన, విజయాల ద్వారా బాలలకు ఆదర్శంగా నిలిచేవారు కూడా నేర్చుకోవడానికి, స్ఫూర్తికి విలువైన వనరుగా ఉంటారు. తమ పిల్లలను చదువుకోవడానికి పంపించేటప్పుడు ఉపాధ్యాయులపై అత్యంత విశ్వాసాన్ని తల్లిదండ్రులు, సంరక్షులు ఉంచుతారు. విద్యార్థులను తమ సొంత పిల్లలా చూసుకుంటారని, వారి భద్రత, అభివృద్ధి విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకుంటారనివారు నమ్ముతారు. తమపై ఉంచిన ఈ పవిత్రమైన నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి ఉపాధ్యాయుని ధర్మం. ఉపాధ్యాయుని వైఖరి, ప్రవర్తన, నడవడిక బాలల్లో భయాందోళనలను కలిగించకూడదు, వారి మనోధైర్యాన్ని దెబ్బతీయకూడదు. లేదా వారిలో ఎలాంటి న్యూనతా భావం పెరిగేలా చేయకూడదు. విద్యార్థులను తమ లాంటి ఉత్తమ వ్యక్తులుగా తీర్చిదిద్దేలా ఉత్తమ ఉపాధ్యాయులు దోహదపడతారు. తమ విద్యార్థులను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దే పవిత్రమైన బాధ్యత ఉపాధ్యాయులదే. తమ ఆలోచనల్లో, చేతల్లో నైతికతను పాటిస్తూ, సంపదను, కీర్తిని సాధించే విద్యార్థులే ఉపాధ్యాయుని విజయానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తారు. సామాజిక సమ్మిళిత్వమే కేంద్రంగా ఎదగాలనే లక్ష్యం దిశగా భారత్ స్థిరంగా ప్రయాణిస్తోంది. పర్యావరణాన్ని, సకల జీవరాశులను పరిరక్షించే, వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సుకోసం కృషి చేసే, దేశమే ప్రథమం అనేస్ఫూర్తితో ముందుకు సాగే విద్యార్థులనుఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని నేనుకోరుకుంటున్నాను. భారత్ అగ్రగామిగా నిలవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. ●

**(రచయిత భారత రాష్ట్రపతి)**

# మరింత ఉగ్రరూపంతో ఎల్‌నినో

## - ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా - 2027 ఫిబ్రవరి వరకూ కొనసాగే అవకాశం - ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలు అధికంగా నమోదు : డబ్ల్యుఎంఒ సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సౌలో

**జెనీవా, సెప్టెంబర్ 4:** ఎల్ నినో వాతావరణ దృగ్విషయం 2027 వరకు మరింత తీవ్రతరం కానుందని, ఇది ఇప్పటివరకు నమోదైన వాటిలో అత్యంత బలమైనదిగా మారవచ్చని, తద్వారా వచ్చే ఏడాది తీవ్ర వాతావరణ పరిస్థితుల ప్రమాదాన్ని పెంచుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) తెలిపింది. అసాధారణంగా వేడెక్కిన పసిఫిక్ మహాసముద్ర ఉష్ణోగ్రతల కారణంగా, ఎల్ నినో 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం దాదాపు 100శాతం ఉందని తమ అంచనాలు చూపిస్తున్నాయని ఐక్యరాజ్య సమితి వాతావరణ సంస్థ తెలిపింది. ఇంతటి నిశ్చయతను వ్యక్తం చేయడం ఇదే మొదటిసారి అని డబ్ల్యుఎంఒ పేర్కొంది. "ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, ఇది అత్యంత బలమైనదిగా మారవచ్చు. అంటే, అక్షరాలా ఊహించని స్థాయిలో ఉంటుంది" అని డబ్ల్యుఎంఒ సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సౌలో జెనీవాలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎల్ నినో అంటే బల హీన పడుతున్న వాణిజ్య పవనాల వల్ల తూర్పు పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు కాలానుగుణంగా పెరగడం. ఇది ప్రతి రెండు నుండి ఏడు సంవత్సరాలకు ఒకసారి సంభవిస్తుంది. 12 నెలల వరకు కొనసాగుతూ, లాటిన్ అమెరికా అంతటా తీవ్రమైన వర్షాలకు, కరువులకు కారణమవుతుంది. చాలా బలమైన ఎల్ నినో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిని గణనీయంగా మార్చగలదు. కరువులు, తుఫానుల వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులను మరింత తీవ్రతరం చేస్తుంది. వేడెక్కుతున్న సముద్రం: ఇది సహజంగా సంభవించే దృగ్విషయమే అయినా శిలాజ ఇంధనాల వల్ల కలిగే వాతావరణ మార్పుతో దీనికి ప్రత్యక్ష సంబంధం లేనప్పటికీ, వేడెక్కుతున్న సముద్రపు ఉష్ణోగ్రతల వల్ల ఇది తీవ్రతరం కావచ్చు. "ఎల్ నినో మన కళ్ల ముందే భారీ స్థాయికి చేరుకుంటోంది. దీంతో సముద్ర జలాలు వేడెక్కుతున్నాయి" అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ అన్నారు. 1950 నుండి నమోదైన గణాంకాల ప్రకారం, గతంలో నమోదైన నాలుగు ఎల్ నినో ఘటనలలో కంటే, ప్రస్తుత ఎల్ నినో సమయంలో, పసిఫిక్ మహాసముద్ర ఉష్ణోగ్రతలు ఇప్పటికే సాధారణం కంటే 2 డిగ్రీల సెల్సియస్ (3.6 డిగ్రీల ఫారెన్‌హీట్) కంటే ఎక్కువగా ఉన్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) తెలిపింది. ఈ ఘటన ఇప్పటికే ఉష్ణ మండల ప్రాంతాల్లోని వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభావం చూపింది, దీనివల్ల మధ్య అమెరికాలోని




'డ్రై కారిడార్' ప్రాంతంలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడింది. ప్రపంచ ఉష్ణోగ్రతలలో పెరుగుదల: ఈ యేడాది చివరి నాటికి ఇది గరిష్ట స్థాయికి చేరుకుంటుందని డబ్ల్యుఎంఒ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే దీని ప్రభావాలు 2027 వరకు కొనసాగుతాయని, వచ్చే యేడాది ప్రపంచ ఉష్ణోగ్రతలు మరింత పెరిగేలా చేస్తాయని డబ్ల్యుఎంఒ అధికారులు పేర్కొన్నారు. "సాధారణంగా ఎల్ నినో ఘటన తర్వాత ప్రపంచ ఉష్ణోగ్రతలలో ఒక తాత్కాలిక పెరుగుదల కనిపిస్తుంది" అని డబ్ల్యుఎంఒ వాతావరణ అంచనా సేవల విభాగం అధిపతి విల్‌ఫ్రాన్ మోఫౌమా ఒకియా విలేకరులతో అన్నారు. ఇప్పటివరకు అత్యంత వేడిగా నమోదైన 2024 సంవత్సరాన్ని ప్రస్తావిస్తూ, "2027 రికార్డు స్థాయిలో అత్యంత వేడి సంవత్సరంగా మారే అవకాశం ఉంది" అని ఆయన పేర్కొన్నారు.

## పెనువిషాదాన్ని మిగిల్చిన నేపాల్ భారీ వరదలు!

# 17వేల మంది చిన్నారులపై విపత్తు ప్రభావం

**ఖాట్మండు, సెప్టెంబరు 4:** నేపాల్‌లో సంభవించిన ఘోర వరద విపత్తు పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ జల ప్రళయంలో వందలాది మంది చిన్నారులు సహా వేలాది మంది గల్లంతయ్యారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, రోడ్లు, వంతెనలు పూర్తిగా ధ్వంసం కావడంతో గల్లంతైన వారిని, ముఖ్యంగా పిల్లలను గుర్తించడం అధికారులకు కష్టసాధ్యంగా మారింది. వారి ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. గతనెల 26న నేపాల్‌చైనా (టిబెట్) సరిహద్దులోని హిమాలయాల్లో భారీ హిమానీనదం కూలిపోవడంతో త్రిశూలి నదికి వరదలు పోటెత్తాయి. ఈ ఆకస్మిక వరదల ధాటికి చైనానేపాల్ సరిహద్దులోని గైరాంగ్ చెక్‌పాయింట్ సహా పలు పట్టణాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 1,200 దాటింది. నేపాల్, టిబెట్ కలిపి గల్లంతైన వారి సంఖ్య 5,000 వరకూ ఉంటుందని అంచనా. గల్లంతైన వారిలో భారతీయులు, అమెరికన్లతో పాటు పలువురు విదేశీయులు కూడా ఉన్నారు. ఈ విపత్తులో చిన్నారులు తీవ్రంగా ప్రభావితమయ్యారు. యూనిసెఫ్ ప్రకారం, సుమారు 17,000 మంది పిల్లలకు తక్షణ మానవతా సహాయం అవసరం. వరదల కారణంగా 18 పాఠశాలలు పూర్తిగా నేలమట్టం కాగా, మరో 20 పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, సుమారు 230 నుంచి 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు గల్లంతయ్యారు. కుటుంబాల నుంచి విడిపోయిన పిల్లల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. యూనిసెఫ్ బృందాలు వారిని గుర్తించి, కుటుంబ సభ్యులతో కలిపేందుకు, మానసిక సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాయి. గల్లంతైన వారిని కనుగొనడంలో తెగిపోయిన నెట్‌వర్క్‌లు అతిపెద్ద సవాలుగా మారాయి.

టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలు పూర్తిగా స్తంభించాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో చాలా ప్రాంతాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. కేవలం హెలికాప్టర్ల ద్వారా మాత్రమే సహాయక బృందాలు అక్కడికి చేరుకోగలుగుతున్నాయి. దీంతో సహాయక చర్యలు, మృతదేహాల గుర్తింపు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. డీఎన్ఏ నమూనాలు సేకరించి మృతులను గుర్తించేందుకు నేపాల్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఐక్యరాజ్యసమితి, రెడ్‌క్రాస్ వంటి అంతర్జాతీయ సంస్థలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి.

# భారత్, బెల్జియంల మధ్య పది ఒప్పందాలు

## రక్షణ సంబంధాలు మరింత బలోపేతం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** భారత్‌లో పర్యటిస్తున్న బెల్జియం ప్రధాని బార్ట్ డివెవర్ తన పర్యటనలో భాగంగా ప్రధాని మోడీతో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. భారత్‌తో రక్షణ సంబంధాలను బెల్జియం మరింత బలోపేతం చేసుకుంంది. పాకిస్థాన్‌తో సైనిక పరికరాలు, రక్షణ సాంకేతికతకు సంబంధించిన సహకారం చేపట్టబోమని భారత్‌కు హామీ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. రక్షణ, భద్రతా వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ఢిల్లీలో ప్రధాని మోడీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ సమావేశమయ్యారు. మరోవైపు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బెల్జియం రక్షణ, విదేశీ వాణిజ్య మంత్రి థియో ఫ్రాంకెన్‌తో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. భారత్‌బెల్జియం సంయుక్త ప్రకటనలో గానీ రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో గానీ పాకిస్థాన్ ప్రస్తావన లేదు. బెల్జియం రక్షణ ఎగుమతులపై ఏదైనా నిర్దిష్ట దేశానికి సంబంధించిన ఆంక్షలను కూడా బహిరంగంగా ప్రకటించలేదు. ఈ హామీ ఎంతకాలం అమల్లో ఉంటుంది. ఎలా అమలు చేస్తారనే దానిపై కూడా అధికారిక వివరాలు వెల్లడికాలేదు. ఉగ్రవాదాన్ని, ముఖ్యంగా సరిహద్దు దాటి జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే భారత్ పోరాటానికి బెల్జియం మద్దతు ప్రకటించినట్లు సంయుక్త ప్రకటన తెలిపింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 2025 ఏప్రిల్‌లో జరిగిన ఉగ్రదాడిని బెల్జియం ఖండించింది. ఉగ్రవాదులు, వారికి నిధులు అందించే వ్యక్తులు, సంస్థలు, వారికి ఆశ్రయం కల్పించే వ్యవస్థలపై చర్యలు తీసుకోవాలని ఇరు దేశాలు పిలుపునిచ్చాయి. ఇందుకోసం ఐక్యరాజ్యసమితి, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ వంటి అంతర్జాతీయ వేదికల ద్వారా కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఉగ్రవాద నిరోధక అంశాలపై సంయుక్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలించాలని అంగీకరించాయి.

గతంలో బెల్జియం పాకిస్థాన్‌కు సైనిక విమానాలను సరఫరా చేసింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డేటా ప్రకారం 2021లో బెల్జియం ఏడు సి130బీ రవాణా విమానాలను పాకిస్థాన్‌కు విక్రయించింది. 2003లో పాకిస్థాన్ బెల్జియం నుంచి ఎఫ్16 యుద్ధ విమానాలను కూడా కొనుగోలు చేయాలని ప్రయత్నించింది. అయితే అమెరికాలో తయారైన ఈ విమానాలను బదిలీ చేయడానికి వాషింగ్టన్ అనుమతి అవసరం కావడంతో ఆ ప్రతిపాదిత ఒప్పందం ముందుకు సాగలేదు. 2021–25 మధ్యకాలంలో పాకిస్థాన్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ప్రధాన ఆయుధాల దిగుమతిదారుగా ఉంది. ఆ కాలంలో పాకిస్థాన్ దిగుమతి చేసుకున్న ఆయుధాల్లో 80 శాతం చైనా నుంచి వచ్చాయి. తుర్కియే 7 శాతం, నెదర్లాండ్స్ 4.6 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# సిఎం విజయ్ కాన్వాయ్‌లోకి చొరబడిన భార్యాభర్తలు!

**చెన్నై, సెప్టెంబరు 4:** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ కాన్వాయ్‌లో తీవ్ర భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. మార్చిలో శివగంగై జిల్లాలో పోలీసుల కస్టడీలో మృతి చెందిన 26 ఏళ్ల యువకుడి తల్లిదండ్రులు సీఎం కాన్వాయ్‌కు అడ్డుగా దూసుకెళ్లారు. తమ కుమారుడి మరణానికి న్యాయం చేయాలని కోరుతూ వారు బంధువులతో కలిసి నిరసన చేపట్టారు. చెన్నైలోని సచివాలయం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిరసన చేస్తున్న మృతుడి తల్లిదండ్రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ కాన్వాయ్ వస్తుండగా స్థానికులు ఫెన్సింగ్ వెనుక నిలబడి ఉన్నట్లు వీడియోలో కనిపించింది. ఇంతలో ఓ మహిళ, ఓ పురుషుడు ఒక్కసారిగా ఫెన్సింగ్ దాటి భద్రతా వలయాన్ని ఛేదిస్తూ కాన్వాయ్ వైపు పరుగెత్తారు. మహిళను పోలీసులు వెంటనే పట్టుకోగా పురుషుడు మాత్రం సీఎం కాన్వాయ్‌కు మరింత దగ్గరగా వెళ్లగలిగాడు. దీంతో అక్కడ ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. పరిస్థితిని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే కాన్వాయ్‌ను నిలిపివేశారు. శివగంగై జిల్లాకు చెందిన 26 ఏళ్ల దళిత యువకుడు పోలీసుల కస్టడీలో ఉండగా అస్వస్థతకు గురయ్యాడు. అనంతరం చికిత్స కోసం మదురైలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విచారణ సమయంలో పోలీసులు తన కుమారుడిని చిత్రహింసలకు గురిచేశారని అతడి కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు ఏఎన్ఐ గతంలో నివేదించింది. మృతుడిని ఆకాష్ డెనిసన్‌గా గుర్తించారు. చిన్నపాటి దాడి కేసులో అనుమానితుడిగా మనమదురై పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కుమారుడి మృతిపై అతడి తండ్రి కన్నన్ తీవ్ర ఆరోపణలు చేశారు. పోలీసుల విచారణ సమయంలో తన కుమారుడిపై తీవ్రంగా దాడి చేశారని, కులం పేరుతో దూషించారని ఆరోపించారు. తమ కుమారుడి మరణానికి న్యాయం చేయాలని కోరుతూ కన్నన్, ఆయన భార్య తమ బంధువులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి విజయ్ కాన్వాయ్ సమీపంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది.





## స్తంభాన్ని ఢీకొన్న ఇండిగో విమానం

**శ్రీనగర్, సెప్టెంబరు 4:** శ్రీనగర్ విమానాశ్రయంలో ఇండిగో విమానం పార్కింగ్ చేస్తుండగా వీఏడీజీఎస్ పోల్‌ను తాకింది. శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నారు. ఎవరికీ గాయాలు కాలేదని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ముంబై నుంచి శ్రీనగర్ వచ్చిన ఇండిగో విమానం 6ఈ 225 ఉదయం 9.02 గంటలకు బే నంబర్ 6లో పార్కింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది.

## అవినీతి కేసులో శ్రీలంక మాజీ అధ్యక్షుడి కుమారుడు నామల్ రాజపక్స అరెస్ట్

**కొలంబో, సెప్టెంబరు 4:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్స కుమారుడు, ఎంపీ నమల్ రాజపక్సను దేశ ప్రధాన అవినీతి నిరోధక సంస్థ శుక్రవారం అరెస్ట్ చేసింది. 2013లో జరిగిన ఎయిర్‌బస్ విమానాల కొనుగోలు వ్యవహారంలో అవినీతి ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బ్రైబరీ అండ్ కరప్షన్ ఆరోపణల దర్యాప్తు కమిషన్ ప్రకారం ఎయిర్‌బస్ విమానాల కొనుగోలు వ్యవహారంపై విచారణకు హాజరు కావాలని 40 ఏళ్ల నామల్ రాజపక్సకు సమన్లు జారీ చేశారు. విచారణ అనంతరం ఆయనను అరెస్ట్ చేసినట్లు కమిషన్ అధికారి తెలిపారు. అనంతరం ఆయనను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. అయితే నామల్ రాజపక్సపై ఏయే అభియోగాలు నమోదు చేశారన్నది వెంటనే స్పష్టంగా తెలియరాలేదు. ఆయన న్యాయవాది నిశాంత దయానంద అరెస్ట్‌ను ధ్రువీకరించారు.

వివాదాస్పదంగా మారిన 2.3 బిలియన్ డాలర్ల ఎయిర్‌బస్ ఒప్పందానికి సంబంధించి ఈ అరెస్ట్ జరిగినట్లు తెలిపారు. 2016లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాన్ని రద్దు చేసింది. ఈ కేసులో సిఐఎబిజిసి ఇప్పటికే మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్సను కూడా మే నెలలో ప్రశ్నించింది. విమానాల కొనుగోలు వ్యవహారంలో ఆయన లంచాలు స్వీకరించారన్న ఆరోపణలపై అధికారులు విచారించారు. ఎయిర్‌బస్ విమానాల కొనుగోలులో చెల్లించిన మొత్తంలో కొంత భాగాన్ని శ్రీలంకకు చెందిన ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులకు లంచాల రూపంలో అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై ప్రస్తుతం అవినీతి నిరోధక సంస్థ దర్యాప్తు కొనసాగిస్తోంది. రాజపక్స కుటుంబం తమపై వచ్చిన లంచం, అవినీతి ఆరోపణలను ఖండించింది. తమపై వచ్చిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవని పేర్కొంది.




## నవంబరు 10న భారత్‌లో సోనియా ఆత్మకథ విడుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** సోనియా గాంధీ రాసిన బిలాంగింగ్-ఏ జర్నీ ఆఫ్ లవ్ పుస్తకానికి భారత్‌లో కొత్త ప్రచురణకర్త ఖరారైంది. హార్పర్‌కాలిన్స్ ఇండియా ఈ పుస్తకాన్ని ప్రచురించనుంది. 2026 నవంబర్ 10న భారత్‌లో పుస్తకం విడుదల కానుంది. ఈ విషయాన్ని హార్పర్‌కాలిన్స్ ఇండియా శుక్రవారం ప్రకటించింది. అత్యంత ఆసక్తి రేపుతున్న రాజకీయ జ్ఞాపకాల పుస్తకాల్లో ఇదొకటని తెలిపింది. ప్రేమ, గుర్తింపు, బాధ్యత, అనుబంధం వంటి అంశాల చుట్టూ సోనియా గాంధీ వ్యక్తిగత జీవితాన్ని ఇందులో వివరించినట్లు పేర్కొంది. ఇటీవల సోనియా గాంధీ పుస్తకానికి పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ప్రచురణకర్త కాదని ప్రకటించింది. పుస్తకంలోని కొన్ని అంశాలపై రచయితతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందని సంస్థ తెలిపింది. అయితే సంపాదకీయ మార్పులకు సోనియా గాంధీ అంగీకరించకపోవడంతోనే పుస్తక ప్రచురణ నుంచి తప్పుకున్నారన్న వార్తలను పెంగ్విన్ ఖండించింది. బాహ్య ఒత్తిడి కారణం కాదని స్పష్టం చేసింది. బిలాంగింగ్ పుస్తకాన్ని అమెరికాకు చెందిన ఆల్ఫ్రెడ్ ఏ.నాఫ్ నవంబర్ 10న విడుదల చేయనున్నట్లు గతంలో ప్రకటించింది. భారత్‌లో మాత్రం ప్రచురణ బాధ్యతలు ఇప్పుడు హార్పర్‌కాలిన్స్ ఇండియాకు దక్కాయి. ఈ పుస్తకంలో సోనియా గాంధీ తన ఆరు దశాబ్దాల అనుభవాలను ప్రస్తావించారు. 1984లో అత్త ఇందిరా గాంధీ హత్యతో తన జీవితం ఎలా మారిందో వివరించారు. 1991లో భర్త రాజీవ్ గాంధీ హత్య తర్వాత ఎదురైన పరిస్థితులనూ పంచుకున్నారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన తీరాన్ని పుస్తకంలో ప్రస్తావించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుదీర్ఘకాలం కొనసాగిన సోనియా గాంధీ ప్రధానమంత్రి పదవిని చేపట్టే అవకాశం వచ్చినా తిరస్కరించారు.

2014లో కాంగ్రెస్ అధికారం కోల్పోయి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి అధికారంలోకి వచ్చిన పరిణామాలనూ ఆమె తన పుస్తకంలో ప్రస్తావించారు.

## కొలెస్ట్రాల్ తగ్గించేందుకు జన్యుచికిత్స పరీక్షలు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) ఎక్కువైతే గుండె జబ్బులు, గుండెపోటు, స్ట్రోక్ ముప్పు పెరుగుతుంది. సాధారణంగా ఆహారంలో మార్పులు, మందులతో దీన్ని నియంత్రిస్తారు. ఇప్పుడు ఒక్కసారి మాత్రమే ఇచ్చే జన్యు చికిత్సతో ఎల్‌డీఎల్‌ను సగానికి పైగా తగ్గించే అవకాశం ఉందని తొలి మానవ పరీక్ష వెల్లడించింది. శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్న ఈ చికిత్సకు సీటీఎక్స్310 అని పేరు పెట్టారు. క్రిస్పర్ జన్యు సవరణ సాంకేతికతతో కాలేయ కణాల్లోని ఏఎన్‌జీపీటీఎల్3 ప్రొటీన్ ఉత్పత్తిని తగ్గించడం దీని లక్ష్యం. ఈ ప్రొటీన్ తక్కువగా ఉంటే రక్తంలోని కొవ్వులను శరీరం మెరుగ్గా నియంత్రించగలదు. తొలి దశ పరీక్షలో తీవ్రమైన కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ సమస్యలున్న 15 మందికి సీటీఎక్స్310ను నరాల ద్వారా అందించారు. చికిత్స కోసం క్రిస్పర్ సూచనలను మోసుకెళ్లే నానోకణాలను ఉపయోగించారు. వారిలో ఒకరు చికిత్స తర్వాత 179 రోజులకు మరణించారు. ఆ మరణానికి సీటీఎక్స్310 కారణం కాదని పరిశోధకులు నిర్ధారించారు. మిగిలిన 14 మందిలో ఏడాది తర్వాత కూడా కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలు తగ్గినట్లే ఉన్నాయి. తీవ్రమైన కొత్త దుష్ప్రభావాలు కనిపించలేదు. అత్యధిక మోతాదు పొందిన నలుగురిలో ఏఎన్‌జీపీటీఎల్3 స్థాయిలు సగటున 78.6 శాతం తగ్గాయి. వారి ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ 52.5 శాతం, ట్రైగ్లిజరైడ్లు 47.8 శాతం తగ్గాయి. అయితే ఇది చాలా చిన్న స్థాయిలో జరిగిన తొలి మానవ పరీక్ష మాత్రమే. ఎక్కువ మందిపై, ఎక్కువ కాలం పరిశోధనలు జరగాల్సి ఉంది. జన్యు సవరణలో కొన్ని ప్రమాదాలు ఉండే అవకాశం కూడా ఉంది.

# భారత్ కంపెనీతో రూ. 769 కోట్ల ఆయుధ డీల్..

## ఎస్తోనియా రక్షణ మంత్రి రాజీనామా



**టల్లిన్, సెప్టెంబరు 4:** ఆయుధాల ఒప్పందం విషయంలో బయటపడిన అవకతవకలు ఎస్తోనియా రక్షణ మంత్రి పదవికి ఎసరు తెచ్చాయి. రూ. 768.50 కోట్లతో ఫిరంగి మందుగుండు సామగ్రి కొనుగోలుకు సంబంధించిన తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో హన్నో పెవ్కుర్ రాజీనామా చేశారు. ఈ డీల్‌కు సంబంధించి ఆడిట్‌లో తేలిన అక్రమాల ఆధారంగా నేర విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో హన్నో నైతిక బాధ్యత వహిస్తూ రక్షణమంత్రి పదవి నుంచి వైదొలిగారు. ఈ వివాదంలో భారత్‌కు చెందిన ఓ కంపెనీ కేంద్ర బిందువుగా మారడం గమనార్హం. రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో మందుగుండు సామగ్రి కొరత ఏర్పడింది. కీవ్ కోసం వాటిని సమీకరించేందుకు మరో ఐరోపా దేశం ఎస్తోనియా.. ఇటలీకి చెందిన డేటాసెల్ ఎస్ఆర్ఎల్ కంపెనీతో 2024లో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డేటాసెల్ కంపెనీని అదే యేడాది ఆరంభంలో భారత్‌కు చెందిన నెకో డిఫెన్స్ కొనుగోలు చేసింది. ఈ మొత్తం ఒప్పందం విలువ 70 మిలియన్ల యూరోలు. ఐరోపా యూనియన్‌కు చెందిన యూరోపియన్ పీస్ ఫెసిలిటీ నుంచి వచ్చిన డబ్బును ఎస్తోనియా ఈ కంపెనీకి దశల వారీగా ముందుగానే చెల్లించింది. కొన్ని నెలల్లోనే ఈ ఆర్టిలెరీ షెల్స్ ఉక్రెయిన్‌కు చేరుకుంటాయని అంతా భావించారు. కానీ, ఆయుధ సరఫరాలు పదేపదే ఆలస్యమయ్యాయి. 2025లో కొన్ని షెల్స్ డెలివరీ అందినా.. అవి పూర్తిగా లోపాలతో ఉన్నాయని ఎస్తోనియా ఆరోపించింది. దీంతో వాటిని ఉక్రెయిన్‌కు పంపించలేదని తెలిపింది. తాను చెల్లించిన డబ్బు తిరిగి పొందేందుకు ఎస్తోనియా ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే, ఈ ఆరోపణలను డెటాసెల్ తిప్పికొట్టింది. తాము చాలావరకు డెలివరీలు అందించామని, ఒప్పందం గడువు ముగియడానికి ముందే 59 మిలియన్ యూరోల విలువైన మందుగుండు సామగ్రిని సరఫరా చేశామని వెల్లడించింది. అలాగే నాణ్యతా సమస్యల కారణంగానే ఒప్పందం రద్దు చేసుకున్నారన్న వాదనలను ఖండించింది. ఈ వ్యవహారం నేపథ్యంలో ఎస్తోనియాపై డేటాసెల్ కంపెనీ దావా వేసింది. ఈ నేపథ్యంలోనే ఎస్తోనియా రక్షణ నిధుల నిర్వహణ, సైనిక కొనుగోళ్లకు సంబంధించిన ఆడిట్ చేపట్టగా అవకతవకలు బయటపడ్డాయి. దీనిపై విమర్శలు రావడంతో రక్షణ మంత్రి రాజీనామా చేశారు. ఈ డీల్‌కు చెల్లించిన డబ్బులు ఐరోపా యానియన్‌కు తిరిగిరాకపోతే.. ఎస్తోనియా తన సొంత బడ్జెట్ నుంచి ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఎస్తోనియా దేశం ఐరోపా యూనియన్, నాటో కూటమిలో భాగం. దీనికి రష్యాతో సరిహద్దు ఉంది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆ దేశంలో కూడా భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తాయి. అలాగే ఉక్రెయిన్‌కు ఎస్తోనియా కీలక మద్దతుదారుగా ఉంది.

# రామభక్తుల దీవెనలే నాకు ముఖ్యం

## అయోధ్య రామమందిరం కొత్త సిఇఒ జితేంద్ర



**అయోధ్య, సెప్టెంబరు 4:** అయోధ్య రామాలయం సీఈవోగా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియమితులైన విషయం తెలిసిందే. అయితే రామభక్తుల మద్దతు, దీవెనలు తమకు ముఖ్యమని ఆయన అన్నారు. రామ ట్రస్టు వ్యూహాలు త్వరలో ఆచరణలోకి రానున్నట్లు ఆయన చెప్పారు. ట్రస్టు సభ్యులతో మీటింగ్ నిర్వహించిన తర్వాత ఇవాళ జితేంద్ర మిశ్రా మీడియాతో మాట్లాడారు. భక్తుల విశ్వాసం, దీవెనలు తమ పట్ల ఉండాలని ఆశిస్తున్నట్లు మిశ్రా తెలిపారు. రామభక్తుల ఆశీస్సులు తమకు ముఖ్యమన్నారు. మీ దీనవలు, నమ్మకంతోనే మేం ముందుకు వెళ్తామని, నాకు కొంత సమయం ఇవ్వండి అంటూ మిశ్రా అన్నారు. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు మిశ్రాను తొలి సీఈవోగా నియమించిన విషయం తెలిసిందే. అయితే అయోధ్య రామాలయ వ్యవహార శైలిని సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. కొన్ని రోజుల్లో తమ వ్యూహాలు అమలులోకి రానున్నట్లు ఆయన చెప్పారు. వివిధ బృందాల సహకారంతో ఆయోధ్య ఆలయంలో చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కీలకమైన నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తామన్నారు.

# సంక్షిప్త వార్తలు

### ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి ప్రధాని మోడీ శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 4:** ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆ దేశ రాజకీయ చరిత్రలో ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. యుద్ధానంతర ఇటలీ చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెలోనీని నా స్నేహితురాలు అని సంబోధిస్తూ, ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ మైలురాయే నిదర్శనమని ప్రశంసించారు.

### కరాచీకి వెళ్తున్న రష్యానౌకపై డ్రోన్ దాడి




**మాస్కో, సెప్టెంబరు 4:** రష్యా నుంచి 23 మంది భారతీయులతో బయల్దేరిన ఓ నౌకపై డ్రోన్ దాడి జరిగింది. నోవోరోస్సిస్క్ నుంచి పాకిస్థాన్ నగరం కరాచీకి ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. నౌకలో సిబ్బందికి వసతి కల్పించే ప్రాంతాన్ని డ్రోన్ ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే మంటలను ఆర్పివేశారు. బుధవారం జరిగిన ఈ ప్రమాదం గురించి ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌యుఎస్‌యుఐ) ఎక్స్ వేదికగా వెల్లడించింది. నౌక సమీపంలో మరో డ్రోన్‌ను గుర్తించినట్లు తెలిపింది. ఈ ఘటన సమయంలో నౌకలో 23 మంది భారత నావికులు ఉన్నారని ఎఫ్‌యుఎస్‌యుఐ వెల్లడించింది.

### బెంగాల్ ప్రభుత్వ సలహాదారుగా మిథున్ చక్రవర్తి

**కోల్‌కత్తా, సెప్టెంబరు 4:** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సాంస్కృతిక సలహాదారు (కల్చరల్ అడ్వైజర్)గా బాలీవుడ్ ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి నియమితుడయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సువేందు అధికారి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.

కోల్‌కతా శివారులోని న్యూ టౌన్‌లో ఉత్తమ్ కుమార్ ఫిలిం సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.

### ముగ్గురు పిల్లలతో మహిళా వెయిట్ లిఫ్టర్ ఆత్మహత్య



**ముంబయి, సెప్టెంబరు 4:** మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో తీవ్ర విషాదకర సంఘటన చోటు చేసుకుంది. జాతీయ స్థాయి మహిళా రెజ్లర్ అశ్విని మనోహర్ పాల్ తన ముగ్గురు పిల్లలతో సహా చారిత్రాత్మక నల్‌దుర్గ్ కోటపై నుండి దాదాపు 100 అడుగుల లోతైన లోయలోకి దూకేశారు. ఈ ఘటనలో అశ్విని మరియు ఆమె ఐదేళ్ల కుమారుడు అజింక్యా అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె రెండున్నరేళ్ల కవల కుమార్తెలలో క్రాంతి అనే చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసింది. ఈ ఘోర ప్రమాదం నుంచి మరో కుమార్తె వీరా తీవ్ర గాయాలతో బయటపడింది.

### ముడిచమురు చోరీకి యత్నం.. 37 మంది మృతి

**అబుజా, సెప్టెంబరు 4:** నైజీరియాలో పెను విషాదం చోటుచేసుకుంది. పైప్‌లైన్ నుంచి ముడిచమురును దొంగిలించేందుకు ప్రయత్నించిన 37 మంది విష వాయువులు పీల్చి మృతి చెందినట్లు సమాచారం. ఈ మృతుల సంఖ్యను అధికారులు ఇంకా ధ్రువీకరించ లేదు. రివర్స్ రాష్ట్రంలోని ఒక్రికా ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు స్థానిక పర్యావరణ సంస్థ తెలిపింది. అయితే ఎంతమంది చనిపోయారనే విషయాన్ని వెల్లడించలేదు. ఘటనపై దర్యాప్తు కొన సాగుతోందని రివర్స్ రాష్ట్ర పోలీసు ప్రతినిధి బ్లెస్సింగ్ కబోర్లో అగాబే తెలిపారు.

### చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు మూడుసార్లు గుండెపోటు

**బీజింగ్, సెప్టెంబరు 4:** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆరోగ్యంపై కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఆగస్టు నెలాఖరులో ఆయన కిర్గిజ్‌స్థాన్‌కు వెళ్లిన సమయంలో, విమానం నుంచి దిగుతూ భార్య పెంగ్ లియువాన్ చేతిని పట్టుకుని నెమ్మదిగా మెట్లు దిగుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొందరు ఆయన ముఖం ఉబ్బినట్లు కనిపించిందని, నడకలోనూ ఇబ్బంది ఉన్నట్లు భావించారు. ఆయన ఆరోగ్యంపై టిబెట్, తైవాన్, ప్రవాస చైనీస్ వర్గాల్లో చర్చ మొదలైంది.

## భక్తజన సంద్రంగా కాణిపాకం ఆలయం



భక్తులతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయ క్యూలైన్లు

**కాణిపాకం, సెప్టెంబరు 4 , ప్రభాతవార్త:** వరుస సెలవులతో సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ దర్శనార్థం ఆశేషంగా తరలివచ్చిన భక్తులతో శుక్రవారం కాణిపాకం ఆలయం భక్త జనసంద్రంగా మారింది.సాధారణంగా వారంతపు రోజులు శని, ఆదివారాల్లో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శుక్ర, శని, ఆదివారాలు,వరుస సెలవు రోజులు, వారంతపు రోజులు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల మాడా వీధుల్లో బారులు తీరి నిలబడ్డారు. అలాగే ఆలయ మాడా వీధులు, పరిసరాలన్ని కిక్కిరిసిపోయాయి. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టికెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

## శివయ్య సేవలో సినీనటి నమిత




స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందిస్తున్న దృశ్యం

**శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం సినీనటి నమిత కుటుంబసభ్యులతో కలసి పూజలు జరిపించుకున్నారు. ఆమె ఆలయానికి రాగా ప్రోటోకాల్ ఏఈఓ లోకేష్‌బాబు సారధ్యంలో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆమె ఆలయంలో నిర్వహించే ప్రత్యేక రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా సహస్రలింగేశ్వరాలయం వద్ద ప్రత్యేక వివిఐపి పూజా టిక్కెట్టుతో పూజలు జరిపారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. పూజలు, దర్శనం తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఏఈఓ లోకేష్‌బాబు స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లును పీఆర్‌ఓ కార్యాలయానికి చెందిన రవి, రాజశేఖర్‌లు పర్యవేక్షించారు.

## తిరుమల సమాచారం

## తిరుమలేశునికి నాదమే నీరాజనం



**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని వేకువజామున మేల్కొలిపే నాదం... సేద తీర్చే స్వరాలు...సుప్రభాతం నుండి ఏకాంతసేవ వరకు శ్రీవారి సేవలో మేళవాయిద్యాల విశిష్ట సంప్రదాయం సంతరించుకుంది.అడవి జంతువుల ధ్వనుల నుండి ఆలయ మేళవాయిద్యాల వరకు ఆ దేవదేవుని సేవలో తరతరాలుగా కొనసాగుతున్న మేళవాయిద్య సంప్రదాయం. శ్రీనివాసునికి అత్యంత ప్రీతిపాత్రమైనవి వేదం, నాదం, వాద్య నివేదనలు. వీటిలో నాదానికి విశేష ప్రాధాన్యం ఉంది. భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించే సంగీతాన్ని, కీర్తనలను స్వామివారు ఆలకిస్తారన్నది పండితుల విశ్వాసం. అందుకే తిరుమలలో నాదం కేవలం సంగీతం కాదు, అది స్వామివారికి సమర్పించే ఒక విశిష్టమైన కైంకర్యం. తాళ్లపాక అన్నమయ్య, పురందరదాసు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వంటి వాగ్గేయకారులు తమ సంకీర్తనలతో, ఆళ్వారులు తమ పాశురాలతో శ్రీవారిని ప్రసన్నం చేసుకున్నారు. తరువాత కాలంలో దేశం గర్వించదగ్గ సంగీత విద్వాంసులు ఎం.ఎస్. సుబ్బలక్ష్మి ్మ, మంగళంపల్లి బాలమురళీకృష్ణ వంటి మహనీయులు కూడా స్వామివారికి నాదనీరాజనం సమర్పించారు. శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణం. శ్రవణం అంటే వినడం అని అర్థం. భక్తులు సమర్పించే భక్తిగీతాలను, వేదఘోషను, వాద్య నాదాలను స్వామివారు ఆలకిస్తారనే భావనకు ఇది మరింత ప్రత్యేకతను ఇస్తుంది. పురాణాల ప్రకారం పూర్వకాలంలో శేషాచలం అడవుల్లోని వృషభం, ఏనుగు వంటి జంతువులు తమ అరుపులతో స్వామివారిని కొలిచేవని చెబుతారు. ఆ సంప్రదాయానికి ప్రతీకగా, అలాంటి శబ్దాలను ఉత్పత్తి చేసే వాద్యపరికరాలు తరువాత కాలంలో శ్రీవారి ఆలయంలో వినియోగంలోకి వచ్చాయి. వీటిలో వృషభానికి సంబంధించిన గౌరుగోలు, ఏనుగు ధ్వనిని పోలిన త్రిచిన్నం/త్రిశూల్‌నాల్ వంటి వాద్యపరికరాలు ఉన్నాయి. ఇలా ప్రకృతిలోని సహజ ధ్వనుల నుంచి ఆలయ కైంకర్యాల్లో భాగమైన మేళవాయిద్యాల వరకు ఒక విశిష్టమైన నాద సంప్రదాయం తిరుమలలో కొనసాగుతూ వస్తోంది... సుప్రభాతం నుంచి ఏకాంతసేవ వరకు నాదమే కైంకర్యం.. శ్రీవారి రోజువారీ పూజా కైంకర్యాల్లో నాదానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. తెల్లవారుజామున సుప్రభాతం ద్వారా స్వామివారిని మేల్కొలుపుతారు. స్వామివారు మేల్కొనే వేళ నుంచి వివిధ సేవలు, నైవేద్యాలు, ఊరేగింపులు, ఉత్సవాలు, చివరికి ఏకాంతసేవలో సేదతీరే వరకు నాదస్వరం, డోలు తదితర వాద్యాల నాదం శ్రీవారి ఆలయ నిత్యకైంకర్యాల్లో భాగంగా ఉంటుంది. శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామున సుప్రభాతం నుండి రాత్రి ఏకాంతసేవ వరకు మొత్తం 19 రకాల సంప్రదాయ వాద్యపరికరాలను వినియోగిస్తారు. వీటిలో డోలు, ముక్కువీణ, తిరిచినాళ్లు, గౌరుగోలు, సన్నడోలు, శృతి తదితర వాద్యాలు ఉన్నాయి.

## "గురుస్వామి" అంటూ పలకరిస్తున్నారు "ఇరుముడి"బ్లాక్‌బస్టర్ కావడం సంతోషం

**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** "ఇరుముడి"చిత్రం బ్లాక్ బస్టర్ కావడం చాలా సంతోషంగా ఉందని సినీనటుడు సాయికుమార్ అన్నారు. ఈ చిత్రం తరువాత అందరూ తనను గురుస్వామి అంటూ పలకరిస్తున్నారని ఆప్యాయంగా తెలిపారు. మనవడి పుట్టువెంట్రుకలు తీయించేందుకు కుటుంబంతో కలసి శుక్రవారం ఉదయం తిరుమలకు వచ్చిన నటుడు సాయికుమార్ శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇంకా నటుడు ఆది మాట్లాడుతూ తొలిసారిగా 'ఈగోరాజా"తమిళ చిత్రంలో నటిస్తున్నట్లు తెలిపారు.

# ఆడపడుచులకు డిప్యూటీ సిఎం పవన్ 'శ్రావణ కానుక'

- పురుహూతికా అమ్మవారి సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- 10 వేల మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమ పంపిణీ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** శ్రావణ మాస శుక్రవారాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీ కుక్కుటేశ్వర స్వామి, శ్రీ పురుహూతికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 10 వేల మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమలను శ్రావణ మాస కానుకగా పంపిణీ చేశారు. వ్రతంలో పాల్గొనేందుకు తెల్లవారుజామున నుంచే మహిళలు ఆలయానికి చేరుకోవడంతో పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఆలయ ప్రాంగణాలు మహిళలతో కిక్కిరిసిపోయాయి. ప్రభుత్వం తరఫున పిఠాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి శివరామ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎస్. టి.వి రాజేశ్వర రావు, పిఠాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాస్, ఏర్పాట్లను పర్యవేక్షించారు **పట్టువస్త్రాలు సమర్పణతో ప్రారంభం:** వరలక్ష్మీ వ్రత మహోత్సవాన్ని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ వ్రతాలలో పాల్గొన్న భక్తులు పులకరించగా చూపరులను వేదపండితుల సైతం భక్తిశ్రద్ధలతో పరవశించారు. మంత్రోచ్చరణల మధ్య వరలక్ష్మీదేవిని ప్రతిష్ఠించి వ్రత పూజలను నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో కూర్చుని పూజల్లో పాల్గొన్నారు. వరలక్ష్మీదేవికి పసుపు, కుంకుమ, పుష్పాలతో పూజలు చేసి సుఖ సంతోషాలు కలగాలని ప్రార్థించారు. **పవన్ ఆత్మీయతకు నిదర్శనంగా:** పిఠాపురం ఆడపడుచులతో తనకున్న అనుబంధాన్ని పవన్ కల్యాణ్ మరోసారి రుజువు చేసుకున్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని సుమారు 10 వేల మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమలను అందించడం ద్వారా వారిపై తనకున్న ఆప్యాయతను చాటుకున్నారు. కార్యక్రమానికి హాజరైన మహిళలకు క్రమపద్ధతిలో కానుకలను పంపిణీ చేయడంతో ఆనందం వ్యక్తం చేశారు. సంప్రదాయ బద్ధంగా పూజలు శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతానికి విశిష్టత ఉండటంతో మహిళలు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల తో కార్యక్రమం కొనసాగింది. పూజా కార్యక్రమం పూర్తయిన అనంతరం మహిళలకు ప్రసాదాలను అందించారు. ఆలయంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్ కార్యక్రమ ఏర్పాట్లను వారు పర్యవేక్షించారు.ఆలయ సిబ్బంది, జనసేన వాలంటీర్లు భక్తులకు అవసరమైన సేవలు అందించారు.

# అపర భగీరథుడు చంద్రబాబు

**శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** ఆంధ్రా పాలిట అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఎంపి సిఎం రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నాడు రాష్ట్రాన్ని అడ్డగోలుగా కాంగ్రెస్ విభజించి వెతలు మిగిల్చితే నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి ఏర్పాటు చేసి పూర్తి చేస్తున్నారని, దాంతో రాబోవు తరాలకు వరంగా మిగులుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధితోపాటు వ్యవసాయాన్ని బలోపేతం చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలోని వ్యవసాయాన్ని పటిష్టం చేయుటకు ప్రధాన నదులను అనుసంధానం చేయటం ఎంతో అవసరమని ఈ సత్యాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. వైకాపా హయాంలో ప్రాజెక్టుల పేరుతో కాలయాపన చేయగా నేడు కూటమి ప్రభుత్వం 'మాటల ప్రభుత్వం కాదు. చేతల ప్రభుత్వమని నిరూపించిందని' వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం అభివృద్ధికి కేంద్ర అమలు చేస్తున్న 'ప్రసాద్ పథకం' ద్వారా ప్రత్యేక నిధులు సాధించి అభివృద్ధి పరుస్తామని సిఎం రమేష్ వివరించారు. ఈ సమావేశంలో స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, బిజెపి జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రమేష్

# శ్రీవారి సన్నిధిలో గోమాతకు విశిష్ట స్థానం

### గోశాలలో గోకులాష్టమి గోపూజ

**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** హిందు సంప్రదాయం ప్రకారం టిటిడి గోమాతలకు విశిష్ట స్థానం కల్పించింది. గోసంరక్షణకు టిటిడి అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. గోకులాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంకటేశ్వర గోసంరక్షణ శాలలో శుక్రవారం ఉదయం గోపూజ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిటిడి ఇఓ ముద్దాడ రవిచంద్ర గోశాలలోని వేణుగోపాలస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ గోమాత, దూడలకు నూతన వస్త్రాలు,పుష్పమాలలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గోమాతలకు ప్రదక్షిణలు చేసి హారతి సమర్పించారు. స్వయంగా ఇఓ రవిచంద్ర గోమాత పాలను స్వయంగా పితికి, పవిత్రమైన ఆ పాలను ఆలయ అర్చకులకు అందించారు. **7 కోట్ల సార్లు ఓం నమో వేంకటేశాయ":** ఈ సందర్భంగా అక్కడే "ఓం నమో వేంకటేశాయ" మహామంత్రాన్ని 7 కోట్ల సార్లు జపించిన జప పుస్తకాలను స్వామివారికి సమర్పించే కార్యక్రమాన్ని ఇఓ సందర్శించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపను కోరారు. గోమాత పూజ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మంలో అత్యంత పవిత్రమైన సంప్రదాయమని, గోమాతలో సమస్త దేవతా స్వరూపాలను దర్శించే గొప్ప ఆధ్యాత్మిక విశ్వాసం మన సంప్రదాయంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, టిటిడి బోర్డు సభ్యుడు జి. భాను ప్రకాష్ రెడ్డి, జెఇఓ ప్రభల గోపీనాథ్, గోశాల డైరెక్టర్ శివకుమార్, విఎస్ఓ గిరిధర్, ఇన్‌ఛార్జి డిఎల్ఓ జస్టిస్ వెంకట సుబ్బానాయుడు, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి ఇతర అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



# ఒక్క అధికారికి మూడు బాధ్యతలు

### పనిభారంతో ఇబ్బందులు

**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడిలో పదవీవిరమణతో ఖాళీలవుతున్న ఉద్యోగాలు భర్తీకాకపోగా ఉన్న అధికారులు, ఉద్యోగులపైనే అదనపు భారం పడుతోంది. ఇప్పటికే కొన్ని కీలకమైన విభాగాల్లో అధికారులు, ఉద్యోగుల పోస్టులు ఖాళీ అయ్యాయి. ఇదే సమయంలో టిటిడిలో విద్యుత్‌విభాగం కూడా కీలకమే. తిరుమలలో విద్యుత్‌విభాగంలో ఈస్ట్, సౌత్ ఏరియాలు విద్యుత్ సరఫరా, లైట్ల వెలుగులు మీద నిత్యం పర్యవేక్షణ విధులు ఒక అధికారియే చేయాల్సి వస్తుండటం తలకుమించిన భారంగా మారింది. ఒక అధికారి మూడు బాధ్యతలు నిర్వహిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తిరుమలలో విద్యుత్ విభాగం అవసరం ప్రాధాన్యత సంతరించుకుంది. ఒక డిప్యూటీ ఇఇ అధికారి రెండు ప్రదేశాల్లో విద్యుత్ సరఫరా, మరమ్మతులు బాధ్యతలు చూడాల్సి వస్తోంది. ఇప్పుడు రానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమయంలో ఏర్పాటుచేసే విద్యుత్‌దీపకాంతులు, రకరకాల విద్యుత్ కటౌట్లు కాంతులు సెట్టింగ్ ఏర్పాటులో తలమునకలై పనులు సాగించడంలో దృష్టి సారించాల్సి వస్తోంది. ఈ కీలక బాధ్యతలతో బాటు తిరుమలలో మరో ముఖ్యమైన బ్రాడ్ కాస్టింగ్ విభాగంకు కూడా డిప్యూటీ ఇఇకే బాధ్యత అప్పగించారు. దీంతో ఆ అధికారి పరిస్థితి,బాధ్యతలు ఏంటో టిటిడి వర్గాల్లో పెద్ద చర్చ మొదలైంది.తిరుమలలో భక్తుల అవసరాలకు సంబంధించి ప్రసారం చేయడానికి పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం చక్కగా నిర్వహిస్తున్నారు. రోజువారీ తిరుమలలో జరిగే ఆధ్యాత్మిక, ధార్మిక భక్తి కార్యక్రమాలు ప్రసారం కేంద్రం ద్వారా ప్రసారం అవుతుంది. మైక్ సెట్లు, ఎల్ఇడి స్క్రీన్ లోపాలు ,మరమత్తులు చేయడానికి నిరంతరం ఏర్పాటు చేసిన ప్రాంతాలు శ్రీవారి మెట్టు, అలిపిరి, తిరుమల టౌన్ షిప్ గాకుండా పాపవినాశనం వరకు పర్యవేక్షణ చేయాల్సి వస్తోంది. తీరా ఆ అధికారికి సిబ్బంది అక్కడి విభాగం డ్యూటీ రాకపోకలకు వాహనం లేకపోవడం గమనార్హం, రానున్న బ్రహ్మోత్సవాలు కోసం తక్షణం రెండు ఆడియో, రెండు టీవీ నాలుగు విధులు నిర్వహించే ఎఇని బ్రాడ్ కాస్టింగ్ ఇన్ ఛార్జ్ గా నియమిస్తే సులభంగా ఉంటుందని టిటిడి వర్గాల వాదన.




# గోకులాష్టమిన కాళీయమర్ధనుడికి అభిషేకాలు

**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** గోకులాష్టమి పర్వదినాన్ని శుక్రవారం ఉద యం తిరుమలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. గోగర్భం డ్యామ్ చెంతన కాళీయమర్ధనుడు అయిన శ్రీకృ ష్ణునికి ఉదయం పంచాభిషేకాలు చేశారు. అనంతరం అక్కడ ఉట్లోత్సం నిర్వ హించారు. ఆ తరువాత ప్రసాద వితరణ జరిగింది. ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలిలో రాత్రి 8 నుండి 9గంటల నడుమ ఉగ్ర శ్రీనివాసమూర్తి, శ్రీదేవి, భూదేవి , శ్రీకృష్ణస్వామికి ఏకాంతంగా తిరుమంజనం, ద్వాదశ ఆరాధన నిర్వహించారు. అనంతరం ప్రబంధ శాత్తుమొర, గోకులాష్టమి ఆస్థానం వేడుకగా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని వైదికులు నివేదించారు.ఈ వేడుకల్లో టిటిడి ఇఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఓ భాస్కర్, ఆలయ పేష్కార్ రామకృష్ణ,అర్చకులు పాల్గొన్నారు. **నేడు ఉట్లోత్సవం:** కృష్ణజన్మాష్టమి సందర్భంగా నేటి సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల మధ్య తిరుమలలో అత్యంత వైభవంగా ఉట్లోత్సవం జగరనుంది. మలయప్పస్వామివారు బంగారు తిరుచ్చిపై, కృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ ఈ ఉట్లోత్సవాన్ని తిలకిస్తారు. ఈ కారణంగా ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి.



## కోటి కుటుంబాల చెంతకు ఇంటింటికి టిడిపి

**విజయవాడ, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో తెలుగుదేశం పార్టీ గొప్ప మైలురాయి సాధించిందని టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు టిడిపి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. "ఇంటింటికీ తెలుగుదేశం 2026" కార్యక్రమం విజయవంతంగా కోటికి పైగా ఇళ్లకు తీసుకెళ్లిన కార్యకర్తలు, నేతలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఇంటింటి పర్యటనల్లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలను కలిసి వివరించిన తీరు చాలా బాగుంది. కోటి ఇళ్లు సందర్శించడమే కాకుండా ఆయా కుటుంబాల సమస్యలు, స్థానిక అవసరాలు, ప్రభుత్వ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన తెలుగుదేశం కుటుంబానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

## బస్సు బుగ్గి..ప్రయాణికులు సురక్షితం

**అనంతపురం, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరు సమీపంలోని 44 జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ప్రైవేట్ బస్సు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయింది. అయితే అదృష్టవశాత్తు డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న 33 మంది ప్రయాణీకులు ఎలాంటి ప్రాణాపాయం లేకుండా క్షేమంగా బయటపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరు నుండి హైదరాబాద్‌కు వెళుతున్న ఇంటర్సిటీ సర్వీసెస్‌కు చెందిన టిజి13టి1985 బస్సు మిడుతూరు గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ఓ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ సిద్దయ్యస్వామి వెంటనే బస్సును నిలిపివేశాడు. భయాందోళనలో ఉన్న ప్రయాణికులు వెంటనే బస్సును దిగారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో డ్రైవర్‌తో పాటు అతని అసిస్టెంట్లు ముగ్గురు, 33 మంది ప్రయాణీకులు క్షేమంగా ఎలాంటి ప్రాణాపాయం లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రమాద సంఘటన తెలుసుకున్న గుంతకల్లు డిఎస్‌పి శ్రీనివాస్, పెద్దవడుగూరు సిఐ నరేందర్‌రెడ్డి అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు పరిశీలిస్తున్నారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి

## తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సిల్వర్ జూబ్లీపై తపాలకవర్




**తిరుపతి,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ 25 సంవత్సరాల ఆధ్యాత్మికతకు గుర్తుగా తపాల శాఖ తిరుపతిలో ప్రత్యేక తపాల కవర్ ఆవిష్కరించింది. దేశంలోని ప్రధాన నగరాలకు దీటుగా వినాయక చవితి పండుగను సామూహిక నిమజ్జన మహోత్సవాన్ని ఏటా క్రమశిక్షణతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంది. గత 25 సంవత్సరాలుగా తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ చేస్తున్న కృషికి తపాలశాఖ ప్రత్యేక గుర్తింపు నిచ్చింది. మన పండుగలు మన సంస్కృతి ఆదర్శంగా నిలుస్తున్నదని వక్తలు తెలిపారు. 25వ వసంతంలో అడుగుపెడుతున్న సందర్భంగా తపాలా శాఖ సహకారంతో ప్రత్యేక పోస్టల్ కవర్లు ఆవిష్కరించుకోవడం గొప్ప అనుభూతినిస్తోందని కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ తెలిపారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలు సవాల్‌గా...

### తిరుమల శ్రీవారి ఆలయడిప్యూటీ ఇఓగా భాస్కర్

**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** అనుభవం,అర్హత పరమావధిగా అంకితభావసేవలకు నిదర్శనంగా విధులు నిర్వహిస్తున్న టిటిడి తిరుమలలోని వసతికల్పనవిభాగం డిప్యూటీ ఇఓ (ఆర్1)లో బాధ్యతలు నిర్వహిస్తున్న భయ్యాల భాస్కర్‌ను ఆలయ డిప్యూటీ ఇఓగా టిటిడి నియమించింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆయన పూర్తిస్థాయిలో అదనపు బాధ్యతలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇదివరకు శ్రీవారి ఆలయ పూర్వ డిప్యూటీ ఇఓగా ఉన్న లోకనాథంను ఎసిబి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ చేయడంతో ఆ స్థానంలో భాస్కర్‌కు అవకాశం కల్పించింది. దీంతో ముఖ్యమైన బ్రహ్మోత్సవాల సమయంలో ఆలయ పరిపాలన పరమైన సేవలకు, భక్తుల సేవల నిర్వహణకు ఎలాంటి అంతరాయం కలగకుండా టిటిడి అధికారులు అప్రమత్తమయ్యారు. కొండపై వసతి కల్పన విభాగంలో మంచి అనుభవం ఉన్న భాస్కర్‌ను తక్షణమే ఆలయ అదనపు బాధ్యతలు చేపట్టాలని ఆదేశాలిచ్చింది. ఈయన పరిధిలోకి లడ్డూల తయారీ కేంద్రం (పోటు), ఆలయం లోపల జరిగే అర్జిత సేవలు, శ్రీవారి హుండీ పరకామణి వంటి అత్యంత కీలకమైన విభాగాలు వస్తాయి. ఆలయ డిప్యూటీ ఇఓగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టడం భాస్కర్‌కు ఒక పెద్ద సవాల్ కానుంది.

## అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యానికి కేంద్రం శేషాచలంలో రాతి నీటి వంతెన

### ఆధునిక ఇంజనీర్లకు మచ్చుతునక



**తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శేషాచలం దట్టమైన అడవులు చిత్తూరు-తిరుపతి, కడప-అన్నమయ్య జిల్లాల సరిహద్దు ఎర్రచందనానికి ఆధ్యాత్మికతకే కాదు. మన పూర్వీకుల అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యానికి కూడా నిలువెత్తు నిదర్శనంగానే నిలిచింది. 16వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్య కాలంలో శ్రీకృష్ణదేవరాయల పాలనలో తిరుమల అటవీ ప్రాంతంలో నీటి ఎద్దడిని నివారించడానికి నిర్మించిన అరుదైన నీటి నిర్వహణ వ్యవస్థలు నేటికీ చెక్కుచెదరకుండా ఆశ్చర్యపరుస్తున్నాయి. ఈ ఇంజనీరింగ్ నైపుణ్యం అప్పట్లోనే ఎలా సాధ్యమైందనేది ఆధునిక ఇంజనీర్లే ఆశ్చర్యపోతున్నారు. చిన్న చిన్న కనుమ మార్గాల ద్వారా అనుసంధానంతో కొండలపై కురిసే ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసిపట్టాలనే దూరదృష్టితో నిటారైన కొండ రాళ్ళను సుత్తిపారలతో తొలిచి కిలోమీటర్ల కొద్దీ ప్రవాహ మార్గాలను నిర్మించారు. అడవుల్లోని ఎత్తైన లోయల నుండి నీరు ప్రవహిస్తూ కింద ఉన్న దిగువ చెరువులు, దిగుడు బావులు, జలాశయాలు, ఆలయ కోనేరులను చేరుకునేలా నీటితో పాటు కొండరాళ్ల ఊట నీరు కూడా వృథా కాకుండా ఈ రాతి కాల్వల్లోకి చేరేలా చిన్న చిన్న కనుమ మార్గాలను కూడా అనుసంధానించడం విజయనగర కాలపు జల నిర్వహణ నైపుణ్యానికి తార్కాణం. రాళ్ళు కిందకు కొట్టుకురాకుండా నేటి ఆధునిక కాలంలో వాడుతున్న శాటిలైట్ మ్యాపింగ్, లేజర్ సర్వే పరికరాలు లెవలింగ్ సాధనాలు ఏవీ లేని ఆ రోజుల్లోనే కొండల సహజమైన వాలును అంగుళం కూడా తేడా లేకుండా అంచనా వేసి ఈ నిర్మాణాలు చేపట్టిన తీరు అత్యంత ప్రతిష్టాత్మకం. కొండ రాళ్ల మధ్య నీటి ప్రవాహ వేగాన్ని క్రమబద్ధీకరిస్తూ, వర్షపు నీటితో పాటు వచ్చే ఒండ్రు మట్టి గానీ రాళ్లు కిందకి కొట్టుకురాకుండా సహజ వడపోత జరిగేలా నిర్మించిన ఈ కాలువల నిర్మాణం నేటి సివిల్ ఇంజనీర్లను సైతం ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. రాతి కాలువల మధ్యలో నీరు లీక్ కాకుండా ఉండేందుకు రాళ్ళను కలుపుతూ ప్రత్యేకమైన సాంప్రదాయ కారాన మిశ్రమాన్ని వాడేవారు. సున్నం, బెల్లం, కరక్కాయ, జిగురు, గుడ్డు తెల్లసొన వంటి పదార్థాల కలయికతో తయారుచేసిన ఈ లేపనం శతాబ్దాల పాటు నీటిలో ఉన్నా పాడవకుండా, నీరు లీకవకుండా చూస్తోంది. శతాబ్దాలు గడిచినా శేషాచలం దట్టమైన అడవుల్లో ప్రాచీన రాతి శిథిలాల మధ్య దాగి ఉన్న ఈ రాయల కాలపు రాతి కాలువలు మన పూర్వీకుల దూరదృష్టికి, వర్షపు నీటి సంరక్షణ ప్రణాళికకు, అద్భుత శిల్పకళా నైపుణ్యానికి తార్కాణంగా నిలుస్తున్నాయి.

# ఘనంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడి జన్మదిన వేడుకలు

### రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన ఎంపి విజయ్



**విశాఖపట్నం,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి 70వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి లో రిబ్బన్ కట్ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపీ విజయ్ స్వయంగా మొదటిగా రక్తదానం చేసి తన సేవానిరతిని చాటుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలం మధ్య ఆయన యువతకు ఆదర్శంగా నిలిచి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీ చింతకాయల విజయ్ మాట్లాడుతూ.. 1994లో అయ్యన్నపాత్రుడు ఆర్అండ్‌బి మంత్రిగా ఉన్న సమయంలో ఇచ్చిన ఓ విశిష్టమైన పిలుపును గుర్తుచేశారు. ఆ రోజుల్లో ఇంటర్నెట్, సెల్‌ఫోన్లు లేకపోయినా, తన పుట్టినరోజుకు శుభాకాంక్షలు చెప్పే బదులు రక్తదానం చేయాలని ఆయన కోరారని విజయ్ తెలిపారు. అప్పట్లో కృష్ణా బజార్, ఒకటో వార్డుకు చెందిన అయ్యన్న యూత్ సభ్యులు ప్రారంభించిన ఆ రక్తదాన స్ఫూర్తి, నేటి ఆధునిక కాలంలోనూ ఏకధాటిగా కొనసాగడం ఎంతో సంతోషకరమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. నేటి తరం (జెన్‌జి) యువత కూడా సుమారు 70 శాతం మేర ముందుకు వచ్చి రక్తదానం చేస్తుండటం అభినందనీయమని ఎంపీ విజయ్ కొనియాడారు. అయ్యన్నపాత్రుడి పుట్టినరోజు సందర్భంగా అందిస్తున్న బ్లడ్ బ్యాంక్ సేవల ద్వారా ఇప్పటివరకు 45 వేల పైచిలుకు ప్రాణాలు కాపాడబడ్డాయని ఆయన వివరించారు. యువతను చూసి స్ఫూర్తి పొందిన తాను కూడా ఈరోజు గర్వంగా రక్తదానం చేశానని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, తన కుమారుడు శివన్ పాత్రుడి జన్మదినం కూడా నేడే కావడం తనకు విశేష ఆనందాన్నిస్తోందని ఎంపీ చింతకాయల విజయ్ సంతోషం వ్యక్తం చేశారు.

# సాగునీటి ప్రాజెక్టుల పేరు ఎత్తే అర్హత జగన్‌కు లేదు

### ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ మొదలుకుని ఉత్తరాంధ్ర వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా శ్రమిస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. సామాజిక, ఆర్థిక రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రతిసారీ రాష్ట్రంలో సాగునీటి రంగానికి కొత్త కళ, కొత్త వెలుగులు వస్తాయి. నిలిచిపోయిన ప్రాజెక్టులను పరుగులు పెట్టించే సమర్థత, సంకల్పం ఆయనకే సొంతం. ఎందరో ముఖ్యమంత్రులను చూశాం కానీ, ప్రాజెక్టులపై ఇంతటి అంకితభావం ఉన్న నాయకుడు మరొకరు లేరు. రాయలసీమకు అదనపు జలాలు తీసుకురావాలని సంకల్పించిన మహనీయుడు నందమూరి తారక రామారావు ఆ మహానుభావుడి ఆశయాలను, ఆకాంక్షలను నేడు క్షేత్రస్థాయిలో నిజం చేసి చూపిస్తున్న నాయకుడు చంద్రబాబు నాయుడు గారు. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల దాహార్తిని, సాగునీటి కష్టాలను తీర్చే జీవనాడి హంద్రీ నీవా ప్రాజెక్టు. 2024లో అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలోనే దాదాపు ..8,000 కోట్లు ఖర్చు పెట్టి పనులను శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్నాం. 20142019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసమే ..12,484 కోట్లు ఖర్చు చేశాం. ఆ తర్వాత వచ్చిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తిగా గాలికొదిలేసి, ఐదేళ్లలో కేవలం ..2,000 కోట్లు మాత్రమే విదిల్చింది. సీమ ప్రజల ప్రయోజనాలను వైఎస్సార్సీపీ తుంగలో తొక్కింది. రాయలసీమను సస్యశ్యామలం చేసి, కరవును శాశ్వతంగా తరిమికొట్టేందుకు చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా (నేటి మార్కాపురం ప్రాంతం) ప్రజల 30 ఏళ్ల చిరకాల స్వప్నాన్ని నిజం చేస్తూ కృష్ణా జలాలను అందించిన ఘనత, అలాగే ఉత్తరాంధ్ర ప్రజల దాహార్తి, సాగునీటి అవసరాలు తీర్చేందుకు గోదావరి జలాలను అక్కడికి తరలించిన తొలి నాయకుడు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారేనని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. శతాబ్దాలుగా కరువుతో అల్లాడుతూ, కనీసం తాగడానికి గుక్కెడు నీరు లేక, పంటలు పండక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులకు పవిత్ర గోదావరి, కృష్ణా జలాలను మళ్లించి ఆయా ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి చంద్రబాబు గారు బాటలు వేశారు. మొన్న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభించి కృష్ణా జలాలు విడుదల చేస్తే, నిన్న పోలవరం నుంచి గోదావరి నీళ్లను ఉత్తరాంధ్రకు తరలిస్తే... ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి అండ్ కో విషం జిమ్ముతోంది. తామేదో చేసేశామని, చంద్రబాబు గారు క్రెడిట్ చోరీ చేస్తున్నారని అవాకులు చవాకులు పేలడం హాస్యాస్పదం. ఈ రాష్ట్రంలో రాయలసీమ అయినా, కోస్తా అయినా, ఉత్తరాంధ్ర అయినా సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత, నైతిక హక్కు ఒక్క చంద్రబాబు నాయుడు గారికి మాత్రమే ఉన్నాయి. జగన్మోహన్ రెడ్డి పాలనలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా పడకేశాయి. ఏ ఒక్క ప్రాజెక్టుకూ సరైన నిధులు విడుదల చేయకుండా, పనులను స్తంభింపజేసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారు. 1996లో వెలిగొండ ప్రాజెక్టుకు భూమిపూజ చేసింది చంద్రబాబు నాయుడు గారే. మళ్లీ 2026లో ఆయన చేతుల మీదుగానే ఉమ్మడి ప్రకాశం/మార్కాపురం ప్రాంతానికి కృష్ణా జలాలు విడుదలయ్యాయి. చంద్రబాబు గారి హయాంలో మొత్తం రూ. 5,233 కోట్లు వెచ్చించింది. 1996 నుంచి 2004 వరకు: రూ. 430 కోట్లు, 2014 నుంచి 2019 మధ్య: రూ. 1,814 కోట్లు, 2024 నుంచి ఇప్పటివరకు: రూ. 2,989 కోట్లు ఖర్చుపెట్టారు. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో రూ. 1,126 కోట్లు, ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి హయాంలో కేవలం రూ. 841 కోట్లు విదిల్చింది. రూ. 5,233 కోట్లు ఖర్చు పెట్టి, ప్రాజెక్టును రాత్రింబవళ్లు పరుగులు పెట్టించి, రైతులకు, ప్రజలకు కృష్ణా జలాలు అందించిన చంద్రబాబు నాయుడు గారు గొప్పా? లేక తన ఐదేళ్ల పాలనలో కేవలం రూ. 841 కోట్లు ఖర్చు చేసి, పనులు పూర్తి కాకుండానే ఏదో జాతికి అంకితం చేశామని కల్లబొల్లి మాటలు చెప్పిన జగన్మోహన్ రెడ్డి గొప్పా? ఇందులో అసలైన "క్రెడిట్ చోరీ" ఎవరిదో ప్రజలే ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రాజెక్టుల విధాత చంద్రబాబు నాయుడు గారిపై బురదజల్లే కుట్రలను ప్రజలు ఎప్పటికీ నమ్మబోరని కాలవ శ్రీనివాసులు తేల్చిచెప్పారు

## యూట్యూబ్ ఛానెల్ రిపోర్టర్ రిమాండ్‌కు తరలింపు



**కోవూరు (నెల్లూరు), సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** ఫోర్త్ ఎస్టేట్ ఛానెల్ సీఈవో శ్రావణ్‌కుమార్ ఇటీవల కోవూరులో సిమెంట్ రోడ్డు వేస్తున్న టవి కుమార్ అనే కాంట్రాక్టర్‌ను రూ. 5 లక్షలు ఇవ్వాలని బెదిరించిన కేసులో శుక్రవారం శ్రావణ్‌ను కోవూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి న్యాయవాది ముందు హాజరు పరచగా రిమాండ్‌కు తరలిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కోవూరు పోలీస్‌స్టేషన్ ముందు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గుమిగూడారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ స్టేషన్‌లోకి వెళ్లి శ్రావణ్‌కుమార్‌కు ధైర్యం చెప్పి వచ్చారు. అనంతరం శ్రావణ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించారు.

# సచ్ఛ గోదావరి లక్ష్యం!

- సంపూర్ణ కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతేక కార్యాచరణ
- అధికారులకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు



**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాల్లు థీమ్‌తో గోదావరి పుష్కరాలకు సిద్ధమవుతున్న వేళ గోదావరి నదిని సంపూర్ణ కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ముఖ్యంగా గోదావరిలో డ్రెయిన్ల ద్వారా కలుస్తున్న కాలుష్య కారక వ్యర్థాలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల నాటికి గోదావరి పవిత్రత ఉట్టిపడేలా, భక్తులు స్వచ్ఛమైన జలాల్లో స్నానమాచరించే వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. రాజమహేంద్రవరం నుంచి అంతర్వేది వరకు, గోదావరి నదిలో కలుస్తున్న అన్ని ప్రధాన, ఉప డ్రెయిన్లపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో దాదాపు 15 ప్రధాన డ్రెయిన్లు, 45 వరకు మైనర్ డ్రెయిన్లు గోదావరి నదిలో కలుస్తున్నాయని, వాటి ద్వారా చేరుతున్న మురుగు, పారిశ్రామిక వ్యర్థాలు, ఇతర కాలుష్య కారకాలపై శాస్త్రీయ విశ్లేషణ జరగాలని సూచించారు. యనమదుర్రు వంటి డ్రెయిన్లు పారిశ్రామిక ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థ జలాలను వెంట తీసుకుని వశిష్ట గోదావరిలో కలుస్తున్నాయని, అలాగే రామచంద్రపురం పరిసర ప్రాంతాల మురుగు టేకి మేజర్ డ్రెయిన్ ద్వారా, అమలాపురం ప్రాంత వ్యర్థాలు కుమ్మర కాలువ ద్వారా, ధవళేశ్వరం సమీపంలోని వ్యర్థాలు గోరింకల డ్రెయిన్ ద్వారా గోదావరిలోకి చేరుతున్న విషయాన్ని ప్రస్తావించారు. పట్టణ ప్రాంతాల మురుగుతోపాటు గోదావరి తీరం వెంబడి ఉన్న 262 గ్రామ పంచాయతీల నుంచి వెలువడే మురుగుకు కూడా గోదావరి నదే అంతిమ గమ్యస్థానంగా మారడం ఆందోళనకర అంశమన్నారు. ప్రతి డ్రెయిన్‌లో క్రమం తప్పకుండా నీటి నమూనాలు సేకరించి కాలుష్య స్థాయిలను నిర్ధారించాలని, జీవ రసాయన ఆక్సిజన్ (బీవోడీ), రసాయన ఆక్సిజన్ , ఘన వ్యర్థాలు, భారీ లోహాలు, హానికారక రసాయనాల వంటి అంశాలపై విశ్లేషణ చేపట్టాలని ఆదేశించారు. పారిశ్రామిక వ్యర్థాలు నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధి చేయబడుతున్నాయా లేదా అనే అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలని, డ్రెయిన్ల నుంచి వ్యర్థ జలాలు గోదావరిలో కలిసే ముందు శుద్ధి కావాలని స్పష్టం చేశారు. డ్రెయిన్ల ద్వారా గోదావరిలో కలుస్తున్న వ్యర్థాల స్వరూపం, కాలుష్య స్థాయిలు, కాలుష్యానికి కారణమవుతున్న వనరులు, ప్రస్తుతం అమలులో ఉన్న శుద్ధి చర్యల ప్రభావం వంటి అంశాలపై నిరంతరం అధ్యయనం చేపట్టాలని, పరిమితికి మించి కాలుష్యాన్ని గుర్తించిన సందర్భాల్లో తక్షణం నియంత్రణ చర్యలు చేపట్టాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు నిర్దేశించారు. గోదావరి కాలుష్య నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని తెలిపారు. అవసరమైతే కాలుష్య నియంత్రణ చర్యల కోసం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి విడుదల చేసిన రూ.100 కోట్ల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అటవీ, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శి ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ సమన్వయకర్తగా, పురపాలక, పంచాయతీరాజ్ . గ్రామీణాభివృద్ధి, పరిశ్రమల శాఖ, వ్యవసాయ, మత్స్యశాఖల కమిషనర్లు, జలవనరులు, గ్రామీణ నీటి సరఫరా శాఖల చీఫ్ ఇంజినీర్లు, గోదావరి పరివాహకంలోని ఆరు జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా ఉండే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కాలుష్య నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలను నిరంతరం సమీక్షించాలని దిశా నిర్దేశం చేశారు. గోదావరి తీరప్రాంత గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే జీరో లిక్విడ్ డిశ్చార్జ్ లక్ష్యంతో చర్యలు ప్రారంభించినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. పుష్కరాల నాటికి ఈ గ్రామాలను "మోడల్ పుష్కర పంచాయతీలు"గా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏ ప్రాంతంలోనూ శుద్ధి చేయని మురుగు నీరు గోదావరిలో కలవకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గోదావరి నది ప్రక్షాళనను అత్యంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమంగా తీసుకున్నామని, స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు" అనే థీమ్‌తో సమగ్ర కార్యాచరణ కొనసాగుతుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. గోదావరి ప్రక్షాళన విజయవంతంగా పూర్తైన అనంతరం కృష్ణా నదితో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నదులను కూడా కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని చెప్పారు. భవిష్యత్తులో జరిగే కృష్ణా పుష్కరాలను కూడా ఇదే థీమ్‌తో నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు.

# డోకిపర్రు మహాక్షేత్రంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

- రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో డోకిపర్రు మహాక్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన వ్రత పూజ సుమారు రెండు గంటలకు పైగా జరిగింది. పూజలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సుధ, నిర్వాహకులు కె. బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, కుటుంబసభ్యులతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన మహిళా భక్తులు వేల మంది పాలు పంచుకున్నారు. వరలక్ష్మీ పూజను పురస్కరించుకుని డోకిపర్రు మహాక్షేత్రాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులందరికీ పూజా సామాగ్రి, ద్రవ్యాలను ఆలయ ధర్మకర్తలు కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు ఉచితంగా అందించారు.పూజలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు వరుసల్లో కూర్చొని ఆచరించేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ మండపం, వెయ్యి కాళ్ళ మండపం నిం డిపోవటంతో ఆరు బయట ఉన్న ఖాళీ స్థలంలో



డోకిపర్రు ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజలు

మహిళా భక్తులు పలు వరుసల్లో కూర్చొని పూజల్లో పాల్గొన్నారు. వరలక్ష్మీ వ్రత ప్రాశస్త్యాన్ని వేద పండితులు సోదాహరణంగా వివరించారు. స్త్రీలు సకల సౌభాగ్యాలతో ఉండాలని వారు ఆశీర్వదించారు. మహిళలకు స్త్రీమూర్తి ఐనటు వంటి విష్ణు వక్షస్థల నివాసి, శ్రావణ మాస లక్ష్మీ ఐన వరలక్ష్మికి ప్రతి ఏడాది శ్రావణ మాసం నాలుగో శుక్రవారం డోకిపర్రు మహాక్షేత్రంలో పూజలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. తమ కోరికలు నెరవేరటంతో పాటు పుత్ర, పౌత్రాభివృద్ధి కోరుకుంటూ, సుమంగళిగా ఉండాలని మహిళలు ఈ విశేష పూజలు చేయటం జరుగుతుంది. శ్రావణ మాసంలోని నాలుగు శుక్రవారాల్లో తొలి మూడు శుక్రవారాలు ఏవైనా అవాంతరాల వల్ల వరలక్ష్మి పూజల్లో పాల్గొనలేని స్త్రీలు నాలుగో శుక్రవారం నాడు ఆలయంలో జరిగే పూజల్లో పాల్గొంటే మళ్లీ వచ్చే శ్రావణ మాసం వరకూ పూజలు చేసినంత పుణ్యం లభిస్తుందని ఆలయ వేద పండితులు వివరించారు. సాధారణంగా మనం ఇంట్లో ఒకసారి పూజచేస్తే అప్పటికి మాత్రమే ఫలం సిద్ధిస్తుంది. నిత్యం పూజలు జరిగే ఆలయంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతంలో ఒకసారి పాల్గొన్నా, ఆ చుట్టుపక్కల ఉన్నా అనంతమైనన్ని విడతలు పూజలో పాల్గొన్న ఫలం లభిస్తుంది. వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయంలో శుక్రవారం ఉదయం లక్ష్మీ యాగం, మహాశాంతి హెూమం నిర్వహించారు. పూజ అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందించారు. కృష్ణాష్టమి వేడుకలు.. మహాక్షేత్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఉత్సాహంగానిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. యువతీ యువకులు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది.

# మెగా డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలి

- కర్నూలు జిల్లాలో అర్హత లేని అభ్యర్థికి ఎస్‌జిటి పోస్టు ఎలా ఇచ్చారు?
- జిఒ నంబర్-4 ఆధారంగా జరిగిన నియామకాలన్నింటినీ సిబిఐకి అప్పగించాలి
- డిఎస్సీ నుంచి ఎపిపిఎస్సీ వరకు అక్రమాల విధానం పాకిందని వైఎస్ జగన్ ఆరోపణ

**కర్నూలు, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** మెగా డిఎస్సీ నియామకాల్లో అర్హత లేని అభ్యర్థులకు ఉద్యోగాలు కట్టబెట్టారంటూ సాక్ష్యాలు బయటకు వస్తున్నప్పటికీ ఈ వ్యవహారంపై సిబిఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు అంగీకరించడం లేదని వైఎస్సార్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. డిఎస్సీ నియామకాల్లో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర దర్యాప్తు జరిపించి, నిజాయితీపరులైన ఉద్యోగార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఉద్దేశించి ప్రశ్నలు సంధించారు. కర్నూలు అభ్యర్థి వ్యవహారంపై ప్రశ్నలు కర్నూలు జిల్లాలో ఒక అభ్యర్థికి అతని కేటగిరీ ప్రకారం టెట్‌లో 75 మార్కులు రావాల్సి ఉండగా 65 మార్కులు మాత్రమే వచ్చినప్పటికీ స్పోర్ట్స్ కోటాలో ఎస్‌జిటి పోస్టు ఎలా ఇచ్చారని జగన్ ప్రశ్నించారు. సదరు అభ్యర్థికి వన్-టు-వన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించిన తర్వాత కూడా అర్హత లేదని తెలిసి ఉద్యోగం ఎలా కల్పించారని నిలదీశారు. దరఖాస్తు దశలోనే తిరస్కరణకు గురికావాల్సిన అభ్యర్థి.. ఆ తర్వాతి దశలను దాటి ఉద్యోగం పొందడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. అధికారులతో ఈ వ్యవహారం చేయించిన 'అదృశ్య శక్తి ఎవరో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో డిఎస్సీ-2025 నియామకాల్లో ఇలాంటి అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని జగన్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో పనిచేసే అధికారులతో నిర్వహించే విచారణలు నిజాయితీగా, స్వతంత్రంగా ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఉన్నప్పుడు ఆయన కింద పనిచేసే అధికారులు స్వతంత్రంగా విచారణ చేయగలరా అని నిలదీశారు. **విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి:** డిఎస్సీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయించాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. అధికార బలంతో, అబద్ధాలు చెబుతూ, ప్రచార కార్యక్రమాలతో కుమారుడిని కాపాడే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. అక్రమాల విధానాన్ని డిఎస్సీ నుంచి ఎపిపిఎస్సీకి కూడా ప్రభుత్వం పాకించిందని జగన్ ఆరోపించారు. డిఎస్సీ నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకున్నందునే ప్రభుత్వం సిబిఐ విచారణకు అంగీకరించడం లేదని జగన్ ఆరోపించారు. ఈ వ్యవహారాల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్ ఉన్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. డిఎస్సీ లీకేజీ వ్యవహారం నుంచి స్పోర్ట్స్ కోటా వరకు, టెట్ అర్హతల నుంచి పోస్టింగ్ ఆర్డర్ల వరకు మొత్తం మెగా డిఎస్సీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిఒ నంబర్-4 ఆధారంగా జరిగిన నియామకాలన్నింటినీ కూడా సిబిఐ పరిధిలోకి తీసుకువచ్చి దర్యాప్తు చేయించాలని జగన్ మరోసారి డిమాండ్ చేశారు. నిజాయితీపరులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఆడండి..గెలవండి..ప్రపంచాన్ని చూడండి

- క్రీడాకారులకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపు క్రీడల్లో ప్రతిభ చూపితే ప్రపంచ స్థాయికి ఎదిగే అవకాశాలు
- చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

**అల్లూరు (నెల్లూరు), సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** నెల్లూరు, అల్లూరులో శుక్రవారం ఏపి 12వ సీనియర్ల మహిళలు, పురుషుల అంతర్ జిల్లాల బాల్ బాట్‌మెంటన్ ఛాంపియన్‌షిప్ -2026 ప్రారంభోత్సవంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మూడు రోజులు పాటు రామక్రిష్ణ జూనియర్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎంపి ప్రారంభించారు. యరబోలు మురళీక్రిష్ణరెడ్డి జ్ఞాపకార్థంగా ఛాంపియన్‌షిప్‌ను అల్లూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏంపి వేమిరెడ్డి ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో క్రీడలను ప్రోత్సహించేందుకు పిఎం నరేంద్రమోడీ, క్రీడల శాఖామంత్రి శ్రీమన్‌సుఖ్ మాండవీయు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడలకు కూడా విద్యార్థులు, యువత తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్కూల్‌గేమ్స్‌లో బాల్‌బ్యాట్‌మెంటన్‌ను తొలగించడం బాధాకరమని ఎంపి తెలిపారు. క్రీడాకారులు కోరిక మేరకు ఈ క్రీడను నేషనల్ గేమ్స్‌లో చేర్చేలా ప్రయత్నం చేస్తానని తెలిపారు. తాను చిన్నవయసులో ఏపి తరపున అండర్-19 క్రికెట్ ఆడినట్లు ఎంపి గుర్తుచేసుకున్నారు. ప్రతి



విద్యార్థిని ప్రముఖ బ్యాట్‌మెంటన్ పివి.సింధును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమె కూడా తమ స్థాయినుంచే ప్రారంభించి ప్రపంచస్థాయి క్రీడాకారిణిగా ఎదిగారన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఎంపి సూచించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న అన్ని జిల్లాల క్రీడాకారులకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఏ క్రీడాకారులైన ఓడినా, గెలిచినా క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్థానిక సుబ్బయ్య జడ్పిహైస్కూల్‌ను సందర్శించారు.

# ఇంటింటికి తెలుగుదేశం

### కోటి ఇల్లును సందర్శించిన టిడిపి నాయకులు, కార్యకర్తలకు అభినందనలు: పల్లా శ్రీనివాసరావు

**విజయవాడ,సెప్టెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేసేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికి తెలుగుదేశం 2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తల పట్టుదలతో కేవలం 40 రోజుల్లోనే కోటి ఇళ్లను సందర్శించి రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనను, ప్రజలకు అందిన సంక్షేమ వివరాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతోపాటు సూపర్ సిక్స్ హామీ అమలు తీరును ప్రజలకు వివరించారు. పార్టీ కేడర్ ప్రజలతో మమేకం కావాలనే సంకల్పానికి ఈ కోటి ఇళ్ల సందర్శన మైలు రాయి ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి రోజూ లక్షలాది కుటుంబాలను నేరుగా కలుస్తూ, ప్రజలతో మమేకం అవుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, రెండేళ్ల కూటమి పాలన విజయాలను వివరించడంతోపాటు ప్రజల అభిప్రాయాలను సేకరిస్తూ వారి సమస్యల పరిష్కార దిశగా పార్టీ శ్రేణులు కృషి చేశారు. ఈ మైలురాయి చేరుకోవడం పార్టీ నాయకులు, కార్యకర్తలదే క్రెడిట్. కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుండి నడిపిస్తున్న కార్యకర్తలకు అభినందనలు. ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందన ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనం. పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంతో, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది.

# సంప్రదాయ క్రీడలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది

### కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని అందిస్తాయని, బిజీబిజీ జీవితంలో క్రీడలను భాగస్వామ్యం చేసుకోవడం అత్యంత అవసరమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలం ప్రగడ పుట్టుగ గ్రామంలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు, ఎంపీ కప్-2026 వెయిట్ లిఫ్టింగ్ పోటీలు, ఉలవల బస్తా ఎత్తే పోటీలు, ఉట్టి కొట్టే పోటీల్లో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున క్రీడాకారులు, క్రీడాభిమానులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక వ్యాయామంతో పాటు మానసిక ప్రశాంతత, ఉల్లాసం లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అంతరించిపోతున్న సాంప్రదాయ క్రీడలను పరిరక్షి ంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమైన ఉట్టి కొట్టే పోటీలు, బస్తా ఎత్తే పోటీలు వంటి గ్రామీణ క్రీడలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రగడ పుట్టుగ గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి సందేశాలు, విలువలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఆకాంక్షి ంచారు. ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, తప్పెటగుళ్ళ, కోలాటం, అంజి ఆటలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా. బెందాళం అశోక్, ఇచ్ఛాపురం జనసేన ఇంచార్జ్ దాసరి రాజు, వంశధార ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర, కూటమి శ్రేణులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, స్థానికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు కృతజ్ఞతలు

**విజయవాడ, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** ఉద్యోగులకు రావలసిన పెండింగ్ డి ఏ లు, ఐ ఆర్, పిఆర్సి కమిషన్ మరియు రెవెన్యూ శాఖ లో పనిచేస్తున్న రెవిన్యూ ఉద్యోగుల సమస్యల గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి వెంటనే సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. శుక్రవారం ఆయన శుక్రవారం విజయవాడ రాష్ట్ర సచివాలయంలో మంత్రి అనగానిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి శనివారం ఉదయం 11 గంటలకు సీఎం క్యాంప్ ఆఫీసులో ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి కి, ఈ మీటింగ్ ఏర్పాటు చేయడానికి కృషి చేసిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు శ్రీ అనగాని సత్యప్రసాద్ గారికి కృతజ్ఞతలు, ధన్యవాదాలను భూపతిరాజు తెలిపారు. యజేసిన ఆంధ్ర ప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు. ఉద్యోగ సంఘాలతో జరిగే చర్చలు మంచి సానుకూల వాతావరణంలో ఉద్యోగులకు మేలు చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి గారు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నిర్ణయం తీసుకోవాలని కోరిన ఆంధ్ర ప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్. భూపతిరాజు రవీంద్ర రాజు. ఏదో ఒక ఉద్యోగ సంఘం నాయకుడు అతిగా వ్యవహరించి కావాలని కూటమి ప్రభుత్వంపై మీ పై మీ కుటుంబ సభ్యులు పై వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యల గురించి మనసులో పెట్టుకోకుండా వారిని క్షమించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులందరినీ మీ, ప్రభుత్వంలో భాగస్వాములుగా,మీ కుటుంబ సభ్యులుగా భావించి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు అందరికీ న్యాయం చేస్తారని ఒక సీనియర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మీ మీద మాకు పూర్తి నమ్మకం, విశ్వాసం ఉందని భూపతిరాజు రవీంద్ర రాజు స్పష్టం చేశారు.

# లక్షమందికిపైగా ఉద్యోగులకు వోక్స్‌వ్యాగన్ ఉద్వాసన




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్ వ్యాగన్ భారీగా ఉద్యోగ కోతలకు సిద్ధమైంది. ప్రపంచ వ్యాప్తంగా లక్ష ఉద్యోగాలను తొలగించేందుకు నిర్ణయించినట్లుగా ప్రకటించింది. ఈ దశాబ్దం చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తి కానుందని వెల్లడించారు. ఈ మేరకు కంపెనీ యాజమాన్యం, కార్మిక సంఘాలు ఒక అంగీకారానికి వచ్చాయని పేర్కొంది. ఇందులో ఇప్పటికే 50 వేల ఉద్యోగాల కోతకు అంగీకరించగా తాజాగా మరో 50 వేల పోస్టులను తొలగించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పింది. కంపెనీ చరిత్రలోనే కాకుండా ప్రపంచ ఆటోమొబైల్ రంగంలోనే ఇది అతిపెద్ద పునర్వ్యవస్థీకరణగా నిలవనుంది. కంపెనీ ఆర్థికపరమైన అంశాలకు తగినట్లుగా ఉద్యోగుల సంఖ్యను క్రమబద్ధీకరించడం తప్పనిసరని ఫోక్స్ వ్యాగన్ కంపెనీ పేర్కొంది. అమెరికా సుంకాలు, ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్‌లో హెచ్చుతగ్గులు, ముఖ్యంగా చైనాకు చెందిన సంస్థల నుంచి పెరుగుతున్న పోటీ కారణంగా యూరప్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ క్రమంలోనే లేఆఫ్స్‌కు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఫోక్స్ వ్యాగన్ కంపెనీలో దాదాపు 6.67 లక్షల మంది పనిచేస్తున్నారు. ఒక్క జర్మనీలోని దాదాపు 43 శాతం మంది విధులు నిర్వహిస్తున్నారు. ఆ కంపెనీ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా లక్ష ఉద్యోగాలను తగ్గిస్తామని ప్రకటించింది. అంటే మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 15 శాతానికి సమానం అన్నమాట. ఈ ఉద్యోగాల కోతను కార్మిక సంఘాలు వ్యతిరేకించినట్లుగా గతంలో వార్తలు వచ్చాయి. తాజా ప్రకటనలో మాత్రం కార్మిక సంఘాలు కూడా అంగీకరించినట్లు తెలపడం గమనార్హం. హ్యానోవర్, ఎమ్డెన్, జ్వికావ్, నెకార్సుల్మ్‌లోని నాలుగు జర్మన్ ప్లాంట్ల దీర్ఘకాలిక భవిష్యత్తుపై స్పష్టత లేదని కంపెనీ తెలిపింది. ఈ ప్లాంట్లకు ప్రత్యామ్నాయ వినియోగ మార్గాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. పూర్తి స్థాయి ప్లాంట్లను జర్మనీలో మూసివేయడం వోక్స్‌వ్యాగన్‌కు ఇదే తొలిసారి కానుందని కార్మిక వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్లాంట్ల మూసివేతపై ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఐజీ మెటల్ యూనియన్ స్పష్టం చేసింది. కార్మికులు, లోయర్ సాక్సనీ రాష్ట్రంతో కలిసి చర్చల ద్వారా రాజీ కుదిరిందని తెలిపింది.

# మహిళల టి20.. నేడే హై ఓల్టేజ్ మ్యాచ్





**దుబాయ్:** 2026 మహిళల ఆసియా కప్‌లో సెమీ ఫైనల్ స్థానాన్ని ఇప్పటికే ఖరారు చేసుకున్న ఏడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్ జట్టుకు, తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో నేడు హై ఓల్టేజ్ మ్యాచ్ జరగనుంది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పాక్‌తో జరిగే గ్రూప్ ఎ చివరి పోరులో తమ విధానాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని టీమిండియా చూస్తోంది. దుబాయ్‌లోని నెమ్మదైన పిచ్‌లపై అసోసియేట్ జట్లు మరోసారి ఆ బలహీనతలను బయటపెట్టడంతో, భారత మిడిల్ ఆర్డర్ ఆశించిన స్థాయిలో రాణించకపోవడం అనే అంశం పరిశీలనకు గురైనప్పటికీ, హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు పాకిస్థాన్‌పై గెలవడానికి స్పష్టమైన ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, ఆమె ఓపెనింగ్ భాగస్వామి షఫాలీ వర్మ, వరుసగా హాంకాంగ్ చైనా, థాయ్‌లాండ్‌లపై 124 మరియు 64 పరుగులు చేసి అద్భుతమైన ఫామ్‌లో ఈ మ్యాచ్‌లోకి వస్తున్నారు. ముఖ్యంగా స్మృతి, గురువారం రాత్రి పలు రికార్డులు సృష్టించిన తర్వాత బరిలోకి దిగుతోంది. బౌలింగ్ విభాగంలో, పేసర్ నందినీ శర్మ క్రాంతి గౌడ్‌తో కలిసి వికెట్లు తీస్తూ ఆశాజనకంగా కనిపిస్తుండగా, దీప్తి శర్మ వికెట్ల వర్షం కురిపిస్తూనే ఉంది.

ఇదిలా ఉండగా, థాయ్‌లాండ్‌పై తొలి విజయం సాధించడంతో పాకిస్తాన్ సెమీఫైనల్స్ రేసులో నిలిచింది. కానీ వారి బ్యాటింగ్ బలహీనతలు ప్రధాన ఆందోళనగా మిగిలిపోయాయి. ఆట వేగాన్ని నిర్దేశించడానికి పాకిస్థాన్ ఇప్పటికీ టాప్ ఆర్డర్ వికెట్ కీపర్‌బ్యాటర్ మునీబా అలీ, కెప్టెన్ ఫాతిమా సనాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. కానీ, మరింత పటిష్టమైన భారత జట్టుతో పోటీపడాలంటే పాకిస్థాన్ తమ బ్యాటింగ్‌లో గణనీయమైన మెరుగుదల సాధించాల్సి ఉంటుంది. భారత్ జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, భారతీ ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), జి కమలిని (వికెట్‌కీపర్), అరుంధతి రెడ్డి, ప్రేమ రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని గవాల్, ప్రరంతి గవాల్ శర్మ, పాకిస్థాన్ జట్టులో ఫాతిమా సనా (కెప్టెన్), అయేషా జాఫర్, ఎమాన్ నసీర్, ఈమాన్ ఫాతిమా, గుల్ ఫిరోజా, మొమినా రియాసత్, మునీబా అలీ సిద్దిఖీ (వికెట్‌కీపర్), సదాఫ్ షమాస్, నష్రా సుంధు, సాదియా ఇక్బాల్, సైరా జబీన్, షావాల్ జుల్ఫికర్, ఉమ్మహాన్సాని, తుబాహసానా హస్సాన్ ఉన్నారు.

## చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ ఢీ





## క్రికెట్ చరిత్రలో తొలిసారి జపాన్‌తో టీమిండియా టి20

**న్యూఢిల్లీ:** ఏషియన్ గేమ్స్-2026 ప్రారంభానికి ముందే భారత్ క్రికెట్ జట్టు చారిత్రాత్మక మ్యాచ్ ఆడనుంది. భారత్, జపాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకల ప్రారంభానికి గుర్తుగా, భారత పురుషుల క్రికెట్ జట్టు ఈ నెల 22న జపాన్‌తో తమ మొట్టమొదటి టి20 అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జపాన్‌తో ఏకైక టి20లో టీమిండియా తలపడనుంది. భారత్, జపాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవడంలో భాగంగా ఈ ప్రత్యేక మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) ప్రకటించింది. జపాన్ ప్రధాని సనాయె తకైచి, భారత్ ప్రధాని నరేంద్రమోడీల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఇండియా, జపాన్ మధ్య క్రీడల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించడమే దీని లక్ష్యమని బిసిసిఐ ఆ ప్రకటనలో తెలిపింది. కాగా జపాన్‌తో ఆడే భారత జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహించనుండగా, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ, సంజు సామ్సన్, జస్ప్రిత్ బుమ్రా వంటి స్టార్ ప్లేయర్లతో పాటు, వైభవ్ సూర్యవంశీ తదితరులు ఈ మ్యాచ్‌లో ఆడనున్నారు.

## ఇండొనేసియా మాస్టర్స్.. సెమీస్‌కు అన్మోల్

### అశ్మిత ఓటమి



**పొంటియానాక్:** ఇండోనేషియా మాస్టర్స్ 2026 సెమీస్‌కు భారత్ షట్లర్ అన్మోల్ ఖర్బ్ చేరుకోగా, ప్రపంచ 81వ ర్యాంకర్‌తో అశ్మితా చలిహా ఓటమిపాలైంది. శుక్రవారం నాడు కాలిమంటన్‌లోని పొంటియానాక్‌లో జరిగిన ఇండోనేషియా మాస్టర్స్ 2026 సెమీఫైనల్స్‌కు చేరుకోవడానికి, మూడవ సీడ్ అన్మోల్ ఖర్బ్, చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ చింగ్ పింగ్‌తో మూడు గేమ్‌ల తేడాతో పోరాడి, చివరికి 21-121, 121-14 గెలుపొందింది. అన్మోల్, హువాంగ్‌ల మధ్య జరిగిన తొలి గేమ్ హోరాహోరీగా సాగింది. సగం గేమ్ పూర్తయ్యేసరికి ఆ ఇద్దరు షట్లర్ల మధ్య కేవలం ఒక్క పాయింట్ తేడా మాత్రమే ఉంది. ఆ తర్వాత అన్మోల్, తర్వాతి 14 పాయింట్లలో 10 పాయింట్లు గెలుచుకుని, గేమ్‌ను 21-14 తేడాతో కైవసం చేసుకుని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. గేమ్ 2 కూడా ప్రారంభంలో అదే రీతిలో సాగింది. కానీ ఈసారి విరామం తర్వాత హువాంగ్ పట్టు సాధించి మ్యాచ్‌ను 1-1తో సమం చేసింది. కాగా క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్, టాప్ సీడ్ అయిన అష్మిత చలిహాను 21-10, 21-18 తేడాతో ఓడించిన చైనాకు చెందిన ప్రపంచ 81వ ర్యాంకర్ జు వెన్ జింగ్‌తో అన్మోల్ తలపడనుంది.



ఆట




### చైనా మాస్టర్స్.. శ్రీకాంత్ నిష్క్రమణ

## సెమీ ఫైనల్స్‌కు సాత్విక్-చిరాగ్ జోడీ

**షెన్‌జెన్ (చైనా):** మాజీ ప్రపంచ నంబర్ 1, భారత్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్, హాంకాంగ్‌కు చెందిన లీ చెక్ యియు చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోవడంతో, శుక్రవారం క్వార్టర్ ఫైనల్స్‌లో అతని చైనా మాస్టర్స్ సూపర్ 750 ప్రయాణం ముగిసింది. మరోపక్క భారత్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి విజయంతో సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నారు. శ్రీకాంత్ గట్టిగా పోరాడినా 16-21, 16-21 తేడాతో ఓడిపోవడంతో, ఈ టోర్నమెంట్‌లో భారత్ సింగిల్స్ ప్రస్థానం ముగిసింది. లీతో జరిగిన మ్యాచ్‌లో, శ్రీకాంత్ దూకుడుగా ప్రారంభించినప్పటికీ, ప్రత్యర్థిని ఎదుర్కొలేకపోయాడు. దీంతో లీ తొలి గేమ్‌పై పట్టు సాధించి, 21-16 తేడాతో ముగించాడు. రెండవ గేమ్ మరింత హోరాహోరీగా సాగింది, శ్రీకాంత్ గెలుపుకు చేరువలోనే నిలిచినా ఆట ముగింపు దశలో లీ 14-14తో స్కోరును సమం చేశారు. ఆ తర్వాత జరిగిన తొమ్మిది పాయింట్లలో ఏడింటిని హాంగ్ కాంగ్ షట్లర్ గెలుచుకోవడంతో, శ్రీకాంత్ కేవలం మరో రెండు పాయింట్లు మాత్రమే సాధించగలిగాడు. ఇక భారత పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి శుక్రవారం డెన్మార్క్‌కు చెందిన కిమ్ ఆస్ట్రాప్-ఆండర్స్ స్కారుప్ రాస్ముస్సెన్‌లోకి 21-13, 16-21, 21-21, ప్రవేశించారు. ఆట ప్రారంభమైన మొదటి ఐదు నిమిషాల్లోనే ఇండియన్స్ 11-4తో ఏడు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించారు. ఆట రెండవ భాగంలో డేన్స్ కొంత ప్రతిఘటన చూపి, తమ స్కోరును రెండంకెల సంఖ్యకు పెంచుకున్నప్పటికీ వాటిని అధిగమించి భారత్ జోడీ 16 నిమిషాల్లోనే ఆటను ముగించారు.

## యుఎస్ ఓపెన్.. ముందంజలో జ్వెరెవ్



**న్యూయార్క్:** యుఎస్ ఓపెన్‌లో టాప్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ మరో కఠినమైన ఐదు సెట్ల పోరులో ఫ్రాన్స్‌కు చెందిన క్వెంటిన్ హాలిస్‌ను 6-4, 4-6, 7-6(3), 6-7(3), 6-3 తేడాతో ఓడించి, ఆర్థర్ ఆషే స్టేడియంలో మూడవ రౌండ్‌కు చేరుకున్నాడు. తన తొలి రౌండ్ విజయంలో నాలుగు గంటల 53 నిమిషాల పాటు కోర్టులో గడిపిన కేవలం రెండు రోజుల తర్వాత, నాలుగు గంటల 33 నిమిషాల పాటు సాగిన మరో అర్ధరాత్రి ఉత్కంఠభరితమైన పోరులో జ్వెరెవ్ మళ్లీ తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ప్రపంచ 52వ ర్యాంకర్ అయిన హాలిస్‌తో తలపడటానికి జర్మన్ ఆటగాడు కుదురుకోవడానికి సమయం తీసుకున్నాడు. కీలకమైన క్షణాల్లో జ్వెరెవ్ తన ఆట స్థాయిని పెంచుకోగా, హాలిస్ మాత్రం ఆ సందర్భాన్ని ఎదుర్కోవడంలో ఇబ్బంది పడాల్సి వచ్చింది. 28 యేళ్ల జ్వెరెవ్ తదుపరి ప్రత్యర్థి చిలీకి చెందిన 25వ సీడ్ అలెజాండ్రో టబిలో. గత ఏడాది జరిగిన యూఎస్ ఓపెన్‌లో జ్వెరెవ్ మొదటి రౌండ్‌లో టబిలోను ఓడించాడు. ఎటిపి హెడ్‌టుహెడ్ రికార్డులో 2-0 ఆధిక్యంలో ఉన్నాడు. జ్వెరెవ్ ఈ సీజన్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్స్‌కు చేరుకోవడం, ఫ్రెంచ్ ఓపెన్ గెలవడం, వింబుల్డన్ ఫైనల్‌కు దూసుకెళ్లడం వంటివి చేశాడు. హాలిస్‌పై సాధించిన విజయంతో, ఈ ఏడాది 20 గ్రాండ్ స్లామ్ మ్యాచ్ విజయాలు నమోదు చేసిన తొలి పురుష ఆటగాడిగా నిలిచాడు. దీంతో 2026లో అతని మేజర్ రికార్డ్ 202కు చేరింది.



## ఆల్‌టైమ్ గరిష్ఠానికి భారత్ ఫారెక్స్ నిల్వలు


**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** భారత్ విదేశీ మారకద్రవ్య నిల్వలు ఆగస్టు 28తో ముగిసిన వారంలో 11.475 బిలియన్ డాలర్లు పెరిగి ఆల్‌టైమ్ గరిష్ఠం 740.803 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. శుక్రవారం ఆర్బీఐ వెల్లడించిన వివరాలప్రకారం అంతకుముందు వారంలోనూ ఫారెక్స్ నిల్వలు 12.422 బిలియన్ డాలర్లు పెరిగి 729.328 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇదే అప్పటివరకు రికార్డు గరిష్ఠంగా ఉంది. అంతకుముందు అత్యధికంగా 728.494 బిలియన్ డాలర్లు ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో నమోదయ్యాయి. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు ప్రారంభం కావడానికి ముందు ఈ రికార్డు నమోదైన తర్వాత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా రూపాయి విలువపై ఒత్తిడి పెరగడంతో పాటు, రూపాయిని స్థిరీకరించేందుకు ఆర్‌బీఐ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ల విక్రయాలు చేపట్టింది. దీంతో వరుసగా కొన్ని వారాల పాటు దేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు తగ్గాయి. దేశీయ కరెన్సీపై తీవ్ర ఒత్తిడి నెలకొన్న నేపథ్యంలో జూన్‌లో ఆర్‌బీఐ రాయితీతో కూడిన ఫారెక్స్ స్వాప్ చర్యలను ప్రకటించిన తర్వాత నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ చర్యల ద్వారా 132 బిలియన్ డాలర్లకు పైగా కొత్త నిధుల ప్రవాహం వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 28తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన ఫారెక్స్ కరెన్సీ ఆస్తులు 9.337 బిలియన్ డాలర్లు పెరిగి 600.67 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. డాలర్లలో లెక్కించిన ఫారెక్స్ కరెన్సీ ఆస్తుల విలువలో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికా డాలర్‌యేతర కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే పెరుగుదల, తగ్గుదల ప్రభావాలు కూడా ఉంటాయి. ఇదే సమయంలో దేశ బంగారం నిల్వల విలువ 2.191 బిలియన్ డాలర్లు పెరిగి 116.409 బిలియన్ డాలర్లకు చేరుకుంది. మరోవైపు, ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు అంటే ఎస్డీఆర్‌లు 43 మిలియన్ డాలర్లు తగ్గి 18.81 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిదిసంస్థ ఐఎంఎఫ్‌లో భారత్ రిజర్వ్ పొజిషన్ కూడా 11 మిలియన్ డాలర్లు తగ్గి 4.914 బిలియన్ డాల ర్లకు చేరుకున్నట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి.

## అడోబ్ సిఇఒగా అనిల్ చక్రవర్తి



**ముంబయి, సెప్టెంబరు 4:** టెక్ దిగ్గజం అడోబ్‌కు కొత్త సీఈవో రానున్నారు. భారత సంతతికి చెందిన అనిల్ చక్రవర్తి సంస్థ అధ్యక్షుడు, సీఈవోగా బాధ్య తలు చేపట్టనున్నారు. ప్రస్తుత సీఈవో శంతను నారాయణ్ 18 ఏళ్ల తర్వాత పదవి నుంచి తప్పుకోనున్నారు. డిసెంబర్ 1న అనిల్ చక్రవర్తి కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. అదే సమయంలో అడోబ్ బోర్డులోనూ చేరనున్నారు. శంతను నారాయణ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగుతారు. మార్పిడి ప్రక్రియలో అనిల్ చక్రవర్తితో కలిసి పనిచేయనున్నారు. అనిల్ చక్రవర్తి అనుభవజ్ఞుడైన నాయకుడని, విలువలు, నిజాయతీతో పనిచేస్తారని శంతను నారాయణ్ ప్రశంసించారు. అడోబ్ వ్యాపారంపై ఆయనకు లోతైన అవగాహన ఉందని తెలిపారు. అనిల్ చక్రవర్తి 2020జనవరిలో అడోబ్‌లో చేరారు. అంతకు ముందు 2015 నుంచి 2020 వరకు ఇన్ఫర్మాటికా సీఈవోగా పనిచేశారు. అడోబ్‌లో చేరిన తర్వాత డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత పలు కీలక పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ఆర్కెస్ట్రేషన్, వరల్డ్‌వైడ్ ఫీల్డ్ ఆపరేషన్స్‌కు అధ్యక్షుడిగా ఉన్నారు. అనిల్ చక్రవర్తి ఐఐటీ బనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశారు. అనంతరంఅమెరికాలోని ఎంఐటీ నుంచిఎంఎస్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. సిమాంటెక్, వెరిసైన్, మెకిన్సీ వంటి సంస్థల్లోనూ బాధ్యతలు నిర్వహించారు.

## రూ.40వేల కోట్లమేరకు జియో ఐపిఒ



వాణిజ్యం

**ముంబయి, సెప్టెంబరు 4:** భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓకు రంగం సిద్ధమవుతోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్, టెలికాం విభాగం రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ భారీ పబ్లిక్ ఇష్యూకు సన్నాహాలు చేస్తోంది. నవరాత్రి, దీపావళి పండుగల సీజన్‌లో సుమారు రూ.37,000-40,000 కోటు విలువైన మెగా ఐపీఓను తీసుకురావాలని కంపెనీ భావిస్తున్నది. ఇప్పటికే సెబీ నుంచి డ్రాఫ్ట్ పేపర్లకు అనుమతి లభించడంతో జియో ప్లాట్‌ఫామ్స్ తుది తేదీలను ఖరారు చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. తర్వాత దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు భారీ స్థాయిలో రోడ్‌షోలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ ఐపీఓ పూర్తయితే ఇప్పటి వరకు భారత్‌లో లిస్ట్ అయిన అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా రికార్డు సృష్టించే అవకాశం ఉంది. ఇక జియో ఐపీఓను అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ తొలి వారంలో తీసుకురావచ్చని మార్కెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా నవరాత్రి పండుగ రోజుల్లోనే ఐపీఓను ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం. ఒకవేళ ఆ సమయంలో సాధ్యం కాకపోతే దీపావళి పండుగను టార్గెట్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. జియో ప్లాట్‌ఫామ్స్ ముందుగా అంతర్జాతీయ రోడ్‌షోలు, ఆ తర్వాత దేశీయ రోడ్‌షోలను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దాదాపు మూడు వారాల పాటు విదేశాల్లో, రెండు వారాల పాటు దేశీయంగా రోడ్‌షోలు నిర్వహించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ద్వారా సుమారు రూ.37,800 కోట్లు సమీకరించే అవకాశం ఉందని బ్యాంకర్లు అంచనా వేస్తున్నారు. భారత ప్రైమరీ మార్కెట్‌లో సరికొత్త రికార్డుగా నిలవనుందని చెబుతున్నారు. ప్రస్తుతం హ్యుందాయ్ మోటార్ ఇండియా 2024లో తీసుకొచ్చిన సుమారు రూ.27,000 కోట్ల ఐపీఓ దేశంలో పూర్తయిన అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా ఉంది. అంతకంటే పెద్దగా జియో ఐపీఓ నిలుస్తోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఐపీఓ విలువ కంటే కూడా జియో ఇష్యూ పెద్దదిగా ఉండొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ 270 మిలియన్ల వరకు కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయాలని ప్రతిపాదించింది. ఇవి ఐపీఓ అనంతరం కంపెనీ ఈక్విటీ క్యాపిటల్‌లో సుమారు 2.9 శాతం వాటాను సూచిస్తాయి. ఈ ప్రతిపాదిత ఐపీఓలో ఆఫర్ ఫర్ సేల్ ఉండదని సమాచారం. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత రిలయన్స్ గ్రూప్ నుంచి వస్తున్న తొలి ఐపీఓ ఇదే కావడం మరో ప్రత్యేకత. జియో ఐపీఓ తో వచ్చే నిధుల్లో కొంత మొత్తాన్ని దాని ఆపరేటింగ్ సబ్సిడియరీ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రుణాన్ని ముందుగానే తీర్చేందుకు వినియోగించనున్నట్లు డిఆర్‌హెచ్‌పిలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో రూ.27,500 కోట్ల వరకు రుణాన్ని చెల్లించి మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియో గించనున్నట్లు తెలుస్తోంది. రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్‌లో ఇప్పటికే పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. పెద్ద ఇన్వెస్టర్ల వద్ద కలిపి సుమారు 30.9 శాతం వాటా ఉన్నట్లు సమాచారం. మెటా ప్లాట్‌ఫామ్స్‌కు చెందిన జాదూ హోల్డింగ్స్ వద్ద సుమారు 9.98 శాతం, గూగుల్ ఇంటర్నేషనల్ వద్ద 7.73 శాతం వాటా ఉన్నట్లు డిఆర్‌హెచ్‌పిలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. సౌదీ అరేబియా పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, సిల్వర్ లేక్, విస్టా ఈక్విటీ, జనరల్ అట్లాంటిక్, కెకెఆర్ అనుబంధ సంస్థలు, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీకి చెందిన సంస్థలు కూడా జియోలో పెట్టుబడిదారులుగా ఉన్నాయి.

## ప్రైమరీ మార్కెట్‌కు ఆరు ఐపిఒలు



**ముంబయి,సెప్టెంబరు 4:** భారత ప్రైమరీ మార్కెట్లో కొత్త ఉత్సాహం నెలకొంది. అమెరికాఇరాన్ యుద్ధ పరిణామాల కారణంగా 2026 ప్రారంభంలో నెమ్మదించిన నిధుల సేకరణ ప్రక్రియ మళ్లీ వేగం పుంజుకుంది. ఈనెల 9న ఒకే రోజున రికార్డు స్థాయిలో ఆరు ఐపీఓలు మార్కెట్లో ప్రారంభం కానున్నాయి. ఫర్నీచర్ రెంటల్ వేదిక రెంట్ ఒమోజో, అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా), మణిపాల్ పేమెంట్ ఐడెంటిటీ సొల్యూషన్స్ వంటి ప్రముఖ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ ఆరు కంపెనీలు కలిపి సుమారు 45.11 బిలియన్ రూపాయలు (477.46 మిలియన్ డాలర్లు) సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. వచ్చే వారంలోనే మరికొన్ని ఇతర కంపెనీలతో కలిపి కనీసం 11 ఐపీఓలు మార్కెట్లోకి అడుగుపెడుతుండటంతో ఈ ఏడాదిలోనే ఇది అత్యంత రద్దీగా ఉండే వారంగా నిలవనుంది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల అంచనాల ప్రకారం సెప్టెంబర్ నెలలో మొత్తం మీద దాదాపు 4 బిలియన్ డాలర్ల విలువైన ఐపీఓలు రానున్నాయి. ఆటోమోటివ్ టెక్నాలజీ సంస్థ హీరో మోటార్స్, ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్‌ఎస్ఇలతో పాటు ముకేష్ అంబానీ మద్దతు ఉన్న జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ కూడా త్వరలోనే రాబోతోంది. అధిక వృద్ధి అవకాశాలు ఉన్న కంపెనీలకు భారత మార్కెట్లో మంచి డిమాండ్ కనిపిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 26 నాటికి భారత్‌లో 165 ఐపీఓల ద్వారా 8.61 బిలియన్ డాలర్లు సమీకృతమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఐపీఓ నిధుల సేకరణలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. మార్కెట్ నియంత్రణ సంస్థ ఇచ్చే ఐపీఓ అనుమతుల గడువు ఈనెల 30తో ముగియనుండటంతో కంపెనీలు మార్కెట్లోకి వచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాయి. గడిచిన ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో సగటున 24.5 రెట్లు ఉన్న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్లు, జూలై ఆగస్టు నాటికి 59.1 రెట్లకు పెరిగాయి. అలాగే లిస్టింగ్ లాభాలు కూడా 5.7 శాతం నుంచి 19.5 శాతానికి పైగా పుంజుకున్నాయి. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం పెట్టుబడిదారులు ప్రతి ఐపీఓలోనూ కాకుండా నాణ్యమైన, మంచి వృద్ధి సామర్థం ఉన్న కంపెనీల్లో మాత్రమే జాగ్రత్తగా పెట్టుబడులు పెడుతున్నారు.

## వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలకు లాభాలు



**ముంబయి, సెప్టెంబరు 4:** భారత స్టాక్ మార్కెట్ ఈ వారాంతం లాభాల్లో ముగిసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 362 పాయింట్లు పెరగగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 24 పాయింట్లు పెరిగింది. దీంతో నాలుగు రోజులుగా సాగిన నష్టాలకు శుక్రవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 531.88 పాయింట్ల పెరుగుదలతో 76,684.74 వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ 78.25 పాయింట్ల పెరుగుదలతో 23,951.70 వద్ద ప్రారంభమైంది. చివరకు సెన్సెక్స్ 362.57 పాయింట్ల లాభంతో 76,515.43 వద్ద, నిఫ్టీ 24.25 పాయింట్ల లాభంతో 23,897.70 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 విలువ 0.25 శాతం నష్టపోగా, నిఫ్టీ మైక్రోక్యాప్ 250 కూడా 0.67 శాతం నష్టపోయింది. నిఫ్టీ రియాల్టీ ఇండెక్స్ 0.90 శాతం పడిపోగా, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 1.07 శాతం పెరిగింది. 30 షేర్ బీఎస్‌ఈ ఇండెక్స్‌లో రిలయన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ట్రెంట్ లాభాల్లో ముగిశాయి. మరోవైపు ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఎటర్నల్, సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, మారుతి నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 95.18 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ మార్కెట్‌లో 4,472 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.45 వద్ద ఉంది. అలాగే బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ 0.01శాతంక్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ 0.24శాతం ఎరిగింది. మార్కెట్లపరంగా ఎన్‌ఎస్‌ఇలో 2016 షేర్లుపెరిగితే 1517 షేర్లు క్షీణించగా మరో 115 షేర్లుస్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో అక్టోబరునాటి ఫ్యూచర్ పసిడి ధరలు పదినరగాములకు రూ.1,56,837గా కొనసాగాయి. లిస్టింగ్ అయిన షేర్లలో ఇఎస్‌డిఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ రూ.895.55 చొప్పున ముగిసింది. 108.75శాతం ప్రీమియంతో కొనసాగింది. ప్రయారిటీ జ్యూయెల్స్ 234.45 వద్ద కొనసాగింది. ఇష్యూ ధర కంటే బిఎస్‌ఇలో 12.6 శాతం ఈ సంస్థ షేర్‌ధరలు కొనసాగాయి.

## 11న ఎన్‌ఎస్‌ఇ ఐపిఒ ఇష్యూ ధరల ప్రకటన




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 4:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ భారీ ఐపిఒకు సంబంధించి కీలక ప్రకటనకు సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 11న ఐపిఒ ధరల శ్రేణిని ప్రకటించే అవకాశం ఉందని, సెప్టెంబర్ మూడో వారంలో ఎన్‌ఎస్‌ఇ షేర్లను లిస్ట్ చేయాలని యోచిస్తున్నట్లు వెల్లడించింది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఎన్‌ఎస్‌ఇ ఐపిఒకు ఆగస్టు 2026లోనే నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ లభించింది. సెప్టెంబర్ 2026లో ఎన్‌ఎస్‌ఇ షేర్లు బీఎస్‌ఈలో లిస్టయ్యే అవకాశం ఉందని జులైలోనే వెల్లడి అయింది. ప్రపంచంలో ట్రేడింగ్ పరిమాణం పరంగా అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్‌గా ఉన్న ఎన్‌ఎస్‌ఇ ఐపిఒ కోసం జూన్ 17న సెబీకి డ్రాఫ్ట్ పేపర్లను దాఖలు చేసింది. స్ట్రీట్ అంచనాల ప్రకారం ఐపిఒ విలువ రూ.30వేల కోట్లకు పైగా ఉండే అవకాశం ఉంది. అదే జరిగితే భారత స్టాక్ మార్కెట్‌లో ఇప్పటివరకు వచ్చిన అతిపెద్దఐపిఒగా నిలుస్తుంది. ప్రస్తుతం ఈ రికార్డు హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ.27,870 కోట్లఐపిఒ పేరిట ఉంది. ఎన్‌ఎస్‌ఇ ఐపిఒద్వారా గరిష్ఠంగా రూ.5.26 లక్షల కోట్ల విలువను సంస్థ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. డిఆర్‌హెచ్‌పి ప్రకారం, ఐపిఒ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉంటుంది. ఇందులో ప్రస్తుత వాటాదారులు సుమారు 14.89 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. ఇవి ఎన్‌ఎస్‌ఇ చెల్లించిన ఈక్విటీ మూలధనంలో దాదాపు 6 శాతానికి సమానం. ఐపిఒ ప్రక్రియ కోసం ఎన్‌ఎస్‌ఇ మొత్తం 20 బ్యాంకులను నియమించింది. కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, జేఎం ఫైనాన్షియల్, మోర్గాన్ స్టాన్లీ, హెచ్‌ఎస్‌బీసీ హోల్డింగ్స్, సిటీగ్రూప్ తదితర ప్రముఖ సంస్థలు ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# కోనసీమ రైల్వేప్రాజెక్ట్ పై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి...



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబరు4, ప్రభాతవార్త.** ఈనెల9 వ తారీఖున ముఖ్యమంత్రి చంద్రబాబు అంబాజీపేట కు వస్తున్న నేపథ్యంలో కోనసీమ జేఏసి కార్యవర్గం సభ్యులు స్థానికంగా చిన్నవంతేన వద్ద రైల్వేలైన్ శంకుస్థాపన ప్రాంతంలో సమావేశం అయ్యారు. చంద్రబాబు ఆధ్వర్యంలో ఇదే ప్రాంతంలో శంకుస్థాపన జరిగి ఇప్పటికీ రెండున్నర దశాబ్దాలు అవుతుందని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం కోటిపల్లి - నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణపు పనులు నత్తనడకన జరుగుతుండడంపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పలు సందర్భాల్లో కోనసీమ రైల్వేప్రాజెక్ట్ త్వరలో పూర్తివుతుందని హామీ ఇచ్చినప్పటికీ నిర్మాణపు పనుల్లో ఎటువంటి ప్రగతి లేదని వక్తలు పేర్కొన్నారు. భూసేకరణ పనులు పూర్తిగా ఆగిపోయాయని వాపోయారు. కాబట్టి ఈ రైల్వేప్రాజెక్ట్ ఎప్పటి లోగా పూర్తివుతుందో స్పష్టమైన ప్రకటనను సీఎం అంబాజీపేట లో చేయాలని జేఏసి కార్యవర్గం డిమాండ్ చేసింది.కన్వీనర్ బండారు రామమోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో డా.రాయుడు శ్రీరామచంద్ర మూర్తి, భాగవతుల మూర్తి,కరాటం ప్రవీణ్,పమ్మ నాగేశ్వరావు, ఎస్.శాంసన్,మడికి శ్రీరాములు, రంకిరెడ్డి శ్రీనివాస రావు, కల్వకొలను బాబు, కార్టూనిస్ట్ రాము, డా.చిత్రపు మాణిక్యమార్, డా.మధుర నరసింహమూర్తి, నంద్యాల నాయుడు,టి.సుందర రామయ్య,యార్లగడ్డ రవీందర్, మాచిరాజు నాగేశ్వరావు, ఏ.భాను మూర్తి, తదితరులు పాల్గొన్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | శనివారం 05 సెప్టెంబర్ 2026 | I


# ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లాకు ఆరుగురు..

**మండలానికి 26 మంది ఎంపిక.. ఎం. ఇ. ఒ. కె. వి. వి. సత్యనారాయణదొర**



రాజవొమ్మంగి, సెప్టెంబర్ 04, ప్రభాత వార్త రాజవొమ్మంగి మండలంలో సెప్టెంబర్ ఐదో తేదీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఆరుగురు ఎంపిక కావడం జరిగిందన్నారు. మండల స్థాయిలో విద్యాశాఖ ద్వారా 19 మంది, సాదు జనార్ధనరావు మెమోరియల్ సొసైటీ (రాజమండ్రి) తరుపున ఏడుగురు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకోనున్నారని ఎం. ఇ. ఒ. కె. వి. వి. సత్యనారాయణదొర తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజవొమ్మంగి మండలం నుండి ఆరుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం జరిగిందని ఎం. ఇ. ఓ. కె. వి. వి. సత్యనారాయణదొర తెలిపారు. అరుమిల్లి ఆదిలక్ష్మి (హెచ్. ఎం, జడ్పీ స్కూల్ రాజవొమ్మంగి ) బిడిజన నూకరాజు (జి. పి. ఎస్. రాజవొమ్మంగి), కంభం విజయ్ బాబు, (బోర్నగూడెం, ఆశ్రమపాఠశాల) , గొలగాని అప్పారావు (ఎంపిపి, దాకరాయి ), పప్పుల సరస్వతి (సూరంపాలెం ), గుమ్మడి సూర్యనారాయణ (జడ్పీ స్కూల్, జడ్డంగి) ఉపాధ్యాయులు సెప్టెంబర్ ఐదో తేదీ శనివారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రంపచోడవరం ఐ. టి. డి. ఏ లో జరిగే కార్యక్రమంలో ఉత్తమ ప్రశంసపత్రాలను పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతులు మీదుగా అందుకోనున్నారని ఎం. ఈ. ఓ సత్యనారాయణదొర అన్నారు. మండలస్థాయి ఇలా ఉన్నాయి. సాదు జనార్ధన రావు మెమోరియల్ సొసైటీ ( రాజమండ్రి ) వారి సౌజన్యంతో మండల ఉత్తమ ఉపాధ్యాయులు ఏ..చిన్నమ్మాయి (బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, అమినాబాద్), గోము గంగాభవాని (ఎంపీపీఎస్., సింగంపల్లి ).వై . సత్యనారాయణ (అశ్రమ ఉన్నత పాఠశాల, బోర్నగూడెం ),నీలాద్రి రమాదేవి కాకూరి రాజబాబు (ఎంపీపీ స్కూల్, లాగరాయి ), జరుముడి .హరనాథ్, ఎస్.సోనియా జార్జి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకోనున్నారు. మండల విద్యా శాఖాధికారి కార్యాలయం ద్వారా 19 మంది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ఇలా ఉన్నాయి. కె. నాగమల్లేశ్వరి (ఆశ్రమ యు. పి పాఠశాల, వాతంగి ), జె. వెంకటలక్ష్మి ( బాలికొన్నత ఆశ్రమ పాఠశాల, అమినాబాద్ ), టి. వి. ఎల్. ఎన్. మూర్తి ( జి. పి. ఎస్., ఓగిపాలెం ), ఎస్. అప్పలనర్సయ్య (ఎంపిపిఎస్, చికిలింత ), వి. రమేష్, (ఆశ్రమ పాఠశాల, బోర్నగూడెం ) ఎస్. మల్లేశ్వరి (ఎంపిపిఎస్, వంచంగి ), ఇ. తులసి (ఎంపిపి ఎస్, ఊర్లకులపాడు ), కె. గౌతమిదేవి ( బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, సింగంపల్లి ), చోడి శ్రీనివాస్ ( జడ్పీ పాఠశాల జడ్డంగి ), కె. పద్మావతి ( బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, జడ్డంగి ), పి. రాంబాబు ( ఎం.పి.యు. పి., శరభవరం ), ఎం. శాంతి ప్రియ ( జడ్పీ పాఠశాల, రాజవొమ్మంగి ), ఎం. ఆలీషారాణి ( బాలికల ఆశ్రమ పాఠశాల, రాజవొమ్మంగి ), జె. రాంబాబు ( బాలురు ఆశ్రమ ఉన్నత పాఠశాల, రాజవొమ్మంగి ), జి. లోవలక్ష్మి ( జి. పి. ఎస్, విద్యానగర్, రాజవొమ్మంగి ), ఎన్. ఉమ ( ఏ. పి. గురుకుల ఉన్నత పాఠశాల, రాజవొమ్మంగి ), ఎం. పాపారావు ( ఆశ్రమ ఉన్నత పాఠశాల, రాజవొమ్మంగి ), కె. పద్మావతి (జి. పి. ఎస్. నెల్లిమెట్ల ) ఎంపికయ్యి శనివారం ఎం. ఇ. ఒ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో సత్కారం పొందనున్నారు.

# సత్యదేవుని ఆలయంలో శ్రావణమాస శోభ..



**అన్నవరం ఆగస్టు సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త)** శ్రీ స్వామివారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళా భక్తుల కొరకు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు అత్యంత వైభవంగా నిర్వహించుట జరిగినది. 12,230 సామూహిక వరలక్ష్మీ వ్రతములు నిర్వహించడం జరిగినది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేసి, భక్తులకు ఏ విధమైన అసౌకర్యము ఏర్పడకుండా శ్రీ వరలక్ష్మి అమ్మవారి వ్రతములు నిర్వహించుకున్న భక్తులకు శ్రీ స్వామి వారి దర్శనం అనంతరము శ్రీ స్వామివారి అన్న ప్రసాదము ఏర్పాటు చేయుట జరిగినది. భారీగా వ్రతాలు జరుగుతున్నందున ఎప్పటికప్పుడు అధికారులు అక్కడ ఇబ్బంది లేకుండా సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు ఆలయ చైర్మన్ ఐవి రోహిత్ ఈవో నల్ల సూర్య చక్రధరరావు ఎప్పటికప్పుడు అక్కడ పరిస్థితులు పర్యవేక్షిస్తూ అధికారితమైన ఆదేశాలు జారీ చేసేవారు. క్యూ లైన్ లో గాని వ్రత మండపాలు ఇబ్బంది తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని గట్టి సెక్యూరిటీ ఏర్పాటు చేసిన సెక్యూరిటీ ఆఫీసర్ ఆకుల ప్రసాదరావు

# వాడపల్లి క్షేత్రంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**నవనీత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన వేణుగోపాల స్వామివారు.**

**స్వామివారికి అష్టోత్తర పూజ, నిత్యకళ్యాణం..అశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులు.**

**నిత్యాన్న పథకానికి రూ,100111/- విరాళం..**







**ఆత్రేయపురం, సెప్టెంబర్ 04,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శ్రావణమాసం నాలుగవ శుక్రవారం,శ్రీకృష్ణాష్టమి పర్వదినం కావడంతో అశేష భక్త జనంతో షోబిల్లింది .ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజలలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం స్వామివారికి మేలుకొలుపు శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం అష్టోత్తర శత నామావళి, నిత్య కళ్యాణం,బాల భోగం నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అలాగే శ్రీవారి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున నుంచి ఆలయ క్షేత్రపాలకుడు శ్రీ వేణుగోపాల స్వామి వారికి మేలుకొలుపు అర్చన పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేసి, నైవేద్యాలు సమర్పించి హారతులు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు విశేష సేవలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ వేణుగోపాల స్వామి వారిని దర్శించుకుని చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండపేట చెందిన వంక నరేంద్ర బాబు, సుజాత దంపతులు, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ.100111/- విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు శ్రీ స్వామివారి దర్శనం చేయించి, వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులు తగు ఏర్పాట్లు చేశారు.

# సామూహిక వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు:



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త)**శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని కాకినాడ నగరం నందు పలు దేవాలయాలలో సామూహిక వరలక్ష్మీ వ్రతోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు జగన్నాథపురం నందు కొలువుతీరియున్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ సర్వేశ్వర స్వామి ఆలయం, జగన్నాథపురం చిన్న మార్కెట్ ప్రాంగణం నందు శ్రీ కనకదుర్గమ్మ అలయం నందు నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.వందలాది మంది మహిళలు సాంప్రదాయ దుస్తులలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ లోక కళ్యాణార్థం, ప్రతి ఇంట్లో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధించాలని మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవడం జరుగుతుందని, హైందవ సంస్కృతిలో వరలక్ష్మీ వ్రతానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇలాంటి సామూహిక వ్రతాల వల్ల సమాజంలో ఐక్యత, భక్తిభావం పెంపొందుతాయని కొనియాడారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు మేడిశెట్టి వీరభద్రరావు, దుగ్గన రాజు, మేడిశెట్టి చిన్ని, చొక్కా గిరి, పిర్ల లక్ష్మీ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు

# గొల్లగుప్ప ఘటనపై కేంద్ర బృందం విచారణ

**లక్ష్మీపురం పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన.. గొల్లగుప్పలో బాధిత కుటుంబాలతో భేటీ.**







**చింతూరు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** ఏటపాక మండలం గొల్లగుప్ప గ్రామంలో క్లోరోక్విన్ మాత్రలు వికటించడంతో మడివి జమున (7) మృతి చెందిన ఘటనపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన ప్రత్యేక బృందం శుక్రవారం విచారణ చేపట్టింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ బృందంతో పాటు హైదరాబాద్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (హెచ్ ఎఫ్ డబ్ల్యు ) ప్రాంతీయ డైరెక్టర్ కూడా లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఘటనకు సంబంధించిన వైద్య రికార్డులను పరిశీలించి, జమునకు అందించిన వైద్యం, పీహెచ్‌సీకి తీసుకువచ్చిన సమయం, చికిత్సకు సంబంధించిన ఇతర వివరాలను సేకరించారు. ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో లేకపోవడంపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, జమునకు అందించిన మాత్రలు, ఆమెకు అందిన వైద్య సేవలు, చికిత్స వివరాలపై అధికారులు ఆరా తీశారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో మాట్లాడిన కేంద్ర బృందం.. పీహెచ్‌సీ పరిధిలో అందిస్తున్న వైద్య సేవలు, వైద్యుల పనితీరు తదితర అంశాలపై వివరాలు తెలుసుకుంది.

**గ్రామంలో బాధిత కుటుంబాలతో భేటీ**

అనంతరం కేంద్ర బృందం గొల్లగుప్ప గ్రామాన్ని సందర్శించి స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించింది. ఈ సందర్భంగా కొందరు గ్రామస్తులు పీహెచ్‌సీ వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులను సముదాయించిన కేంద్ర బృందం.. ఎవరూ అపోహలకు గురికావద్దని సూచించింది. ఫోరెన్సిక్ రిపోర్టు, పోస్టుమార్టం (పీఎం) నివేదికతో పాటు అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను పరిశీలించిన అనంతరం సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపింది. అలాగే గ్రామంలో అస్వస్థతకు గురైన ఇతర బాధితుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవలపై కూడా కేంద్ర బృందం ఆరా తీసింది.

**రెగ్యులర్ వైద్యుల అవసరం.**

లక్ష్మీపురం పీహెచ్‌సీలో రెగ్యులర్ వైద్యుల అవసరం ఉందని కేంద్ర బృందం పేర్కొంది. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని లక్ష్మీపురం, గౌరీదేవిపేట వైద్యాధికారులకు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విశ్వాచైతన్యకు సూచించింది. గొల్లగుప్ప ఘటనపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపడుతుండటంతో గ్రామస్తుల్లో కొంత భరోసా ఏర్పడింది.

# రాజ్యసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఎంపీ సానా సతీష్ బాబు


**కీలక కమిటీలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం**



**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 4( ప్రభాతవార్త):** రాజ్యసభ కమిటీల పునర్వ్యవస్థీకరణలో భాగంగా బిజినెస్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా రాజ్యసభ చైర్మన్ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబును పలు కమిటీలకు సభ్యులను నియమించారు. రాజ్యసభలో సభా కార్యక్రమాల నిర్వహణ, చర్చకు వచ్చే అంశాల ప్రాధాన్యత, సభా సమయ కేటాయింపు వంటి కీలక పార్లమెంటరీ వ్యవహారాల్లో బిజినెస్ అడ్వైజరీ కమిటీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇలాంటి కీలక కమిటీలో సానా సతీష్ బాబుకు సభ్యుడిగా అవకాశం లభించడం ఆంధ్రప్రదేశ్‌కు దక్కిన ముఖ్యమైన ప్రాతినిధ్యంగా భావిస్తున్నారు. ఈ బాధ్యతతో రాష్ట్రానికి సంబంధించిన అంశాలను రాజ్యసభలో మరింత సమర్థవంతంగా ప్రస్తావించడంతో పాటు ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలకు ప్రాధాన్యత తీసుకురావడానికి అవకాశం కలుగుతుందని టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎంపీ సానా సతీష్ బాబుకు సహచర ఎంపీలు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

# మండలంలో ఘనంగా కృష్ణాష్టమి, వరలక్ష్మీ వ్రతాలు





**కె గంగవరం, సెప్టెంబర్ 4, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలంలో గంగవరం, తమ్మయ్యపాలెం, పాతకోట, కొత్తకోట,కోటిపల్లి,సుందరపల్లి, పామర్రు, అముజూరు, దంగేరు బట్లపాలిక,మసకపల్లి, అద్దంపల్లి, వత్రపూడి, బ్రహ్మపురి, యర్రపోతవరం, బాలాంత్రం ,కుందూరు ఇలా పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా ఆయా గ్రామ ప్రజలు నిర్వహించారు. చిన్నపిల్లలకు కృష్ణుడి, గోపికల వేషధారణ వేసి కొన్ని గ్రామాల్లో ఉట్టిని కొడుతూ కృష్ణాష్టమి సంబరాలు నిర్వహించారు. అలాగే వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారి ఆలయాలని మామిడి తోరణాలతో పూలదండలతో అలంకరించి ప్రత్యేక అభిషేకాలు కుంకుమ పూజలు నిర్వహించారు.

# ఆడపడుచులకు పవన్ 'శ్రావణ కానుక'

- పురూహూతికా అమ్మవారిసన్నిధిలో
- సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- 10 వేల మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమ పంపిణీ
- వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు



**పిఠాపురం, సెప్టెంబర్ 4( ప్రభాతవార్త )**శ్రావణ మాస శుక్రవారాన్ని పురస్కరించుకుని పిఠాపురంలోని శ్రీ కుక్కుటేశ్వర స్వామి, శ్రీ పురుహూతికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని సుమారు 10 వేల మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమలను శ్రావణ మాస కానుకగా పంపిణీ చేశారు. వ్రతంలో పాల్గొనేందుకు ఉదయం నుంచే మహిళలు ఆలయానికి చేరుకోవడంతో పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. ప్రభుత్వం తరఫున పిఠాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి శివరామ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎస్.టి.వి రాజేశ్వర రావు, పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్, ఏర్పాట్లను పర్యవేక్షించారు.







**పట్టువస్త్రాల సమర్పణతో ప్రారంభం**

వరలక్ష్మీ వ్రత మహోత్సవాన్ని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వరలక్ష్మీదేవిని ప్రతిష్ఠించి వ్రత పూజలను నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో కూర్చుని పూజల్లో పాల్గొన్నారు.వరలక్ష్మీదేవికి పసుపు,కుంకుమ,పుష్పాలతో పూజలు చేసి కుటుంబ శ్రేయస్సు సుఖ సంతోషాలు కలగాలని ప్రార్థించారు.

**పవన్ ఆత్మీయతకు నిదర్శనం**

పిఠాపురం ఆడపడుచులతో తనకున్న అనుబంధాన్ని పవన్ కళ్యాణ్ మరోసారి రుజువు చేసుకున్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని సుమారు 10 వేల మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమలను అందించడం ద్వారా వారిపై తనకున్న ఆప్యాయతను చాటుకున్నారు. కార్యక్రమానికి హాజరైన మహిళలకు క్రమపద్ధతిలో కానుకలను పంపిణీ చేయడంతో, ఆనందం వ్యక్తం చేశారు.

**సంప్రదాయబద్ధంగా పూజలు**

శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతానికి విశిష్టత ఉండటంతో మహిళలు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలతో కార్యక్రమం కొనసాగింది. పూజా కార్యక్రమం పూర్తయిన అనంతరం మహిళలకు ప్రసాదాలను అందించారు. ఆలయంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.

**రాజకీయ నేతల హాజరు**

కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు, పిఠాపురంమాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు ,ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్, జనసేన నాయకులు, చెల్లుబోయిన సతీష్, సూరవరపు సురేష్, గంజి గోవిందరాజులు, బొజ్జా లోవరాజ, బాలిపల్లి అనిల్,జనసైనికులు పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను వారు పర్యవేక్షించారు.

**ఆలయంలో ప్రత్యేక సందడి**

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయానికి వచ్చిన మహిళలతో పిఠాపురంలో ప్రత్యేక సందడి నెలకొంది. ఉదయం నుంచే ఆలయ పరిసరాల్లో భక్తుల రాకపోకలు పెరిగాయి. అమ్మవారి దర్శనం, వ్రత పూజల్లో పాల్గొనేందుకు మహిళలు వేలాదిగా ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ సిబ్బంది, జనసేన వాలంటీర్లు భక్తులకు అవసరమైన సూచనలు అందించారు.

# మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా రాము - సునిత దంపతులు



**వి.ఆర్.పురం,సెప్టెంబర్ 4,ప్రభాతవార్త** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని, దంపతులు ఇద్దరు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అరుదైన సంఘటన వి.ఆర్.పురం మండలంలో చోటుచేసుకుంది. శుక్రవారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వీరిద్దరు ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకోబోతున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు దక్కటం సాధారణమైన విషయమే కావచ్చు. కాని దంపతులిద్దరుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకోవటం మాత్రం అరుదైన విషయం. వి.ఆర్.పురం మండలం నుండి ముగ్గురు మాత్రమే ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిలో రేఖపల్లి కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పెనుబల్లి వెంకమ్మ ఒకరు కాగా, మరో ఇద్దరు కారం రాము, పండా సునిత దంపతులు. రాము మండలంలోని చింతరేవుపల్లి ఆదర్శ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గా పనిచేస్తుండగా, అతని సతీమణి పండా సునీత సోములగూడెం ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు ఏరాజకీయ పార్టీ అండదండలు లేవు. వీరేమి అగ్రవర్ణాలకు చెందినవారు కాదు. వీరిద్దరు అధికారుల మెప్పుకోసం వెంపర్లాడేవారు అంతకన్నాకాదు. ఇద్దరు కష్టపడి చదువుకున్న ఆదివాసీ బిడ్డలు, అన్నింటికి మించి సరస్వతి పుత్రులు, కటిక పేదరికం నుండి వచ్చిన ఆదర్శవంతులు. ఇక రేఖపల్లి కె.జి.బి.వి ప్రిన్సిపాల్ పెనుబల్లి వెంకమ్మ సైతం అత్యంత పేద కుటుంబం నుండి వచ్చినవారే. పైగా వీరు ముగ్గురు నిరుపేద ఆదివాసీ గిరిజనులు కావటం అత్యంత విశేషం. ఉత్తమ ఉపాధ్యాయులుగా నేడు జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న రేఖపల్లి కె.జి.బి.వి ప్రిన్సిపాల్ పెనుబల్లి వెంకమ్మ, రాము - సునిత దంపతులకు వి.ఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, జడ్.పి.టి.సి వాళ్ళ రంగారెడ్డి, ఎంఇఒ సి.హెచ్.బాబురావు అభినందనలు తెలిపారు.


**CHANGE OF NAME**

I, KOLLU SATYANARAYANA S/o NARASIMHA MURTHY, resident of D.No. 1-63/10, Kesavadasupalem Village, Sakhinetipalli Mandal, Dr. B.R. Ambedkar Konaseema Dist., A.P, Have changed my name from KOLLU VENKATA SATYANARAYANA (Old name) to KOLLU SATYANARAYANA. (New name). Hence after all my documents and correspondence will continue with my new name KOLLU SATYANARAYANA.

# ప్రేమ పేరుతో నమ్మించి.. మతమార్పిడికి ఒత్తిడి

## తనకు జరిగిన అన్యాయంపై రమ్యశ్రీ ఆవేదన.. న్యాయం చేయాలని వీహెచ్‌పీ డిమాండ్

పిఠాపురం, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త) కాకినాడ నగరానికి చెందిన రమ్యశ్రీ తనకు ఎదురైన పరిస్థితులపై విశ్వ హైందవ పరిషత్ నాయకుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తన వాదన ప్రకారం.. డిగ్రీ చదువుతున్న సమయంలో గౌస్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో తనను నమ్మించి మోసం చేశాడని ఆరోపించారు. అనంతరం తనపై మతమార్పిడికి ఒత్తిడి తెచ్చి, విశాఖపట్నంలోని ఓ మసీదులో వివాహం చేసుకున్నాడని ఆమె పేర్కొన్నారు. వివాహం అనంతరం తాను తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని, అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నానని రమ్యశ్రీ తెలిపా రు. ఒక దశలో జీవితంపై విరక్తి కలిగినప్పటికీ, తన కుమార్తె భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ధైర్యంగా నిలబడ్డానని ఆమె చెప్పినట్లు వీహెచ్‌పీ నాయకులు వెల్లడించారు. "నాకు జరిగిన బాధ మరో ఆడపిల్లకు రాకూడదు. ప్రేమ పేరుతో యువతులను మోసం చేస్తున్నారనే ఆరోపణలపై వాస్తవాలు వెలుగులోకి రావాలి. నాకు న్యాయం జరగాలి" అని రమ్య శ్రీ కోరినట్లు తెలిపారు. ఆమె చేసిన ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి, వాస్తవాలను నిర్ధారించాలని వీహెచ్‌పీ నాయకులు కోరారు. ఆరోపణలు రుజువైతే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళలకు సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

## గమ్యం నూతన విద్యాసంస్థకు భూమి పూజ



పెదపూడి సెప్టెంబర్ 4 ప్రభాతవార్త అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం పెద్దాడలో గమ్యం నూతన విద్యా సంస్థ ఏర్పాటుకు జి మామిడాడ గమ్యం విద్యాసంస్థల కరస్పాండెంట్ కర్రి శివారెడ్డి దంపతులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి శివారెడ్డి మాట్లాడుతూ పరిసర గ్రామాలు మండలాల్లోని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు సూచనల మేరకు పెద్దాడ గ్రామంలో గమ్యం విద్యాసంస్థల విస్తరణలో భాగంగా నూతన విద్యా భవన సముదాయానికి భూమి పూజ (శంకుస్థాపన) కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు. ఈ విద్యా సంవత్సరం గమ్యం విద్యాసంస్థలకు సీబీఎస్ఈ అనుమతి లభించడంతో పెద్దాడ లో గమ్యం విద్యాసంస్థల ఏర్పాటు ప్రారంభించామన్నారు. జి మామిడాడ గమ్యం విద్యాసంస్థల డైరెక్టర్ కె‌అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన తమ గ్రామంలో కార్పొరేట్ స్థాయి విద్యను సామాన్యులకు అందించాలని ఉద్దేశంతో పూర్తి డిజిటల్ క్లాసులతో విశాలమైన ఆట స్థలంలో ప్రారంభించిన గమ్యం ప్రస్థానం రాజమహేంద్రవరంలో గమ్యంవిద్యాసంస్థలనువిజయవంతంగానిర్వహిస్తున్నామని పెద్దాడలో విద్యాసంస్థలను నెలకొల్పుతున్నామని తెలిపారు. విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల సూచనల మేరకే గమ్యం విద్యాసంస్థలలో ఉన్నత విద్యలైనా డిగ్రీ వృత్తివిద్యా కోర్సు ఏర్పాటును ఆలోచిస్తున్నామన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ శాసనసభ్యులుసత్తిసూర్యనారాయణ రెడ్డి వచ్చారని తెలిపారు. గమ్యం విద్యాసంస్థలపై అభిమానంతో భూమి పూజకు వచ్చిన విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు గ్రామస్తులకు విద్యాసంస్థల సిబ్బందికి శివారెడ్డి మిత్ర బృందానికి గమ్యం మేనేజ్మెంట్ కెపద్మావతి కె సుగమ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఒమ్మి రఘురామ్:



జగ్గంపేట సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త) శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని జగ్గంపేట మండలంలోని వివిధ ప్రాంతాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థల అధినేత ఒమ్మి రఘురామ్ గుర్రంపాలెం గ్రామం, రామవరం గ్రామం, జగ్గంపేట పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీకృష్ణ పరమాత్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు.జన్మాష్టమి సందర్భంగా ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోతలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేయగా, భక్తులు భక్తిగీతాలు, కీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.ఈ సందర్భంగా ఒమ్మి రఘురామ్ మాట్లాడుతూ శ్రీకృష్ణుని జీవితం ప్రతి ఒక్కరికీ ధైర్యం, ధర్మం, కర్తవ్యనిష్ఠ, సమయస్ఫూర్తి, మానవతా విలువలను నేర్పుతుందని అన్నారు. భగవద్గీతతో శ్రీకృష్ణుడు బోధించిన కర్తవ్యమే ప్రధానమనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా ఆలయాల వద్ద నిర్వహించిన వేడుకల్లో పలువురు భక్తులు, స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, యువత మరియు మహిళలు పాల్గొని శ్రీకృష్ణుని ఆశీస్సులు పొందారు.ధర్మాన్ని కాపాడుతూ... కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ... సమాజానికి మంచి చేయడమే శ్రీకృష్ణుని బోధనలకు నిజమైన నివాళి అని ఒమ్మి రఘురామ్ పేర్కొన్నారు.

## శరవేగంతో రహదారి అభివృద్ధి పనులు..

### - ఏపీఆర్ఆర్ఎస్పి నిధులు-రూ.81 లక్షలతో బీటీ రోడ్డు..



అంబాజీపేట,సెప్టెంబర్ 4, (ప్రభాతవార్త): అంబాజీపేట మండలం కె.పెదపూడి గ్రామంలో ఈ నెల 9న ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం,వీధిలైట్లు నిర్వహణ తదితర పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. దీనిలో భాగంగా కె.పెదపూడిలో ఉన్న ఓఎన్జిసి రిగ్ లో ముఖ్యమంత్రి వచ్చే హెలికాప్టర్ దిగేందుకు హెలిప్యాడ్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అలాగే కె.పెదపూడి గ్రామ దేవత శ్రీ రాజేశ్వరి అమ్మవారి ఆలయం నుండి హెలిప్యాడ్ ఏర్పాటు చేయబోయే ఓఎన్జిసి రిగ్ వరకు రహదారి అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు.ఈ రహదారి అభివృద్ధిలో భాగంగా ఏపీఆర్ఆర్ఎస్పి నిధులు రూ. 81 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించేందుకు గత నెల 26న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ భూమిపూజ చేశారు. రహదారి నిర్మాణ పనులను కూటమి నాయకులతోపాటు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కంచి శ్రీనివాస్,పిడిఓ ఎ.యామిని, నియోజకవర్గ టిడిపి కో- కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, పెదపూడి శ్రీనివాసరావు, మంద రాజేష్, గుంటూరి మురళీకృష్ణంరాజు, రాయపరెడ్డి సత్యనారాయణ, పెచ్చెట్టి హరిబాబు,చిక్కం ఏసు, గొలకోటి నరేష్ తదితరులు ఉన్నారు.

## పరిశుభ్రమైన వాతావరణానికి ప్రజలు సహకరించాలి..

### -డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్..



అంబాజీపేట, సెప్టెంబర్ 4, (ప్రభాతవార్త): గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని డిప్యూటీ ఎంపీడీవో కంచి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మాచవరం పంచాయతీ పరిధిలోని డాక్టర్ వైయస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను శుక్రవారం చేపట్టారు. ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రహరీ ఆనుకుని గుట్టలుగా పేరుకుపోయిన మట్టిని జేసీబీ సహాయంతో ట్రాక్టర్ ద్వారా వేరే ప్రదేశాలకు తరలించారు. అలాగే పిచ్చిమొక్కలు పెరిగిన మొక్కలను తొలగించారు. దీనిలో భాగంగా వీధిలైట్లను మరమ్మతు చేసి, సురక్షిత తాగునీరు సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ మాచవరం గ్రామాన్ని "స్వర్ణ మాచవరం" గా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నామని దీనికి గ్రామ ప్రజల సహకారం ఉండాలన్నారు. ఇప్పటికే చెత్త వేయొద్దు" అని బోర్డులు పెట్టిన చోటే ఎక్కడి నుండో వచ్చి చెత్తను వేసి అపరిశుభ్ర వాతావరణాన్ని కలిగిస్తున్నారని, ప్రజల్లో మార్పు రాకపోతే పరిశుభ్ర వాతావరణానికి దూరమవుతామని శ్రీనివాస్ తెలిపారు. "స్వర్ణ మాచవరం" "పేరుతో గ్రామ సచివాలయం వద్ద బోర్డును ఏర్పాటు చేశారు. ఆయన వెంట డిపిఓ కెవివి సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది ఏసుబాబు, పితాని రాంబాబు తదితరులు ఉన్నారు.

## గండేపల్లి లో కృష్ణాష్టమి వేడుకలు



గండేపల్లి, సెప్టెంబర్ 4. ప్రభాతవార్త మండల కేంద్రమైన గండేపల్లి లో యాదవ సంఘం శ్రీ కృష్ణ యూత్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.స్వామి వారికి నిర్వహించిన పూజ కార్యక్రమంలో నీలాపు రామకృష్ణ దంపతులు వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి పూజ చేయించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా మామిడి తోరణాలు పువ్వులతో సుందరంగా అలంకరించారు . సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ గండేపల్లి గ్రామంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు 1977 నుండి సుమారు 50 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆరుగురు ఎంపిక

కె గంగవరం, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త): కె గంగవరం మండలం నుండి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆరుగురు ఉపాధ్యాయులు ఎంపిక కాబడినట్లు ఎంఈఓ లు నాగరాజు,అంజనేయులు తెలిపారు. శివల పాఠశాల నుండి టి కృపారావ్, సత్యవాడ పాఠశాల ఎస్ ఆర్ కె సత్యారావు, కె గంగవరం జి విడుకొండలు, ఎన్ శ్రీనివాస్, కోటిపల్లి బి శైలజ లు నేడు జరగబోయే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు ఎంపిక అయినట్లు తెలిపారు ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



పెదపూడి, సెప్టెంబర్ 04 ,ప్రభాతవార్త:శ్రీకృష్ణుడు జన్మదినోత్సవం సందర్భంగా పెదపూడి మండలంలోని 18 గ్రామాలలో శ్రీకృష్ణ జన్మాష్టమిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ప్రజలు ఇళ్లల్లో శ్రీకృష్ణుని ప్రతిమ పెట్టి పూలు, పండ్లు, శ్రీకృష్ణ పాదాలలంకరణతో పూజలు నిర్వహించారు.గ్రామ గ్రామాన ఉట్టి కట్టి వేడుకలు నిర్వహించుకున్నారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడలో గల శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం, బోడావారి వీధిలో గల శ్రీ అభయ గణపతి స్వామి వారి దేవస్థానం వద్ద ప్రజలంతా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించుకున్నారు. ఉట్టిని కట్టి యాదవ కులస్తులైన గొల్లవానితో ఉట్టి వేడుక ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ద్వారంపూడి బంగారెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు,సుఖశాంతులతో వర్ధిల్లుతారనే నమ్మకంతో ఉట్టి కుండలో మజ్జిగ, డబ్బులు వేయడం జరుగుతుందని, ఆ ఉట్టిని గొల్లవారు కొట్టి అందులోని మజ్జిగను ప్రజలపై జల్లడంతో సాక్షాత్తు శ్రీకృష్ణుడు ఆశీర్వదిస్తాడని ప్రజల నమ్మకం. అంతేకాకుండా పెద్దలు పిల్లలు తారతమ్యం లేకుండా ఉట్టి సంబరం నిర్వహించుకోవడం వల్ల కుల,మత, వయస్సు తారతమ్యం లేకుండా అందరూ కలిసికట్టుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మేడపాటి సాయిబాబా రెడ్డి, ద్వారంపూడి బంగారెడ్డి,కర్రి రామకృష్ణారెడ్డి, ద్వారంపూడి రవితేజా రెడ్డి,ద్వారంపూడి కృష్ణా రెడ్డి కర్రి భగవాన్ రెడ్డి, మేడపాటి హరినాథ్ రెడ్డి, ద్వారంపూడి లోవారెడ్డి, పడాల అయ్యప్పరెడ్డి, శ్రీసూర్యనారాయణ మూర్తి దేవస్థానం అర్చకులు రేజేటి రాంబాబు, శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు కోసు చిన్నరావుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



అడ్డతీగల సెప్టెంబర్ 04 ప్రభాతవార్త అడ్డతీగల మోడల్ ప్రైమరీ స్కూల్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు కోసు చిన్నరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కు ఎంపికయ్యారు. అడ్డతీగల మండలంలో గత 23 సంవత్సరాలుగా విద్యా సేవలు అందిస్తున్న ఆయన, విద్యార్థులకు చక్కని బోధనా ఉపకరణాలు, వీడియోలు, విజువల్ ప్యానెల్ బోర్డులు మరియు జాదూ బాయ్ వంటి వినూత్న పద్ధతుల్లో సులువైన బోధన అందించడంలో దిట్ట. అంతేకాకుండా విద్యార్థుల తల్లిదండ్రులకు లిప్ యాప్ ను డౌన్‌లోడ్ చేయించి, దాని ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యా ప్రమాణాల పెంపునకు నిరంతరం కృషి చేస్తున్నారు.పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచడంతో పాటు, ఎస్‌ఎంసీ సభ్యులు, గ్రామ పెద్దల నుంచి విరాళాలు సేకరించి బడి మౌలిక వసతుల కల్పనకు ఎంతగానో దోహదపడ్డారు. సహచర ఉపాధ్యాయులందరి మన్ననలు పొందిన ఆయన, సామాజిక స్పృహతో ఆపదలో ఉన్న తోటి ఉపాధ్యాయులను విరాళాలు సేకరించి ఆదుకోవడమే కాకుండా, పేద విద్యార్థులకు సైతం అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. తోటి ఉపాధ్యాయులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తూ మండల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న కోసు చిన్నరావు రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక కావడం పట్ల మండల విద్యాశాఖాధికారి పి. శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యాభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇర్రిపాకలో అష్టలక్ష్మి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు:



జగ్గంపేట, సెప్టెంబర్ 4: (ప్రభాతవార్త)జగ్గంపేట మండలం ఇర్రిపాక శివకేశవుల క్షేత్రంలో అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణుడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన మహోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది.ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు, టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల మణెమ్మ దంపతులు పీటలపై కూర్చుని ఈ శంకుస్థాపన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్, లక్ష్మీదేవి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 40 లక్షల రూపాయలు అష్టలక్ష్మి గుడికి, అదేవిధంగా రేపు అయోధ్య రామ మందిరం పోలిన రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహిస్తున్నామని ఆ రామాలయానికి 40 లక్షలు అందించడం జరిగిందని ఈ రెండు దేవాలయాలను భక్తుల సహకారంతో అత్యంత సుందరంగా నిర్మిస్తామని అన్నారు.ఇర్రిపాక క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, అష్టలక్ష్మి ఆలయంతో క్షేత్రానికి మరింత విశిష్టత వస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పిచ్చుకలంక వద్ద గోదావరిలో యువకుడు గల్లంతు..



ఆత్రేయపురం, సెప్టెంబర్ 04,(ప్రభాత వార్త) మండలంలోని బొబ్బర్లంక గ్రామ పరిధిలో పిచ్చుకలంక వద్ద గోదావరిలో శుక్రవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. రాజమండ్రికి చెందిన ముగ్గురు యువకులు సరదాగా పిచ్చుకలంక ప్రాంతానికి వచ్చారు. ఈ క్రమంలో మధ్యాహ్నం సమయంలో గోదావరి నది వద్ద కాళ్లు కడుక్కుంటుండగా వారిలో ఒకరు ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. గల్లంతైన యువకుడు వెలగలేటి సుజన్ తేజ (16)గా గుర్తించారు. అతను రాజమండ్రి నగరంలోని బాలాజీ పేటకు చెందిన రాజేష్ కుమారుడు. తోటి యువకులతో కలిసి నది ఒడ్డున ఉండగా ప్రమాదవశాత్తు నీటిలో జారి పడటంతో గోదావరి ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు సమాచారం. ఘటన విషయం తెలుసుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ, అతని ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.ఈ ఘటనపై యువకుడి తల్లి వెలగలేటి శ్రీకన్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై, ఎస్. రాము తెలిపారు.

## భక్త శ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### -ఆలయం లో విశేష అలంకరణ



శంఖవరం, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త మండలంలోని పలు గ్రామాలలో గల కృష్ణ ఆలయాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కత్తిపూడి లో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గల శ్రీ వేణుమాధవ్ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు .సుందరంగా అలంకరించిన వేదికపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి పూజలు నిర్వహించారు. పూజల్లో భాగంగా ఆలయ చైర్మన్ కాలింగ్ నూకరాజు ఆధ్వర్యంలో పురోహితులు వేమకోటి త్రినాథ్ శర్మ సత్యనారాయణ శర్మ లు వేదమంత్రోచ్చర్లనల మధ్య విఘ్నేశ్వర పూజ, శుద్ధి పుణ్యాహవాచనం ,మండపారాధన నవగ్రహారాధన ,శ్రీ సూక్తం పురుష సూక్తం రుద్ర నమకం చమకం, అష్టోత్తర శతనామం తో పాటు స్వామివారికి పంచామృత అభిషేకం గావించారు .అనంతరం మంత్రపుష్పం నీరాజనం నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారి నూతన పట్టు వస్త్రాలు వివిధ జాతుల పుష్పమాలలతో అలంకరించడంతో స్వామి వారు దేదీప్యమానంగా దర్శనమిచ్చరు. అనంతరం పలువురు చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో వచ్చి స్వామివారి దర్శించుకున్నారు . సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యుడు జీలకర్ర త్రిమూర్తులు ఎంపీటీసీ జిలకర విష్ణు గ్రామస్తులు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .

## సనాతన ధర్మ ప్రచారక్ అవార్డుతో కంబాలకు అరుదైన గౌరవం

### -రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల్లో విస్తృత సేవలకు గుర్తింపు



గోకవరం :ఆగష్టు 04 ప్రభాత వార్త సనాతన ధర్మ పరిరక్షణతో పాటు సమాజ సేవలో విశేషంగా కృషి చేస్తూ, పేద, నిరుపేదలకు అండగా నిలుస్తున్న విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావుకు అరుదైన గౌరవం దక్కింది. రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల్లో ఆయన నిర్వహిస్తున్న విస్తృత సేవా కార్యక్రమాలను గుర్తించిన రాజ్ న్యూస్ తెలుగు ఛానల్.. బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు--2026లో భాగంగా సనాతన ధర్మ ప్రచారక్--సాంస్కృతిక పరిరక్షణ అవార్డు'ను అందజేసింది. విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్ హాల్‌లో గురువారం రాత్రి నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ చేతుల మీదుగా కంబాల శ్రీనివాసరావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తన సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రతిష్టాత్మక అవార్డును అందించడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ప్రజలే తనకు దేవుళ్లని, వారి కష్టాల్లో అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ప్రజా సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ నిరంతరం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పేదలు, బడుగు బలహీన వర్గాలకు మరింతగా అండగా నిలుస్తానని కంబాల శ్రీనివాసరావు తెలిపారు. కంబాల శ్రీనివాసరావుకు ప్రతిష్టాత్మక అవార్డు లభించడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ప్రజా సేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

## ఉత్తమ ఉపాధ్యాయునిగా గ్లోరీ ఎంపిక



కాట్రేనికోన, సెప్టెంబర్0 4 (ప్రభాతవార్త ) నేడు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాట్రేనికోన మండలం సావరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం గా పనిచేస్తున్న సిహెచ్ గ్లోరీ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎన్నికయ్యారని ఎంఈఓ వెంకటరమణ తెలిపారు. నేడు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదుగా అవార్డ్ తీసుకోనున్నారని ఆయన తెలిపారు . ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

## యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు...



సఖినేటిపల్లి సెప్టెంబర్ 4, ప్రభాత వార్త: అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో యాదవ సంఘం పిలుపు మేరకు తుని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యెనుముల కృష్ణుడు పర్యటించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన నవ నరసింహ క్షేత్రాలలో నాలుగవది అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంతర్వేదిలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయాన్ని సందర్శించి, కృష్ణాష్టమి రోజునే తన పుట్టినరోజు కావటం విశేషమని ఆ రోజున విష్ణాలయం దర్శనం చేసుకుంటానని తెలిపారు. యాదవుల పెద్దలు కేకు కోయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. యెనుముల కృష్ణుడు మాట్లాడుతూ భగవద్గీత ప్రపంచానికి ఆదర్శమని, శ్రీకృష్ణుడి బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన తెలియజేశారు. రాత్రి ఉట్టు కొట్టి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, ఎం వెంకటేశ్వరావు, మాజీ గ్రామశాఖ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, వీరబాబు, పెద్దలు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



కాట్రేనికోన సెప్టెంబర్ 04 (ప్రభాతవార్త కాట్రేనికోన మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం భక్తులంతా ఘనంగా నిర్వహించారు. కాట్రేనికోన చెయ్యేరు , కందికుప్ప, కుండలేశ్వరం, పల్లంకురు, గొల్ల గరువు , మొక్కలతిప్ప,తదితర గ్రామాల్లో వేణుగోపాలస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ చోట్ల చిన్నారులను రాధాకృష్ణులుగా , గోపి గోపికలుగా విశేషంగా అలంకరించి ఆకట్టుకున్నారు. వెన్న, పాయాసం వంటివి నైవేద్యంగా పెట్టి స్వామి వారికి పూజలను అర్పించారు.

## పెదబొడ్డులో కన్నుల పండుగగా కృష్ణాష్టమి వేడుకలు.



తాళ్ళరేవు, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త): కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కోరంగి పంచాయతీ పెద బొడ్డు వెంకటాయపాలెం శ్రీ మహాలక్ష్మి ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో ప్రత్యేక అలంకరణలు చేసుకొని ఈ వేడుకల్లో అలరించారు. యువకులు ఉత్సాహంతో ఉట్టి కొట్టి సంబరాలు చేశారు. మహాలక్ష్మి అమ్మవారికి జై, జై శ్రీ కృష్ణ, భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాటం, భరతనాట్యం నృత్యాలు అలరించాయి. రంగ వల్లుల పోటీలలో గెలుపొందిన మహిళలకు, ఆటలు పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు కమిటీ ప్రతినిధులు, పెద్దలు బహుమతులు అందజేశారు

## షిర్డీసాయి విద్యానికేతన్లో అంగరంగ వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు




కడియం, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త) మండల కేంద్రం కడియంలోని శ్రీ షిర్డీసాయి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగమణి పాలేశ్వరరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా పాఠశాల చిన్నారులు బాలకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. నృత్య ప్రదర్శనలు, సుమధుర గీతాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చిన్నారుల ప్రదర్శనలను వీక్షించిన నాగమణి పాలేశ్వరరావు వారిని అభినందించి ఆశీర్వదించారు.అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ టీ. శ్రీధర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడమే పాఠశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. చిన్నారులకు పురాణాలు, ఇతిహాసాలపై అవగాహన కల్పించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల వారిలో ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని పాఠశాల డైరెక్టర్ టీ. శ్రీవిద్య పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఇన్‌చార్జిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు ప్రత్యేక కార్యక్రమాలు

### -ఈఆర్ఓ భాగ్యవతి



గోపాలపురం సెప్టెంబర్ 04, (ప్రభాతవార్త):ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకోవడంతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గోపాలపురం నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ పీ.భాగ్యవతి తెలిపారు. సెప్టెంబరు 5, 6 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఆయా తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) అందుబాటులో ఉంటారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో కొత్తగా 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, చిరునామా మారిన వారు, ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నవారు సవరణలు చేసుకునే అవకాశం ఉందన్నారు.అదేవిధంగా ప్రస్తుతం నివాసం లేని ఓటర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలిపోయిన వారు, మరణించిన వారి వివరాలను పరిశీలించి జాబితాను సరిచేయనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలని పీ.భాగ్యవతి సూచించారు.

## గొబ్బిలమడుగు గ్రామంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు.. చీరలు పంపిణీ



రాజవొమ్మంగి, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలం గొబ్బిలమడుగు గ్రామ రామాలయం వద్ద శుక్రవారం సమరసత సేవా ఫౌండేషన్ చలుమర్తి విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. గిరిజన పూజారులు కాకర అర్జునరావు కోసూరి సుబ్రమణ్యం, గోము వెంకటరమణలు మహిళలతో పూజలను చేయించారు. కంబాల శ్రీనివాసరావు పంపిన 30 చీరలను బీజేపీ ఉపాధ్యక్షులు తాము సూరిబాబు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు తాము సూరిబాబు, చలుమర్తి బన్ను, పీరు భద్రరావు, కోసూరి పండయ్య, చోడి శివకృష్ణ, నాగుల చిన్నబ్బాయి, బారీగా మహిళలు పాల్గొన్నారు.

## కిమ్మలగడ్డ గ్రామంలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం



రాజవొమ్మంగి, సెప్టెంబరు 04, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలం బడదనాంపల్లి పంచాయితీ కిమ్మలగడ్డ గ్రామంలో శుక్రవారం మండల టిడిపి పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో ఇంటింటా తెలుగుదేశం.. రెండేళ్ల కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను పెద్దిరాజు వివరించారు. గ్రామ కమిటీ అధ్యక్షులు చెక్క లోవ రాజు, టెకి నూకరాజు వెచ్చం లోవరాజు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

## ఆర్టీసీకి రెండు వీల్‌చైర్లు బహూకరణ



రావులపాలెం, సెప్టెంబరు 04 (ప్రభాతవార్త) : ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధులు, అవసరం ఉన్న ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో చిన్నం తేజా రెడ్డి ఆర్టీసీకి రెండు వీల్‌చైర్లను బహూకరించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ వీల్‌చైర్లను అందజేశారు. ఈ సందర్భంగా తేజా రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా రవాణా వ్యవస్థలో ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధులకు అవసరమైన సహాయక సౌకర్యాలు అందుబాటులో ఉండటం ముఖ్యమన్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నందున, వారి సౌకర్యార్థం తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వై వి వి ఎన్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ఎమ్ అచ్చుతాంబ, ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ జెపి. రావు, ఎల్ ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్య దేవుని గోసాల లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు..



అన్నవరం సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త) ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ఈరోజు కృష్ణాష్టమి పురస్కరించుకొని శ్రీ సత్యదేవుని గోశాలలో భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.. గోసాల సూపర్నెంట్ శౌంఠి మూర్తి, సిబ్బంది చౌదరి ఆధ్వర్యంలో గోసాల ఆవులు సంరక్షకుడు అశోక్ గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి గోసాల సిబ్బంది, గోవులు కాపర్లు గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఐ.వి రోహిత్,దేవస్థానం పాలకమండలి సభ్యులు, భక్తులు, గొల్లపేట పెద్దలు గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు..గో పూజలో పాల్గొన్న భక్తులకు ఆలయ తీర్థప్రసాదాలు అందజేశారు.

## పల్లె పండుగ 3.0తో గ్రామీణాభివృద్ధి

### -ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



రావులపాలెం, సెప్టెంబరు 04 (ప్రభాతవార్త) : పల్లె పండుగ 3.0 కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం దేవరపల్లిలో మినీ గోకులం (క్యాటిల్ షెడ్డు) నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధి కోసం రూ.4,290 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన కార్యక్రమమే పల్లె పండుగ 3.0 అని తెలిపారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ పేదల జీవనోపాధికి అండగా నిలిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా రూ.300 కోట్ల అంచనా వ్యయంతో మినీ గోకులాల నిర్మాణానికి చర్యలు చేపట్టిందన్నారు. పశువులకు సురక్షితమైన వసతి కల్పించడంతో పాటు పశుపోషకులు, రైతులకు ఈ నిర్మాణాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మినీ గోకులాలు కీలకపాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.

## ఇంటింటికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ జ్యోతుల నవీన్



గండేపల్లి, సెప్టెంబర్ 4. ప్రభాతవార్త గండేపల్లి మండలంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.మండలంలోని సింగరంపాలెం 1, రామయ్యపాలెం 2,గండేపల్లి 3, ఎన్ టి రాజాపురం 2, మురారి 1 మొత్తం 9 మందికి మంజూరైన 4 లక్షల 60 వేల రూపాయల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు,కందుల చిట్టిబాబు,కోర్పు సాయి తేజ, జాస్తి వసంత్,బొల్లం రెడ్డి రామకృష్ణ,అడబాల ఆంజనేయులు,అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

# భా జ పా కార్యవర్గ సమావేశం




**కె గంగవరం, సెప్టెంబర్ 4, (ప్రభాత వార్త):** కె గంగవరం మండల కార్యవర్గసమావేశం యండగండి గ్రామంలో బిజెపి మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు అధ్యక్షతన జరగగా ముఖ్య అతిధిగా ఎస్ఐఆర్ రామచంద్రపురం ఇన్చార్జి సలాదిశేఖర్ పాల్గొన్నట్లు ఓబిసిమోర్చ జిల్లా కార్యవర్గసభ్యులు కవులూరి వెంకటకృష్ణ తెలిపారు. రాష్ట్రనాయకులు గుర్రాల సత్యన్నారాయణ, జిల్లా కార్యవర్గసభ్యులు రామచంద్రపురం టౌన్ఇన్చార్జి ఎ వి రమణమూర్తి,హాజరైప్రసంగించారు.రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలకు మనందరం సంసిద్దం కావాలని పిలుపునిచ్చారు ఎస్ఐఆర్ లో ఫారమ్ 6 ద్వారా నూతన ఓటర్లను నమోదు చెయ్యాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి ఎ నారాయణమూర్తి,ఉపాధ్యక్షులు నున్న సత్యన్నారాయణ, ఓబిసి మోర్చ మండల అధ్యక్షుడు వాసంశెట్టిగోవింద్, రాయుడు వెంకటేశ్వర రావు,తాళ్ళ ముసలయ్య,కె కృపారావు,పి బ్రహ్మజీ,పి సత్యవేణి,కోడూరి జయలక్ష్మి,మహిళామోర్చ మండల అధ్యక్షురాలు కొప్పిశెట్టి హేమదుర్గ, తదితరులుపాల్గొన్నారు

# దోనెలపాలెం గ్రామంలో వర్షాలు కోసం పూజలు... అన్నదాన కార్యక్రమాలు



**రాజవొమ్మంగి, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం గడుఓకుర్తి పంచాయితీ దోనెలపాలెం గ్రామంలో శుక్రవారం టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు ముర్ల వీరబాబు ఆధ్వర్యంలో వర్షాలు కోసం గ్రామస్తులు ఐక్యంగా పూజలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను చేశారు. గ్రామంలో గల దూబాలమ్మతల్లికి 108 బిందెలు నీళ్ళతో జలాభిషేకం చేశారు. ఆలయం వద్ద అన్నప్రసాద కార్యక్రమం కూడా జరిగింది. గ్రామ పెద్దలు గోము రమణ, సడేలా లోవరాజు, పడాల ఉమామహేశ్వరరెడ్డి టీడీపీ సీనియర్ నాయకులు పడాల చిన్నబ్బాయి, టీడీపీ ఎస్టీ సెల్ నాయకులురెడ్డి వెంకటరమణ, ఈకా తమ్మన్నదొర, గ్రామస్తులు చదల నాగేశ్వరావు, చిర్లం చంటిబాబు, సుంకర వెంకటరమణ, చీమల పోతురాజు, మహిళలు పాల్గొన్నారు

# లొల్ల గ్రామంలో పోలీసుల "పల్లె నిద్ర"




**ఆత్రేయపురం, సెప్టెంబర్,04,(ప్రభాత వార్త)** గ్రామంలోని శాంతిభద్రతల కోసం ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని రావులపాలెం రూరల్ సీఐ,సీహెచ్ విద్యాసాగర్ అన్నారు.మండలంలోని లొల్ల గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో "పల్లె నిద్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై ఎస్. రాము, పోలీసు సిబ్బంది గ్రామంలో పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. గ్రామస్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలను సేకరించారు. గ్రామంలోని శాంతిభద్రతల పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలుసుకున్న పోలీసులు, ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తుల కదలికలు, అనుమానాస్పద కార్యకలాపాలు, చెడు నడత కలిగిన వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.
ఈ సందర్భంగా ప్రజలకు నూతన చట్టాలు, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రతా నియమాలు, పోక్సో చట్టం, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

# సెప్టెంబర్ 21న చలో అమరావతి



**రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త.** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 21న చలో అమరావతి చేపడుతున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. శుక్రవారం క్వారీ మార్కెట్ వద్ద నిర్మాణంలో ఉన్న కార్మిక భవనం వద్ద సమస్యల నిరసన దీక్ష చేపట్టారు. "కార్మికులకు నీడ ఎక్కడ?" అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్మిక భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి కార్మికులకు అందుబాటులోకి తీసుకురావాలని సంఘాల అధ్యక్షుడు బొజ్జా రామకృష్ణ డిమాండ్ చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. సెప్టెంబర్ 21న ప్రతి యూనియన్ నుంచి 500 మంది కార్మికులు అమరావతికి తరలివెళ్లి ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని వెల్లడించారు.

## ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా. రవిశంకర్ కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు.



**గండేపల్లి, సెప్టెంబర్ 4. ప్రభాతవార్త** గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.రవిశంకర్ కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కు ఎంపికైనట్లు ఉత్తర్వులు అందినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా ఎన్ సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డా సతీష్ రెడ్డి మాట్లాడుతూ డా.రవిశంకర్ విరామం లేని అక్షర సేద్యం చేస్తూ నిరంతరం ఫార్మసి రంగంలో నూతన ఆవిష్కరణలు కృషి చేస్తూ అత్యున్నత ప్రమాణాలు విద్యార్థులకు అందించాలనే సత్సంకల్పంతో క్లినికల్ ఫార్మసీ ఉ ఫార్మా కో తెరపుటిక్స్, ఫార్మా కాలేజ్ ఏ కాంప్రెహెన్సివ్ అప్రోచ్, కంపానియన్ హ్యాండ్ బుక్,సోషల్ అండ్ ప్రివెంటివ్ ఫార్మసీ మొదలగు పుస్తకాలు రచించి అందించారు. అంతేకాకుండా విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఉపయుక్తంగా ఇన్ విట్రో యాక్టివిటీస్ ఆఫ్ ఆన్టీడయాబెటిక్ ఎక్స్ట్రాక్ట్, ఫార్మకోకైనెటిక్ యాక్టివిటీస్ ఆఫ్ ఆంథ్రోపోమిక్ సెన్సరీ మొదలగు పుస్తకాలను ప్రచురించారు. అనేక జాతీయ అంతర్జాతీయ సమావేశాలలో దేశ, విదేశాల వేదికలపై విజ్ఞానదాయకంగా ఉపన్యాసం ఇచ్చారు.
జె.ఎన్.టి.యు.కె,పి.యు.కాకతీయ,నాగార్జున,డా.ఎం.జి.ఆర్.యూనివర్సిటీల ఎక్సమినర్ గా , దంటల ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్ మెంబర్ గా అనేక జర్నల్ కు ఎడిటోరియల్ మెంబర్ గా ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ గా సేవలు అందిస్తున్నారు. ఫార్మసీ విద్యా రంగంలో వారి విశేష కృషి కి గుర్తింపుగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2025–26 సంవత్సరానికి ఉత్తమ ఫార్మసీ ఉపాధ్యాయులుగా అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయం ఆనందదాయకం అని ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా రవిశంకర్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఛాన్సలర్ డా ఎన్ శేషారెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డా ఎం శ్రీనివాస్, రిజిస్ట్రార్ డా జి సురేష్, ప్రో వైస్ చాన్సలర్ లు, వివిధ విభాగాల డీన్ లు, విభాగాధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేసారు.

# గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ఆసుపత్రులను పరిశీలించిన ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి.







**చింతూరు సెప్టెంబర్ 4 ప్రభాత వార్త.**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి శుక్రవారం పోలవరం జిల్లాలోని చింతూరు, కూనవరం, ఎటపాక మండలాలతో పాటు భద్రాచలం పర్యటించారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గొల్లగుప్ప చిన్నారులకు మెరుగైన వైద్యం అందించలని కోరారు.చింతూరు మండలం బొడ్డుగూడెంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను,ఏడుగురాళ్లపల్లి గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను, లక్ష్మీపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కూనవరం మండలం నరసింగపేట గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను, కోతులగుట్ట గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార మెనూ వివరాలను తెలుసుకున్నారు. నూతన కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. రాబోయే జూన్ నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ పర్యటనలో కూటమి నాయకులు, గిరిజన నాయకులు కొండ్ల విజయ్ సాగర్ రెడ్డి, కత్తుల వెంకట రమణ రెడ్డి, నామాల శ్రీనివాసు, నోముల రామారావు, తమ్మినేని రామారావు, గేదె శ్రీను తదితరులతో పాటు సంబంధిత ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ వేణుగోపాల స్వామి అలంకరణలో ఉచ్చిలి, శ్రీ విజయ దుర్గ అమ్మవారు...



**ఆత్రేయపురం, సెప్టెంబర్, 04,(ప్రభాత వార్త)** శ్రావణమాసం నాలుగవ శుక్రవారం కావడంతో మండలంలోని గ్రామలలో ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో సందడి నెలకొన్నాయి.ఉచ్చిలి కాలవరేవులో వేంచేసియున్న శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకొని శ్రీ విజయ దుర్గ అమ్మవారు శ్రీ గోపాల స్వామివారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు అలాగే ఆత్రేయపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణమాసం నాలుగవ శుక్రవారం కావడంతో ఆత్రేయపురం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారు శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శ్రీవారి నెమలి పించాలతో ప్రత్యేక అలంకరణలో, శ్రీ లక్ష్మీ దేవి అమ్మవారికి గాజులతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు శ్రీ స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు, ఆలయ మేనేజర్ గోరింట వినయ్ కుమార్ రాజు ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## గోకులంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త):** మధురానగర్‌లోని గోకులంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్సీఎస్ గ్రూప్ అధినేత, గోకులం వ్యవస్థాపకులు నారాయణం మురళి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.నారాయణం మురళి, హిమబిందు దంపతులు విశేష సహస్రనామార్చనలో పాల్గొన్నారు. భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీకృష్ణ స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నామని మూడు రోజులపాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.సాయంత్రం చిన్నారులతో కృష్ణుడి వేషధారణ, కోలాటాలు, ఉట్టికొట్టే కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



**గండేపల్లి. సెప్టెంబర్ 4. ప్రభాతవార్త** 2026 సంవత్సరానికి గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు గండేపల్లి మండలం నుండి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈఓ లు కే హెచ్ నాయక్, కె వెంకటరెడ్డి లు తెలిపారు. నీలాద్రి రావు పేట ప్రాథమిక పాఠశాల నుండి సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయురాలు ఎస్ వి సూర్య కుమారి,పి నాయకంపల్లి ప్రాథమిక పాఠశాల నుండి సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు బిఎస్ఎస్ఆర్ గోపాల్ వీళ్ళిద్దరూ జిల్లాకు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరికి జిల్లా కేంద్రంలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేయునున్నారు. ఎంపికైన ఉపాధ్యాయులను ఎంఈఓ లు, ఉపాధ్యాయ సంఘాలు, నాయకులు అభినందించారు.

# నర్సరీ రైతుల అభివృద్ధికి సహకరిస్తాం

### -కొత్తపేట జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు



**కడియం ,ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త)** కడియం మండలం,కడియపులంక సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన సంస్థాగత ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బోర్సు సుబ్బారాయుడు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు ఆయనను కలిశారు.ఈ సందర్భంగా బండారు శ్రీనివాసరావు నూతన అధ్యక్షుడు బోర్సు సుబ్బారాయుడిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కడియం నర్సరీ రంగం అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని సుబ్బారాయుడు ఆయనను కోరారు. కడియం నర్సరీలు చుట్టుపక్కల గ్రామాలకు విస్తరించి వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నాయని, ఈ రంగం అభివృద్ధికి ప్రజాప్రతినిధుల సహకారం అవసరమని తెలిపారు.దీనిపై బండారు శ్రీనివాసరావు సానుకూలంగా స్పందిస్తూ నర్సరీ రైతుల సమస్యల పరిష్కారానికి, రంగం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తాడాల సత్యనారాయణ, పాఠంశెట్టి శ్రీనువాసు, పుల్లా శ్రీను, సానా రాజు, కామిశెట్టి వెంకటేష్, దేగల రాము, దూలం సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణాష్టమి వేళ గోకులానికి చక్రవర్తిరూ. 10,116 విరాళం..



**కడియం ,సెప్టెంబర్ 4 ( ప్రభాతవార్త)** శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన తాడాల విష్ణు చక్రవర్తి--రాజరాజేశ్వరి దంపతులు గోసేవకు తమ వంతు చేయూత అందించారు. మండల కేంద్రం కడియం గ్రామంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గోకులంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచే ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీకృష్ణ నామస్మరణతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగింది. వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా సాగాయి కృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకొని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల విష్ణు చక్రవర్తి, రాజరాజేశ్వరి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. అనంతరం గోకుల నిర్వహణతో పాటు గోవుల సంరక్షణ, గోసేవకు తమ వంతు సహాయంగా రూ.10,116 విరాళాన్ని అందజేశారు. భక్తి కార్యక్రమంతో పాటు సేవా కార్యక్రమానికి చేయూతనిస్తూ తమ సేవాభావాన్ని చాటుకున్నారు.గోకుల వ్యవస్థాపకుడు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, రామకృష్ణ తులసి దంపతులు కుటుంబ సభ్యులు సాయి సుబ్రహ్మణ్య చేతన్, సాయి దుర్గా కుసుమ, అరవింద్ రాజ్‌లతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, భక్తులతో కలిసి శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.శ్రీకృష్ణాష్టమి సందర్భంగా తాడాల విష్ణు చక్రవర్తి--రాజరాజేశ్వరి దంపతులు భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

# వైభవంగా సామూహిక వరలక్ష్మి కుంకుమ పూజలు..



**సఖినేటిపల్లి సెప్టెంబర్ 4, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మి కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు.శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో సుమారు 800 మంది ముత్తైదువులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు పి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు అధ్యక్షతన పూజా కార్యక్రమానికి హాజరైన భక్తులకు దేవస్థానం, దాతలు ఉచితంగా పూజా సామగ్రిని అందించారు. శ్రీ అమ్మవారి ఆశీస్సులతో కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని భక్తులు ప్రార్థించారు. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొనడంతో అంతర్వేది ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో సిబ్బంది పరివేక్షకులు పి విజయ సారధి, కిరణ్, శ్రీదేవి, సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 14 నుంచి భక్తిశ్రద్ధలతో గణేశ ఉత్సవాలు

### -23, 24 తేదీల్లో నిమజ్జనం, నగర గణేశ ఉత్సవ సమితి



**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 4(ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ మండలం సూర్యరావుపేట బీచ్ లో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే గణపతి నవరాత్రులు అనంతరం నిమజ్జనం ఏర్పాట్లను శుక్రవారం నగర గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పర్యవేక్షించారు. కాకినాడ రూరల్ పరిధిలో 800 గణేశ మండపాలు ఏర్పాటు కానుండగా, జిల్లా ప్రాంతాలతో కలిపి సుమారు 1,200 విగ్రహాలు నిమజ్జనానికి తరలివస్తాయని వీటిలో 600 వరకు భారీ విగ్రహాలు ఉంటాయన్నారు.సమితి అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 22 వరకు నవరాత్రి ఉత్సవాలు, 23, 24 తేదీల్లో రెండు రోజులపాటు నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫ్లడ్‌లైట్లు, క్రేన్లు, గజ ఈతగాళ్లు, వైద్య శిబిరం, తాగునీరు, ట్రాఫిక్, శాంతిభద్రతల ఏర్పాట్లు చేయనున్నట్లు రూరల్ ఇన్‌చార్జి రంభాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లను సమీక్షించారు.చీడిగ రేవు, చిన్నకాశీ రేవుల వద్ద కూడా నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనం రోజున గణపతి మహిళా సమితి ఆధ్వర్యంలో సముద్రానికి గంగా హారతి నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# స్థానిక ఎన్నికల్లో బీఎస్పీ అన్ని చోట్లా పోటీ

### -సెప్టెంబర్ 9న విజయవాడలో వేలాది మందితో బహిరంగ సభ: గౌతమ్



**రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త,** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానాల్లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు జరిగాయని ఆరోపించిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వంలోనూ పోలీసుల ద్వారా దళితులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. దళితుల సమస్యల పరిష్కారం కోసం బీఎస్పీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి, స్థానిక ఎన్నికల్లో అన్ని ప్రాంతాల్లో అభ్యర్థులను బరిలోకి దింపుతామని చెప్పారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 9న విజయవాడలో వేలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల నుంచి బీఎస్పీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణరావు, ఏలూరు అశోక్, జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, గునుపు చిత్రసేన, ఇసుకపట్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ర్యాలి శ్రీ జగన్మోహనుడి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు...



**ఆత్రేయపురం, సెప్టెంబర్ 04,(ప్రభాత వార్త)** అతి పురాతన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న స్వయంభూ క్షేత్రం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి, గోపాల స్వామి వారి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకొని ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో క్షేత్రపాలకులైన శ్రీ గోపాల స్వామి వారి ఆలయంలో ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాః వచనం, పంచామృత అభిషేకం, చందనం, నవనీతములతో అలంకరణ, సహస్రనామ పూజ, అమ్మవార్లకు కుంకుమ పూజ, గోపూజ అనంతరం నీరాజన మంత్రపుష్పములు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. శ్రీ స్వామివారి సేవలో ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, భక్తులు, దాతలు, గ్రామస్థులు పాల్గొని తీర్థ ప్రసాదముల స్వీకరించారు.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# డాక్టర్ గవరసాన సేవలు చిరస్మరణీయం



**గొల్లప్రోలు, సెప్టెంబర్ 4,(ప్రభాతవార్త)** విద్య,వైద్య రంగాలకు ప్రవాస భారతీయులు,ప్రముఖ క్యాన్సర్ పరిశోధకులు డాక్టర్ గవరసాన సత్యనారాయణ చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు.డాక్టర్ గవరసాన జయంతిని శుక్రవారం గొల్లప్రోలు లోని స్వామి వివేకానంద జ్ఞాన మందిరంలో స్వచ్ఛ గొల్లప్రోలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గవరసాన చిత్రపటానికి పలువురు పూలమాలు వేసి నివాళులర్పించారు.అనంతరం పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఎంతో కృషి చేశారన్నారు.అలాగే స్థానికంగా ఒక పాఠశాల ఏర్పాటు చేసి అభివృద్ధి చేయడంతో పాటు,మరో పాఠశాల అభివృద్ధికి ఆర్థికంగా సహకారం అందించారన్నారు.రైతు సమస్యల పరిష్కారం కోసం సైతం పాటు పడ్డారని తెలిపారు.డాక్టర్ గవరసాన సేవలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమాజ సేవకు కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద జ్ఞాన మందిరం వ్యవస్థాపకులు పడాల కన్నారావు, మాజీ ఎంపీపీ వర్ధనపు వీర్రాజు, ప్రముఖ యోగా గురువు డాక్టర్ జ్యోతుల నాగేశ్వరరావు,స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొసిరెడ్డి రాజా, సభ్యులు కొమ్ము సత్యనారాయణ, చోడపునీడి పుల్లపరాజు, కర్రి కొండలరావు,పడాల బాలరాజు, కంకటాల వాసు,గుదే నాగు, బోడకుర్తి మహేష్,పెదిరెడ్ల వెంకట్రాజు,చేదులూరి సత్యనారాయణ,మైనం రాజ శేఖర్,గొల్లప్రోలు చరితామృతం గ్రంథ రచయిత బొజ్జా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీకృష్ణుడికి వెండి కిరీటం సమర్పణ..

### -ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు..



**అంబాజీపేట,సెప్టెంబర్ 4,(ప్రభాతవార్త):** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంబాజీపేట మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాచవరం దొమ్మేటివారిపాలెంలో శ్రీ కృష్ణ శెట్టిబలిజ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ మందిర్లో కొలువుతీరిన శ్రీకృష్ణునికి స్థానిక భక్తులు వెండి కిరీటాన్ని శుక్రవారం బహుకరించారు. దాతలు దొమ్మేటి సాయిరామ్- ఈశ్వరి దంపతులు,వీరి కుమార్డు వీరవెంకట గణపతి-సువర్ణ దంపతులు, మనుమల అధ్వర్యంలో శ్రీకృష్ణునికి రూ.5.10 విలువ చేసే వెండి కిరీటాన్ని అలంకరించారు. అంతకుముందు అర్చకులు ఫణి పర్యవేక్షణలో వెండి కిరీటానికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కె.ఫణి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణునికి పంచామృతాభిషేకాలను నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భారీ అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం యువకులు కేరింతల నడుమ ఉట్టికొట్టారు. అంబాజీపేట స్త్రీల ఆస్పత్రి సమీపంలో దొమ్మేటివారిపాలెం గ్రామస్తులు పాల్గొని ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అలాగే అంబాజీపేట పెద్ద వీధి రామాలయం వద్ద శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే మాచవరం మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# కనకదుర్గమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు




**రావులపాలెం, సెప్టెంబరు 04 (ప్రభాతవార్త) :** రావులపాలెం మండలం ఈతకోట గ్రామంలోని జాతీయ రహదారి చెంత కొత్త సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముతైదువులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు ఖండవల్లి నారాయణాచార్యులు, ఖండవల్లి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రత పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో ముతైదువులు, మహిళలు పాల్గొని శ్రావణమాస వ్రతాన్ని ఆచరించారు. పూజకు అవసరమైన సామగ్రిని ఆలయ కమిటీ నిర్వాహకులు అందజేశారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ జనిపిరెడ్డి గోవిందరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఘనంగా కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు



**గండేపల్లి, సెప్టెంబర్ 4. ప్రభాతవార్త** గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.వేద పండితులచే మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కి రామకుర్తి జగదీశ్వరరావు దంపతులు పీటల మీద కూర్చునిపూజలు నిర్వహించారు.అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, జగ్గంపేట వైసిపి ఇన్చార్జ్ తోట నరసింహం, తోట రాంజీ, ఎంపీపీ చలగళ్ల దొరబాబు,నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps